# భారత్ శక్తి®

తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:44 హైదరాబాద్, మంగళవారం, 29 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00



## ఎస్ఐఆర్‌పై స్టే ఇవ్వలేం

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియపై ఇప్పటికిప్పుడు మధ్యంతర స్టే ఇవ్వలేమని తేల్చి చెప్పిన అత్యున్నత న్యాయస్థానం.. ఓటరు జాబితా సవరణకు ఆధార్‌తోపాటు ఓటరు గుర్తింపు కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ఈసీకి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు ధ్రువీకరణలను వాస్తవమై నవిగా భావిస్తున్నామంది. 'రేషన్ కార్డులకు సంబంధించి చూస్తే వీటిని తేలిగ్గా ఫోర్జరీ చేయొచ్చు. కానీ, ఆధార్, ఓటర్ కార్డులను వాస్తవమైనవిగా భావించొచ్చు. ఈ రెండు ధ్రువీకరణలను అనుమతించండి'అని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం తెలిపింది.

## నేటి భారతం...

హైదరాబాద్ లో హైడ్రా అంటే
తొలుత ఏహ్యాభావం కలిగినా..
ఈ వర్షాకాలంలో హైడ్రా చేస్తున్న కృషి
అభినందనీయం అని చెప్పవచ్చు..
ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని
అహర్నిశలు కృషి చేస్తున్న
హైడ్రా ఖచ్చితంగా నగర ప్రజల హృదయాలను
దోచుకుంటోంది.. ఇందులో ఎలాంటి అనుమానం లేదు..
హైడ్రాతో పాటు, జీ హెచ్ ఎం సి,
డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు బృందాలు సంయుక్తంగా
పనుల్లో పాల్గొంటుండం ముదావహం..
ఈ వ్యవహారం ఇలాగే కొనసాగితే
క్లీన్ హైదరాబాద్ ను చూడగలుగుతాం..
నగరవాసులు ఇక్కట్లనుండి బయటపడగలుగుతారు..
హేట్స్ ఆఫ్ టు హైడ్రా రంగనాథ్..

– బోయినపల్లి రమణ..
సీనియర్ జర్నలిస్ట్..




## జైపాల్‌రెడ్డికి నివాళి

12లో

# సభలో సిందూరం

- ఆపరేషన్ సిందూర్‌పై వాడీవేడీ చర్చ
- పార్లమెంట్‌లో సోమవారం కొనసాగిన రభస
- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చ చేపట్టాలని రాజ్యసభలో పట్టుబట్టిన విపక్షసభ్యులు
- పార్లమెంట్ మకర ద్వారం ముందు విపక్షాల ఆందోళనలు

12లో






12లో

# ఢిల్లీలోనే తేల్చుకుంటాం

- బీసీ రిజర్వేషన్లపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఆందోళనలకు కార్యాచరణ
- హస్తినకు వెళ్లనున్న సీఎం, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు

### హైకోర్టుకు నలుగురు

# అదనపు న్యాయమూర్తులు



12లో

# త్వరలో ఒకటే స్టాంపు పేపర్!

- రూ.20, రూ.50 ఎన్‌జేఎస్ పేపర్ల రద్దు యోచన
- అన్నింటికీ రూ.100 స్టాంపు పేపరే వాడకం
- కొన్ని వర్గాలకు, కొన్ని పనుల్లో 'స్టాంపు'మినహాయింపు
- బూట్ పద్ధతిలో చేపట్టే పనులపై 0.5 శాతం స్టాంపు డ్యూటీ
- సరికొత్త విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు




హైదరాబాద్: జూలై 28 సరికొత్త స్టాంపుల విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లలో రూ.20, రూ.50 విలువగల పేపర్లను రద్దుచేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

12లో



# తుక్కు పాలసీ తుస్సు!

12లో



# మీరు ఇటూ.. అటూ..

## కృష్ణా జలాల వివాదంపై సుప్రీంకోర్టు ప్రశ్న

దిల్లీ:జూలై 28 తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కృష్ణా జలాలపై వివాదం నేపథ్యంలో మీరు ఎటువైపు ఉన్నారంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సన్నివేశం సోమవారం చోటుచేసుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి అప్పగిస్తూ కేంద్రం 2021, 2022లలో జారీచేసిన నోటిఫికేషన్‌లపై స్టే ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించిన విషయం తెలిసిందే. అదే సమయంలో కేంద్ర నోటిఫికేషన్ల ప్రకారమే ప్రాజెక్టుల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించేలా ఆదేశాలివ్వాలని, దీనిపై తుది నిర్ణయం వచ్చేవరకు తెలంగాణ జారీ చేసిన జీవో–34ని సస్పెండ్ చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం రెండు వేర్వేరు రిట్‌పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే. ఇదివం–కు విచారణ జరిపిన జస్టిస్ అభయ్ ఎస్.ఓక పదవీ విరమణ చేయడంతో సోమవారం ఈ కేసులు జస్టిస్ రాజేష్ బిందల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. తొలుత తెలంగాణ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ జోక్యం చేసుకుంటూ వీటికి కొంత సమయం పట్టే అవకాశమున్నందున సెప్టెంబరులో తీసుకోవాలని కోరారు. అప్పుడు జస్టిస్ మన్మోహన్ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ఎక్కడున్నారని ప్రశ్నించారు.

తాము హాజరైనట్లు న్యాయవాది స్పందించడంతో "మీరు ఎక్కడున్నారు? అటువైపా, ఇటువైపా... లేదంటే మధ్యనా?" అని జస్టిస్ రాజేష్‌బిందల్ ప్రశ్నించారు. దాంతో న్యాయ

12లో

# డిసెంబర్‌లో రోబోట్ సహిత అంతరిక్ష నౌక ప్రయోగం

## ఇస్రో చైర్మన్ నారాయణన్ వెల్లడి



చెన్నై::జూలై 28రోబోట్‌తో కూడిన మొదటి అంతరిక్ష నౌకను డిసెంబర్‌లో ప్రయోగించనున్నామని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 30వ తేదీన శ్రీహరి కోట నుంచి నాసా సహకారంతో ఇస్రో నిషార్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు ఆయన చెప్పారు. ఇందులోని ఎస్–బ్యాండ్ సింథటిక్ యాక్సిలేటర్ పూర్తిగా దేశీయంగా తయారు కాగా, మరో ఎల్‌బ్యాండ్ సింథటిక్ యాక్సిలేటర్ అమెరికాలో తయారైందని వివరించారు. సింథటిక్ ఎపర్చర్ రాడార్(ఎస్ఏఆర్) ఉపగ్రహం 24 గంటలు అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ భూమికి సంబంధించి చక్కటి ఫొటోలను తీస్తుందన్నారు.

సహజ వనరులు, కొండ చరియలు విరిగి పడే విపత్తులను గుర్తిస్తుందన్నారు. ఇది 12 రోజులకోసారి మొత్తం భూమి చిత్రాన్ని తీసి భారత్‌తోపాటు అన్ని దేశాలతో పంచుకుంటుందన్నారు. మానవ రహిత రోబోట్‌తో కూడిన అంతరిక్ష నౌకను శ్రీహరికోటలో సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. 2027లో మానవ సహిత అంతరిక్ష యాత్రపై దృష్టి పెట్టనున్నామన్నారు. దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఆమోదం తెలిపారని, చంద్రయాన్ 4 పనులు చురుగ్గా జరుగుతున్నాయని, చంద్రయాన్ 5 పైనా ఇక దృష్టి పెడుతామని నారాయణన్ పేర్కొన్నారు.



# పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ హతం

### 'ఆపరేషన్ మహాదేవ్'తో మట్టుబెట్టిన సైన్యం
### సోనామార్గ్ టన్నెల్ దాడి ముష్కరుడూ మృతి
### మరో ఉగ్రవాది ఎన్‌కౌంటర్
### సైన్యానికి భారీ విజయం

శ్రీనగర్:జూలై 28 జమ్మూ కశ్మీర్‌లో సైన్యం భారీ విజయం సాధించింది. ముగ్గురు కీలక ఉగ్రవాదులను అంతమొందించింది. వీరిలో పహల్గాం ఉగ్ర దాడికి కుట్ర పన్నిన ము–ష్కరుడూ ఉన్నాడు. జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ శివార్లలో ఉన్న అటవీ ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. 'ఆపరేషన్ మహాదేవ్' పేరుతో సైన్యానికి చెందిన ఎలైట్ పారాకమాండోలు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో పహల్గాం ఉగ్ర దాడికి సూత్రధారిగా భావిస్తున్న సులేమాన్ అలియాస్ ఆసిఫ్‌తోపాటు అతడి ఇద్దరు అనుచరులు హతమయ్యారు. భద్రతా దళాలు అంతమొందించిన ఉగ్రవాదుల్లో గత ఏడాది సోనామార్గ్ టన్నెల్ పేల్చివేతలో పాల్గొన్న జిబ్రాన్ ఉన్నాడు. మరో ఉగ్రవాదిని హమ్జా అఫ్గానీగా గుర్తించారు. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు శాటిలైట్ ఫోన్‌ను ఉపయోగించడంతో భద్రతా దళాలు.. వారి ఉనికిని పసిగట్టాయి. అలాంటి ఫోన్‌నే పహల్గాం ఉగ్ర దాడి సందర్భంగా వినియోగించారు. దీంతో వెంటనే స్పందించిన పారాకమాండోలు మెరుపు దాడి చేసి ము–ష్కరులను హతమార్చారు. ముల్నార్ గ్రామ సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనా స్థలంలో ఒక ఎం4 కార్బైన్ రైఫిల్, ఇతర ఆయుధ సామగ్రి లభించాయి. ఉదయం 11.30 గంటల సమయంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్ సభ్యులు, 4వ పారా యూనిట్ సిబ్బంది.. ముగ్గురు ఉగ్రవాదుల ఉనికిని గుర్తించారని, సుదీర్ఘ ఆపరేషన్ తర్వాత ముగ్గురు ముష్కరుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని కశ్మీర్ జోన్ ఐజీ వీకే బిర్ది తెలిపారు

భారతశక్తి

## 5 రోజుల్లో లక్ష కోట్లకు పైగా సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకొని ఉంటాయి. ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ముందుగానే మనం ఊహించలేం. మార్కెట్లపై సరైన అవగాహన ఉన్నప్పుడే.. ఆయా కంపెనీల నుంచి వచ్చే ప్రకటనలు, ప్రణాళికలు, పెట్టుబడి వ్యూహాలు, ఫలితాలు ఇలా ఇవన్నీ స్టాక్ గమనంతో పాటు స్టాక్ మార్కెట్ గమనాన్ని కూడా నిర్దేశిస్తుంటాయి. అందుకే జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇంకా సరైన సమయంలో సరైన కంపెనీ స్టాక్‌ను నిపుణుల సలహాతో ఎంచుకోవాలి. ఇదే సమయంలో షార్ట్ టర్మ్‌లోనే లాభాలు రావాలని కూర్చోవద్దు. ఓపిక ఉండాలి. దీర్ఘ కాలంలోనే బంపర్ రిటర్న్లు వస్తుంటాయని నిపుణులు ఎప్పుడూ చెబుతుంటారు.అయితే గత కొంత కాలంగా దేశీయ స్టాక్ మార్కెట్లు నేలచూపులు చూస్తున్నాయి. గత వారం షేర్ మార్కెట్లో గణనీయమైన హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. ముఖ్యంగా సెన్సెక్స్ టాప్-10 జాబితాలోని పలు కంపెనీల పెట్టుబడిదారులు నష్టాలను చవిచూశారు. మార్కెట్ విలువ పరంగా దేశంలోనే అతిపెద్ద సంస్థ అయిన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు టాటా గ్రూప్‌కు చెందిన టీసీఎస్, ఎల్ఐసీ వంటి సంస్థలకు గత వారం నిరాశజనకంగా ముగిసింది. అయితే ఈ పతనంలో రిలయన్స్ పెట్టుబడిదారులు అతిపెద్ద షాక్‌ను చవిచూశారు. కేవలం 5 పని దినాల్లో వారి సంపద రూ.లక్ష కోట్లకు పైగా తగ్గింది.వరుస సెషన్లలో పతనం దిశగానే సాగుతున్నాయి. ఇన్వెస్టర్లు తీవ్ర ఒత్తిడితో ఆయా షేర్లను విక్రయిస్తుండటం కారణంగా స్టాక్స్ పడిపోతుండటంతో పాటు వారు కూడా నష్టాల్ని ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, కార్పొరేట్ కంపెనీల బలహీనమైన త్రైమాసిక ఫలితాలకు తోడు.. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ కఠిన నిర్ణయాలు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి.ఇక గత వారం కూడా సూచీలు భారీగానే పడిపోయాయి. బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 294.64 పాయింట్లు పడిపోయింది. ఈ క్రమంలోనే చాలా స్టాక్స్ పడిపోగా.. దేశంలో మార్కెట్ విలువ పరంగా టాప్-10 కంపెనీల్లో 6 కంపెనీల విలువనే ఏకంగా రూ. 2.22 లక్షల కోట్లు తగ్గడం గమనార్హం. ఇందులో దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్‌లో ఉంది. రిలయన్స్ సంస్థ ఎం- క్యాప్ 5 రోజుల వ్యవధిలో ఏకంగా రూ. 1.14 లక్షల కోట్లు తగ్గగా ఇప్పుడు అది రూ. 18.83 లక్షల కోట్లకు దిగొచ్చింది.ఆ తర్వాత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఉంది. ఇన్ఫీ మార్కెట్ విలువ గత వారం రూ. 29 వేల కోట్లకుపైగా తగ్గగా ప్రస్తుతం ఎం - క్యాప్ రూ. 6.29 లక్షల కోట్లుగా ఉంది. ఇదే సమయంలో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. రూ. 23 వేల కోట్ల పతనంతో రూ. 5.60 లక్షల కోట్లకు దిగొచ్చింది. ఇక టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 20 వేల కోట్లు తగ్గి రూ. 11.34 లక్షల కోట్లకు పడిపోయింది. బజాజ్ ఫినాన్స్ ఎం క్యాప్ రూ. 17 వేల కోట్లు తగ్గింది. హిందుస్థాన్ యూనిలివర్ మార్కెట్ విలువ రూ. 17 వేల కోట్లు పడిపోయింది.వీటికి భిన్నంగా మరో 4 కంపెనీల విలువ అమాంతం పెరిగింది. ఫలితాల్లో ఈ కంపెనీలు అంచనాల్ని మించగా.. షేర్లు పెరిగాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్‌లో నిలిచింది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 37 వేల కోట్లు పెరిగి రూ. 15.38 లక్షల కోట్లకు ఎగబాకింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎం క్యాప్ రూ. 35 వేల కోట్లు పెరగడంతో రూ. 10.53 లక్షల కోట్లుగా ఉంది. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ. 20 వేల కోట్లు పెరిగి రూ. 11.04 లక్షల కోట్ల వద్ద ఉంది. అంతకుముందు వారం ఇది మార్కెట్ విలువలో టీసీఎస్‌ను మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ తగ్గింది. ఎస్బీఐ ఎం - క్యాప్ రూ. 9 వేల కోట్లు పెరిగి రూ. 7.44 లక్షల కోట్లకు చేరింది.స్టాక్ మార్కెట్ లో వచ్చిన పతనం కారణంగా బే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ని 30 షేర్ల సెన్సెక్స్ 294.64 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఈ పరిణామంలో సెన్సెక్స్ టాప్-10లో 6 కంపెనీల మార్కెట్ క్యాప్ సంయుక్తంగా రూ.2.22 లక్షల కోట్ల భారీ పతనాన్ని చవిచూసింది. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ వంటి దిగ్గజ సంస్థలు ఉన్నాయి. అయితే ఈ పతనంలో కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ సహా నాలుగు సెన్సెక్స్ కంపెనీల మార్కెట్ విలువ పెరిగి పెట్టుబడిదారులకు ఊరటనిచ్చింది.గత కొన్ని వారాలుగా దేశంలోనే అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ మార్కెట్ క్యాప్ తగ్గినప్పటికీ ఇది ఇప్పటికీ దేశంలో అత్యంత విలువైన కంపనీల జాబితాలో నంబర్ 1 స్థానంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. దీని తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్ , బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ ఉన్నాయి. మార్కెట్ ఒడిదుడుకులు ఉన్నప్పటికీ రిలయన్స్ తన స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం.

# ఓవర్ టూ ఢిల్లీయేనా...

విజయవాడ, జూలై 28

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. లిక్కర్ స్కామ్ కేసులో వరసగా అరెస్ట్ లు జరుగుతుండటంతో పాటు తనకు అత్యంత ఆప్తులైన వారిని జైల్లోకి పంపుతుండటంతో వైఎస్ జగన్ ముఖ్యమైన నిర్ణయం వైపుగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే లిక్కర్ స్కామ్ కేసులో పన్నెండు మంది అరెస్టయ్యారు. అందులో తన కార్యాలయంలో పనిచేసిన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు తనకు అత్యంత ఆప్తులైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ కావడంతో మనస్తాపం చెందిన వైఎస్ జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. అందులో ఒక ప్రచారానికి వస్తే త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఢిల్లీకి వెళ్లి బీజేపీ నేతలను కలసి ఏపీ లిక్కర్ స్కామ్ విషయంపై చర్చిస్తారంటున్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఎక్సైజ్ శాఖకు మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని, తాను అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో 2019 నుంచి 2024 వరకూ వచ్చిన ఎక్సైజ్ ఆదాయంపై బీజేపీ నేతలకు వివరించే అవకాశముందని ప్రచారం జరుగుతుంది. అయితే జగన్ ఇప్పట్లో ఢిల్లీ వెళ్లే అవకాశాలు లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీకి వెళ్లి ఎవరినీ కలిసే ఉద్దేశ్యం లేదని, మద్యం కేసును న్యాయపరంగానే ఎదుర్కొనేందుకు జగన్ సిద్ధమవుతున్నారని అంటున్నారు. దీంతో పాటు మరో ముఖ్యమైన ప్రచారం జరుగుతుంది. వైసీపీ నేతలపై అక్రమ కేసులు, అరెస్ట్ లకు నిరసనగా వైసీపీ శాసనసభ్యులందరితోనూ రాజీనామా చేయిస్తారన్న ప్రచారం జరుగుతుంది. తనతో పాటు గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలందరి చేత రాజీనామా చేయించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున కథనాలు వెలువడుతున్నాయి. అయితే గతంలో మాదిరిగా ఇప్పుడు రాజీనామాల అస్త్రాల ప్రయోగం జగన్ చేయరన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. గెలిచిన నియోజకవర్గాల నుంచి రాజీనామాలు చేసి తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేయడం అంటే ప్రజలలో ఒకరకమైన వ్యతిరేక భావన ఏర్పడుతుందని భావిస్తున్నారు. నాడు సెంటిమెంట్ కారణంగా రాజీనామాలు చేస్తే వర్కవుట్ అయ్యాయి. కానీ ఇప్పుడు అరెస్ట్ లను సాకుగా చూపి రాజీనామాలు చేయించినంత మాత్రాన జరిగేదేమీ లేదన్న విషయం జగన్ కు తెలియంది కాదు. ఉప ఎన్నికల్లో ఈసారి గెలుపు కూడా కష్టమే అవుతుంది. సెంటిమెంట్ లేకపోగా, సానుభూతి రాకపోగా అసలుకే ఎసరు వచ్చి ప్రస్తుతం పార్టీకి ఉన్న హైప్ కూడా పోతుందని ఆయన గట్టిగా భావిస్తున్నారు. అందుకే కేసులకు భయపడి ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి సాగిలపడటం, అలాగే ఉన్న ఎమ్మెల్యేల చేత రాజీనామాలు చేయించడం జరగదని వైసీపీకి చెందిన సీనియర్ నేత ఒకరు చెప్పారు. అవన్నీ ప్రచారం మాత్రమేనని, వాస్తవానికి దూరంగా అటువంటి విశ్లేషణలు ఉన్నాయని చెబుతున్నారు.

# 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత

తిరుపతి, జూలై 28,



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలోని 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు బ్యాడ్జిని అధికారులు చంద్రబాబుకు అందించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ4 కార్యక్రమంపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు."కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నాను. ఆ కుటుంబాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాది. మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపు ఇస్తున్న నేను.. చెప్పడమే కాదు.. ఆచరించి చూపాలని 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నా. ఈ కుటుంబాల అభ్యున్నతి కోసం ప్రణాళిక రూపొందిస్తాను. ఐయామ్ ఏ మార్గదర్శి. సమాజంలో పేద-ధనికుల మధ్య అంతరాలు తగ్గించే ఇలాంటి కార్యక్రమాన్ని ఎక్కడా చేపట్టలేదు. గతంలో జన్మభూమి స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేస్తే.. ఇప్పుడు పేదలను ఆదుకునేందుకు పీ4 అమలుకు ప్రణాళికలు చేపట్టాం. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచేలా రూపొందించాం. పేదలకు చేయూతనిచ్చే పీ4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది" అని ముఖ్యమంత్రి చెప్పారు.పీ4లో భాగంగా బంగారు కుటుంబాలుగా నమోదైన వారు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలి. ఇవాళ్టి బంగారు కుటుంబాలు.. రేపటి మార్గదర్శులుగా ఎదగాలన్నదే నా ఆలోచన. సాయం పొందిన సాయం చేసేందుకు ముందుకు వస్తారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి. దీన్ని విజయవంతంగా అమలు చేయగలిగితే ఈ కార్యక్రమం శాశత్వంగా ఉండిపోతుంది. చాలా మందికి మంచి ఆలోచనలు ఉంటాయి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యాలున్న వారు పేదరికం కారణంగా వెనుకబడిపోతున్నారు. ఇలాంటి వారికి చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ఎన్నో కార్యక్రమాలు చేసిన నాకు.. పీ4 కార్యక్రమం మనస్సుకు చాలా దగ్గరగా ఉంది" అని చంద్రబాబు అన్నారు."బంగారు కుటుంబాలుగా నమోదైన వారి అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తాం. బంగారు కుటుంబాలు అభివృద్ధికి ఏం చేస్తే బాగుంటుంది.. వాళ్లు చేయగలిగే పనులేంటీ..? అనే అంశాలపై ఓ పది పాయింట్లతో కూడిన సర్వే చేపడుతున్నాం. వీరి అభివృద్ధికి ఏం చేస్తున్నామనే విషయాన్ని వివరించేందుకు ప్రతి బంగారు కుటుంబానికి విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికల ద్వారా వారి అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం. బంగారు కుటుంబాల స్థితిగతులపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష చేపట్టాలి." అని సీఎం అన్నారు. ప్రతిష్టాత్మక "పీ4" పథకంపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నేడు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో "పీ4" పథకం లోగోను ఆవిష్కరించారు.?

"ఆగస్టు 15 నుంచి పీ4 మొదటి విడత ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నా దగ్గర నుంచి ఎమ్మెల్యే వరకు పని చేయాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి క్షేత్ర స్థాయి ఉద్యోగి వరకు కృషి చేయాలి. బంగారు కుటుంబాలను.. మార్గదర్శులను గుర్తించే విషయంలో కొన్ని జిల్లాలు ఇంకా మెరుగ్గా పని చేయాలి. వచ్చే 15 రోజుల్లో దీని కోసం గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో కసరత్తు చేయాలి. ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి." అని సీఎం సూచించారు. జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. సీఎం స్ఫూర్తితో తాను కూడా ఐదు పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ ప్రకటించారు. షాజహాన్ ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టిన ఈ తరహా కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు సహకరిస్తామని ప్రజా ప్రతినిధులు సీఎంకు హామీనిచ్చారు

# మారనున్న ఓర్వకల్లు

కర్నూలు, జూలై 28

కర్నూలు జిల్లాలోని ఓర్వకర్లు సమీపంలో ఉన్న నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ టెస్ట్ రేంజ్‌లో లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ మిస్సైల్ క్క ఫ్లైట్ ట్రయల్స్‌ను డీఆర్‌డీఏ విజయవంతంగా నిర్వహించింది. భారత రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఈ విజయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా లో ప్రకటించారు. కర్నూలుజిల్లా ఓర్వకల్లు మండలం, పాలకొలను సమీపంలో నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ ఉంది. ఔాంఖీ అనేది అత్యాధునిక రక్షణ సాంకేతికతలను పరీక్షించడానికి డీఆర్ డీఓ ఉపయోగించే కీలక సౌకర్యం, ఇది గతంలో హై-ఎనర్జీ లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ పరీక్షలకు కూడా ఉపయోగించబడింది. జఒఖఉఓ-ఎ3 ఫ్లైట్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి, ఇది భారత్ కు చెందిన డ్రోన్-లాంచ్డ్ ప్రెసిషన్ స్ట్రైక్ సామర్థ్యాలలో ఎంతో కీలకమైనది. సిరీస్‌లో మూడు తెలిసిన వేరియంట్‌లు ఉన్నాయి. డీఆర్ డీఓ టెర్మినల్ బాలిస్టిక్స్ రిసెర్చ్ లాబొరేటరీ ద్వారా అభివృద్ధి చేసిన ప్రొడక్షన్ వేరియంట్ బహుళ వార్‌హెడ్ కాన్ఫిగరేషన్‌లతో ఉంటుంది. ఎక్స్‌టెండెడ్ రేంజ్ వేరియంట్, ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ సీకర్ , డ్యూయల్-థ్రస్ట్ ప్రొపల్షన్ సిస్టమ్‌లతో మెరుగైన ఫీచర్లను కలిగి ఉంది. ఈ వేరియంట్ ను 2025లో ప్రదర్శించారు. ఈ మిస్సైల్ సిస్టమ్ తేలికైనది, ఖచ్చితమైనది, వివిధ ఏరియల్ ప్లాట్‌ఫామ్‌లతో అనుకూలంగా ఉంటుంది, ఇది ఆధునిక యుద్ధాలలో వ్యూహాత్మక సౌలభ్యాన్ని అందిస్తుంది. అదానీ గ్రూప్ , భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రాజెక్ట్‌లో కీలక తయారీ భాగస్వాములు. ఈ పరీక్షలు భారత పరిశ్రమ, ముఖ్యంగా ఓూఓఇబ స్టార్టప్‌ల సామర్థ్యాన్ని సూచిస్తాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. , ఇవి కీలక రక్షణ సాంకేతికతలను గ్రహించి, ఉత్పత్తి చేయడంలో సఫలమవుతున్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ సహకారాన్ని ప్రశంసించారు. ఇది ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో ముఖ్యమైన అడుగుగా పేర్కొన్నారు .ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రక్షణ పరికరాల ఉత్పత్తికి కేంద్ర స్థానంగా మార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఇలాంటి ప్రయోగాలు ఏపీలో జరగడం వల్ల మరింత పేరు వచ్చే అవకాశం ఉంది.

## శ్రీవారిని దర్శించుకున్న విఐపిలు

తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు రాజకీయ సినీ ప్రముఖులు దర్శించుకున్నారు .. ఈరోజు ఉదయం నైవేద్య విరామ సమయంలో తెలంగాణ ప్రభుత్వ విప్పు శ్రీధర్ ,తెలంగాణ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వేరువేరుగా కుటుంబ సమేతంగాదర్శించుకున్నారు.. అలాగే కన్నడ ప్రముఖ హీరో శివరాజ్ కుమార్, తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని తదితరులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.. ప్రముఖులకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు..

## పెద్దపులి దాడిలో లేగ దూడ మృతి

మంచిర్యాల

కాసిపేట్ మండలం ధర్మరావుపేట సెక్షన్ పరిధిలో వెంకటాపూర్ బీట్ రొట్టెపల్లి అటవీ శివారు ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం మేతకు వెళ్లిన పశువులపై పులి దాడి చేసి చంపింది. అటవీ క్షేత్రాధికారి బెల్లంపల్లి పూర్ణచందర్ వివరాల ప్రకారం గోండు గూడ కి చెందిన కురిసేంగ అచ్యుత్ రావు యొక్క లేగదూడను పెద్దపులి చంపివేసిందని అయన తెలిపారు. బాధితుడికి నష్టపరిహారం త్వరలోనే చెల్లిస్తామని అటవీ ప్రాంతంలోకి పశువుల కాపరులు సమీప పంట చేనులో పనికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దపులికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించినచో అటవీ శాఖ వారికి వెంటనే ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని కోరారు. సమీప గ్రామాలలో డప్పు చాటింపును చేయించడం జరిగిందని తెలిపారు..

## రాష్ట్రాభివృద్ధిలో తెలుగువారంతా భాగస్వాములు కావాలి

### తెలుగు డయాస్పోరా వాలంటీర్లతో మంత్రి నారా లోకేష్

సింగపూర్:

గత అయిదేళ్ల విధ్వంస పాలన చూశాక రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు విదేశాల్లో ఉన్న తెలుగువారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు, అందుకే ఏ దేశం వెళ్లినా ముఖ్యమంత్రి గారు, నేను తొలుత తెలుగువాళ్లను కలవాలని నిర్ణయించుకున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. తెలుగు డయాస్పోరా సమావేశాన్ని విజయవంతం చేసిన వాలంటీర్లతో లోకేష్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... సింగపూర్ అభివృద్ధి చెందిన తీరును మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలి. ఇక్కడ ఉన్న తెలుగు వారంతా రాష్ట్రాభివృద్ధి లో భాగస్వాములు కావాలి. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి కృషి చేయాలి. డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు కావడం వల్ల రాష్ట్రం ఊపిరి తీసుకుంటోంది. ప్రధాని మోడీజీ త్వరలోనే సింగపూర్ లో పర్యటిస్తారు. ఆ పర్యటనలో పెద్ద ఎత్తున తెలుగువారు పాల్గొని విజయవంతం చేయండి. రాష్ట్రానికి సహకరిస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలపాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. తెలుగు డయాస్పోరా సమావేశాన్ని విజయవంతం చేసిన వాలంటీర్లను అభినందించిన లోకేష్ వారితో ఫోటోలు దిగారు.

## నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

జూలై 29న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పులుల సంరక్షణపై అవగాహన కలిగించడానికి ఈ దినోత్సవం జరుపబడుతుంది.2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో జరిగిన పులుల సంరక్షణ సమావేశంలో ఈ అంతర్జాతీయ పులుల దినోత్సవం ప్రకటించబడింది. పులుల సహజ ఆవాసాలను పరిరక్షించే విధంగా వ్యవస్థను ప్రోత్సహించడం, పులి సంరక్షణ గురించి ప్రజలలో అవగాహన పెంచి వారినుండి సహాయాన్ని అందుకోవడం ఈ దినోత్సవ ముఖ్యోద్ధేశ్యం.2017: ఏడవ అంతర్జాతీయ పులుల దినోత్సవం నాడు ప్రపంచవ్యాప్తంగా భారతదేశం, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలతోపాటు పులులు లేని దేశాలైన ఇంగ్లాండ్, యునైటెడ్ స్టేట్స్ లో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అనేకమమంది వారివారి సోషల్ మీడియా ప్రొఫైల్ ఫోటోలను తొలగించడం ద్వారా అంతర్జాతీయ పులుల దినోత్సవంకు తమ మద్దతును ప్రకటింస్తారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రేంజర్ల ద్వారా "డబుల్ టైగర్స్" ప్రచారం జరిగింది. దీని గురించి అవగాహన పెంచడానికి అనేక కంపెనీలు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తో భాగస్వామ్యం అయ్యాయి.భారతదేశంలో ప్రతి నాలుగు సంవత్సరాలకు అడవి పులుల సంఖ్యను లెక్కిస్తారు. పులుల సంఖ్య 2006లో 1411, 2010లో 1,726 ఉండగా 2014లో 2226కి పెరిగింది. 2018 నాటికి 2,967 పులులు ఉన్నట్లు అంచనా వేశారు.

# నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ

–నేడు మన తెలంగాణ ముద్దు బిడ్డ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహిత డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

తెలుగు చలన చిత్ర సీమలో డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యం సహజత్వానికి ప్రయోగాలకు పుట్టినిల్లు. అంతకు మునుపు ఎక్కువగా వాడని పదాలను సాహితీ స్రవంతిలోకి తీసుకు వచ్చి, వాటితో సాహిత్యానికి ఎంతో వన్నె తెచ్చారు సినారె. దొరసాని, నెరజాణ వంటి పదాలు అప్పట్లో తెలుగు సినీ సాహిత్యంలో చాలా అరుదుగా ఉపయోగించే వారు. నారాయణ రెడ్డి అటువంటి పదాలను తన సాహిత్యంలో పొందు పరచి తెలుగు భాష అందాన్ని పెంచారు. సినారెగా సుప్రసిద్ధుడైన డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డిది ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇప్పుడు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని హనుమాజీపేట. బుచ్చమ్మ, మల్లారెడ్డి తల్లిదండ్రులు. 1931 జూలై 29న జన్మించారు. ప్రాథమిక విద్యను స్వగ్రామంతో పాటు సిరిసిల్ల,కరీంనగర్‌లో పూర్తి చేశారు. ఉన్నత విద్యాభ్యాసానికి హైదరాబాద్ వెళ్లారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ పూర్తి చేసి అక్కడే అధ్యాపకుడిగా పనిచేశారు. కళాశాల విద్యార్థిగా ఉన్నపుడే శోభ పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు. పసి వయసులో విన్న హరికథలు, జానపదాలు, జంగం కథల స్ఫూర్తితో ఉన్నత స్థాయి సాహితీవేత్తగా ప్రఖ్యాతి చెందారు. 1953లో నవ్వనిపువ్వుతో ప్రారంభమైన సినారె సాహిత్య ప్రస్థానం అలుపెరగక సాగిపోయింది. పద్య కవితలు, గేయకావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, సంగీత నృత్య రూపకాలు, ముక్తకాలు, బుర్ర కథలు, గజల్లు, వ్యాసాలు విమర్శలు, అనువాదాలు వంటి అనేక సాహితీ ప్రక్రియల్లో అనితర సాధ్యమైన ప్రతిభను చాటుకున్నారు.నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మట్టి మనిషి ఆకాశం, విశ్వంభర, మంటలు మానవుడు, మధ్య తరగతి మందహాసం, నడక నా తల్లి, తెలుగు గజల్లు, భూమిక, ముఖాముఖి, ఆరోహణ, అక్షర గవాక్షాలు, ఇంటి పేరు చైతన్యం తదితర రచనలు చేశారు. సినారె రాసిన రామప్ప సంగీత నృత్య రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువదించబడింది. దీంతో పాటు ఆయన గ్రంథాలు ఇంగ్లిష్, ఫ్రెంచ్ సంస్కృతం, మలయాళం, హిందీ, ఉర్దూ కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా, జపాన్, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో సందర్శించారు. అంతర్జాతీయ కవి సమ్మేళనాల్లో భారతీయ ప్రతినిధిగా హాజరై తెలుగు సాహిత్య వైభవాన్ని విశ్వయవనికపై చాటారు. ఆధునిక ఆంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు పేరిట సినారె పరిశోధన ఆయను పీహెచ్‌డీ ప్రామాణిక విమర్శన గ్రంథంగా మిగిలింది.

అత్యున్నత పురస్కారాలు..

కేంద్ర సాహిత్య అకాడమి, సోవియట్ ల్యాండ్ నెహ్రూ పురస్కారంతో పాటు విశ్వంభర దీర్ఘ కావ్యానికి 1988లో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ పురస్కారం వరించింది.భారతీయ భాషా పరిషత్, రాజలక్ష్మి, అసాన్, ఉమ్మడి రాష్ట్రంలో సాంస్కృతిక వ్యవహారాలు సలహాదారునిగా, సాంస్కృతిక మండలి, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా వ్యవహరించారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట సాహిత్య పురస్కారం అందుకున్నారు. డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం స్వీకరించారు. రాజ్యసభ సభ్యులుగా ఉన్నతమైన బాధ్యతలను నిర్వహించారు. భారత ప్రభుత్వం సినారె సేవలను గుర్తించి పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలిచ్చింది. పలు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో గౌరవించాయి. సినిమా పాటలు కైకట్టి..వందలాది సినిమాలకు వేల సంఖ్యలో సినీ గీతాలు రాశారు. స్వర్గీయ ఎన్టీఆర్ కథానాయకుడిగా విడుదలైన గులేబకావళి కథ సినిమాలో నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని అనే పాటతో సినీ రంగ ప్రవేశం చేసిన సినారె ఆపైన సుమారు మూడు వేలకు పైగా పాటలు రచించి సినిమా ప్రేక్షకులకు సైతం చేరువయ్యారు. చిలిపి కనుల తీయని చెలికాడా..అనగనగా ఒక రాజు అనగనగా ఒక రాణి, నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవొద్దు, జాతిని నీతిని నిలిపిన మహనీయులనే మరవొద్దు. అమ్మను మించి దైవం ఉన్నదా ఆత్మను మించి అద్దమున్నదా.. కంటేనే అమ్మ అని అంటే ఎలా.. ఓ ముత్యాల కొమ్మా...ఓ రాములమ్మా.. తదితర తెలుగు సినిమా పాటలు సినారె ప్రతిభకు తార్కాణాలు. సినిమా పాటల్లో సైతం సాహిత్య విలువలకు పట్టం కట్టి తెలుగు సినీ సాహిత్యంపై చెరగని ముద్ర వేశారు. 2017 జూన్ 12 న హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో కన్ను మూశారు.

# రాయచోటి సబ్ రిజిస్ట్రార్ పై నాన్ బెయిలబుల్ కేసు

అన్నమయ్య రాయచోటి సబ్ రిజిస్ట్రార్ షేక్ సత్తార్ పై నాన్ బెయిలెబుల్ కేసు నమోదు చేసినట్లు నంద్యాల ఒకటో పట్టణ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. సత్తార్ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో పని చేసేటప్పుడు రూ. 2 కోట్ల విలువైన స్థలాన్ని, బాలాజీ కాంప్లెక్స్ ఉన్న పద్దెనిమిది సెంట్ల వివాదాస్పద స్థలాన్ని జైలాల్బి కి రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు గాను ఆయన భారీగా ముడుపులు దండుకున్నట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# పోలీసుల విస్తృత తనిఖీలు

ములుగుమావోయిస్ట వారోత్సవాల నేపథ్యంలో కన్నాయిగూడెం మండలంలో ఎస్సై ఈ. వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్గఢ్ నుంచి కన్నాయిగూడెం ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

# 2026 నాటికి స్టీల్ ప్లాంట్ పూర్తి

కడప, జూలై 28,

వైఎస్సార్ కడప జిల్లా వాసులకు గుడ్ న్యూస్.. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తరుణం సమీపిస్తోంది. కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు విషయం చాలా రోజుల నుంచి నడుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా సున్నపురాళ్లపల్లెలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ.. ఏపీ పారిశ్రామికాభివృద్ధి పాలసీ ప్రకారం ప్రోత్సాహకాలు ఇవ్వాలని, చర్యలు తీసుకోవాలని విద్యుత్, పరిశ్రమలు, జలవనరులు, రెవెన్యూ, ఆర్థిక శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. రూ.4,500 కోట్లతో సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్‌ప్లాంట్ తొలి దశ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రూ.11,850 కోట్లతో స్టీల్ ప్లాంట్ రెండో దశ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.మరోవైపు సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం జేఎస్‌డబ్ల్యూ సంస్థకు ఏపీ ప్రభుత్వం 1100 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఎకరా రూ. 5లక్షల చొప్పున ఈ భూమిని కేటాయించింది. 2026 జనవరి నాటికి కడప స్టీల్‌ప్లాంట్ తొలి దశ పనులు ప్రారంభించాల్సి ఉంది. అలాగే 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. ఇక 2029 ఏప్రిల్ సమయానికి స్టీల్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలపటంతో సకాలంలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ సంస్థకు ప్రోత్సాహకాలు ఇవ్వటంతో పాటుగా విద్యుత్, నీరు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.మరోవైపు సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ రెండో దశ పనులను 2031 జనవరి నాటికి మొదలుపెట్టనున్నారు. 2034 ఏప్రిల్ వచ్చేసరికి స్టీల్‌ప్లాంట్‌లో రెండో దశలోనూ ఉత్పత్తి



ప్రారంభించాలని నిర్ణయించారు.ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని 13వ షెడ్యూల్ ప్రకారం కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే మూడు మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో రెండు దశలలో కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొదటి దశలో ఒక మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలని.. రెండో దశ కల్లా ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో 2 మిలియన్ టన్నులకు పెంచుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం జేఎస్‌డబ్ల్యూ సంస్థకు 1100 ఎకరాల భూమిని 33 సంవత్సరాలు లీజుకు ఇచ్చారు.ఇక కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే పలుసార్లు శంకుస్థాపనలు చేశారు. 2023లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ భూమి పూజ చేసింది. తాజాగా జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలపటంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. ఈ స్టీల్ ప్లాంట్ మొదటి దశ నిర్మాణం ద్వారా ప్రత్యక్షంగా 3,200 మందికి, పరోక్షంగా 25,000 మందికి ఉపాధి అవకాశాలు.లభిస్తాయని అధికారులు చెప్తున్నారు.

# చెత్త తీసుకెళ్లి.,..బహుమతులు తీసుకోండి

గుంటూరు, జూలై 28

చెత్తే కదా అని వేస్తు కింద లెక్కగట్టకండి. చెత్త కాదు అది సంపద అంటోంది ఏపీ ప్రభుత్వం. అందుకే చెత్త సేకరణ చేస్తోంది. చెత్తతో సంపద తయారీ కేంద్రాలను కూడా నెలకొల్పుతోంది. ఇదే క్రమంలోనే గుంటూరు జిల్లా పొన్నూరును చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు అధికారులు నడుం బిగించారు. పొన్నూరు మున్సిపాలిటీ ఐటీసీ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఇక ఒప్పందంలో భాగంగా పొన్నూరు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చెత్త సేకరణపై ఐటీసీ ప్రతినిధులు అవగాహన కల్పిస్తారు. అలాగే ఓ సంచి అందిస్తారు. స్కూలుకు వచ్చేటప్పుడు ఈ సంచీలో ఇంటి నుంచి పొడి చెత్తను తీసుకురావాల్సి ఉంటుంది. ఆ చెత్తను తూచి వారికి బహుమతులు అందిస్తారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే పట్టుదలతో ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర అనే కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. అలాగే చెత్త వేస్తే నిత్యావసరాలు ఉచితంగా పంపిణీ చేసే స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని గుంటూరు గ్రామీణ మండలంలో ఇటీవల పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించారు. వీటితో పాటుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను కూడా నెలకొల్పుతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా పొన్నూరును చెత్తరహిత పట్టణంగా మార్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. పొన్నూరులో తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తూ ఉంటారు. అయితే ఇక్కడి నుంచి వ్యర్థాల తొలగింపు లేకపోవటంతో డంపింగ్ యార్డులో చెత్త గుట్టలు గుట్టలుగా పెరిగిపోయింది. ఈ స్థాయిలో చెత్తను బయటకు తరలించాలంటే పొన్నూరు మున్సిపాలిటీకి ఆర్థికంగా ఇబ్బందిగా మారింది.ఈ నేపథ్యంలోనే పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చెత్తను తరలించేందుకు ఐటీసీ సంస్థతో పొన్నూరు మున్సిపాలిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ సూచనలతో పొన్నూరు మున్సిపాలిటీ, ఐటీసీ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో చెత్త సేకరణకు కొత్త విధానాన్ని పొన్నూరు మున్సిపాలిటీలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. ఇక్కడి నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా మరికొన్ని చోట్ల ఇదే తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నాయి.ఈ విధానంలో భాగంగా పొన్నూరులోని స్కూళ్ల విద్యార్థుల నుంచి చెత్త సేకరించి వారికి ప్రోత్సాహకాలు అందించనున్నారు. పొన్నూరు పరిధిలోని జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ప్రాథమిక పాఠశాలల్లో సుమారుగా 1500 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు అంచనా. ఐటీసీ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు చెత్త సేకరణ, వాటి నుంచి సంపద ఎలా సృష్టించవచ్చో అవగాహన కల్పిస్తారు. అలాగే ప్రతి విద్యా?ర్థికి ఓ సంచీని అందజేయనున్నారు. రోజూ ఉదయం పాఠశాలకు వచ్చే సమయంలో విద్యార్థులు ఆ సంచీలో తమ ఇంటి నుంచి పొడి చెత్తను తీసుకుని రావాల్సి ఉంటంది. అలా తీసుకువచ్చిన పొడిచెత్తను తూకం వేసి.. ఆ బరువు ప్రకారం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తారని పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.లాగే మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి వెళ్లి మున్సిపాలిటీ అధికారులు, ఐటీసీ ప్రతినిధులు చెత్త సేకరణ, ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అలాగే సేకరించిన తడిచెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చే ప్రయత్నం చేస్తామని పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.

# కూటమి టార్గెట్ అంతా రాయలసీమే

అనంతపురం, జూలై 28

కుంది. కడపలో కూడా వైసీపీ పట్టు నిలుపుకోలేకపోయింది. దాంతో మొన్నటి ఎన్నికల తర్వాత కూటమి కాన్సంట్రేషన్ ఓవర్ టు సీమ అయిపోయింది.వైసీపీని తిరిగి అక్కడ కోలుకోకుండా చేస్తే ఇంకో రెండు మూడు టర్మ్‌లు తమదే పవర్ అని అంచనా వేస్తోంది టీడీపీ. అందుకే అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మహానాడుకు కడపనే వేదికగా ఎంచుకుంది సైకిల్ పార్టీ. జగన్ కంచుకోటలో మూడురోజుల పాటు మహానాడు నిర్వహించి..లక్షలాది మందితో సభ పెట్టి..జెండాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో పసుపు మయం చేసి పబ్లిక్ అటెన్షన్ గ్రాబ్ చేసే ప్రయత్నం చేసింది.తెలుగుదేశం పుట్టాక చాలా నగరాల్లో మహానాడు పెట్టారు. కానీ ఫస్ట్ టైమ్ హిస్టరీలో సాధించనన్ని సీట్లు సాధించిన తర్వాత కడపను టార్గెట్ చేస్తూ బ్రహ్మాండంగా పార్టీ పండుగను నిర్వహించి వైసీపీకి తన సత్తా ఏంటో చూపించింది టీడీపీ. సేమ్‌టైమ్ జనసేన పరంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా వరుసగా కడప పర్యటనలు చేస్తూ..జగన్ అండ్ వైసీపీ నేతలకు వార్నింగ్‌లు ఇస్తూ వస్తున్నారు.ఇప్పుడు కూటమిలో మరో మిత్రపక్షం వంతు అన్నట్లుగా ఉంది. బీజేపీ కూడా కడప నుంచే తన కార్యాచరణకు రెడీ అవుతోంది. బీజేపీకి కొత్త అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పర్యటనలకు సిద్ధం అవుతున్నారు. వాటిని కడప నుంచే మొదలు పెడతామని ప్రకటించారు. కడపను రాజకీయ కోణంలో కాకుండా ఆధ్యాత్మిక కోణంలో చూస్తున్నాం.. అందుకే కడపను ఎంచుకుంటున్నామని చెబుతున్నారు.దేవుని తొలి గడప కడప అని మాధవ్ చెప్పారు. అందుకే సారధ్యం పేరుతో రాష్ట్ర పర్యటన త్వరలోనే మొదలవుతుందని అంటున్నారు. తొలి శాసనం దొరికిన జిల్లాగా అలాగే తెలుగు జాతి తెలుగు సంస్కృతికి ప్రధాన ద్వారంగా నిలిచిన కడప నుంచి పర్యటన స్టార్ట్ చేస్తామంటున్నారు. ఐదు విడతలుగా సారధ్యం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది. ఉత్తరాంధ్రకు చెందిన మాధవ్..అక్కడి నుంచే పార్టీ యాక్టివిటీస్‌ను మొదలెడతారని అంతా అనుకున్నారు. కానీ మాధవ్ తన తొలి రాష్ట్ర పర్యటనను రాయలసీమ నుంచి పైగా జగన్‌కు, వైసీపీకి హార్డ్ కోర్ జిల్లా అయిన కడప నుంచి ప్రారంభిస్తుండటం ఆసక్తికరంగా మారింది.కూటమి పార్టీలన్నీ తమ బలాన్ని పెంచుకోవడానికి కార్యక్షేత్రంగా కడపనే ఎంచుకుంటున్నాయి. పవన్ కూడా అనేక సార్లు రాయలసీమలో పర్యటిస్తూ వస్తున్నారు. కడపలో రచ్చబండ కార్యక్రమం పెట్టారు. ఆ మధ్యే కడప వెళ్ళి మరీ ఎంపీడీవో మీద జరిగిన దాడిని ఖండించి వచ్చారు పవన్. ఏకంగా రాయలసీమలోనే క్యాంప్ ఆఫీస్ పెడతానంటూ ప్రకటించేశారు. రాయలసీమ మీ జాగీరు కాదు..గూండాగిరి చేస్తే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు పవన్.కర్నూలు జిల్లాలో గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఇక కడపలో పర్యటించి..సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్నాయని ఆరోపిస్తున్న అటవీ భూములను పరిశీలించారు. సీఎం చంద్రబాబు కూడా నెలలో కనీసం రెండు సార్లకు తక్కువ కాకుండా సీమ జిల్లాల టూర్లు వేస్తున్నారు. ఇప్పుడు బీజేపీ కూడా రాయలసీమపైనే ఫోకస్ పెడుతోంది. దాంతో వైసీపీ వర్సెస్ కూటమిగా రాయలసీమ రాజకీయం మారిపోయింది.తిరిగి తన పట్టును సాధించేదుకు..గత వైభవం తెచ్చుకునేందుకు వైసీపీ ప్లాన్ చేస్తోంది. మూడు కీలక పార్టీలు అంతా కలసి సీమ మీద కన్ను వేయడంతో వైసీపీకి సవాల్‌గా మారింది. జగన్ కంచుకోట సెంట్రిక్‌గా కూటమి పార్టీలు చేస్తున్న ప్లాన్లు ఎంత వరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# నెల్లిమర్లలో మంత్రులు గొట్టిపాటి, కొండపల్లి పర్యటన

విజయనగరం

నెలిమర్ల నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, కొండపల్లి శ్రీనివాస్ పర్యటించారు. డెంకాడ మం. పెద్దతాడివాడలో 33/11 కేవీ సబ్ స్టేషన్ కు మంత్రులు శంఖుస్థాపన చేసారు. రూ. 2.8 కోట్లతో నిర్మించనున్న సబ్ స్టేషన్ కు శంఖుస్థాపన చేసారు.

మంత్రి గొట్టిపాతి మాట్లాడుతూ లో ఓల్టేజ్ సమస్యలకు చెక్కు పెట్టేందుకే సబ్ స్టేషన్ల నిర్మాణం చేస్తున్నాం. పీఎం సూర్యఘర్ పథకం కింద రాష్ట్రానికి 20 లక్షల కనెక్షన్లు కేంద్రం కేటాయించింది. తీర ప్రాంతాల విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. గత ఐదేళ్లలో విద్యుత్ శాఖ దోపిడీకి గురైంది తప్ప అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు.

విద్యుత్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం . రూపాయి బిల్లు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం . రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేయరాదని అన్నారు.

# మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?’

## రష్యా చమురు కొనుగోలు విషయంలో పశ్చిమ దేశాలపై మండిపడ్డ భారత్

న్యూ ఢిల్లీ జూలై 28

ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు పలు ఆంక్షలు ఉన్నప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు దిగుమతి చేసుకోవడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. దీనిపై తాజాగా భారత్ స్పందించింది. పశ్చిమ దేశాల విమర్శలను యూకేలోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి తోసిపుచ్చారు. ఏ దేశం కూడా తమ ఆర్థిక వ్యవస్థను ఆపేయాలని అనుకోదని వ్యాఖ్యానించారు.బ్రిటిష్ రేడియో స్టేషన్ టైమ్స్ రేడియోతో దొరైస్వామి మాట్లాడుతూ.. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అని తెలిపారు. దేశ అవసరాల్లో 80 శాతం దిగుమతులపైనే అధారపడుతున్నట్లు చెప్పారు. రష్యా నుంచి చౌక ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాల మేరకు డిస్కౌంట్‌పై చమురును ఎలా కొనుగోలు చేయకుండా ఉంటాం..? అని ప్రశ్నించారు. పశ్చిమ దేశాలు భారత్‌పై విమర్శలు చేస్తున్నాయన్నారు. ‘మేం ఏం చేయాలని పశ్చిమ దేశాలు కోరుకుంటున్నాయి..? మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?’ అంటూ ప్రశ్నించారు.

# తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ పాత్ర జైపాల్ రెడ్డిదే

## మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్

కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా పీవీ నరసింహారావు మార్గ్ (నెక్లెస్ రోడ్) లోని స్ఫూర్తి స్థల్ లో ఆయన స్మారకానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ పల్లె నుండి ఢిల్లీ దాకా ఎదిగిన భారత రాజకీయ శిఖరం, బెస్ట్ పార్లమెంటిరియన్ స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి. 1969లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అక్కడి నుండే వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత మహబూబ్ నగర్,మిర్యాలగూడ,చేవెళ్ల పార్లమెంట్ స్థానాల నుండి ఐదు సార్లు లోక్సభ సభ్యుడిగా గెలుపొందారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా,రాజ్య సభలో ప్రతిపక్ష నేతగా కూడా పనిచేసిన అపార రాజకీయ అనుభవం కలిగిన నేత జైపాల్ రెడ్డి. ఉత్తమ పార్లమెంటేరియన్గా పురస్కారం అందుకున్న తొలి దక్షిణ భారత ఎంపీగా ఘన కీర్తి పొందారని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ పాత్ర జైపాల్ రెడ్డి దే. హైదరాబాద్ కు ప్రపంచ స్థాయి మెట్రో జైపాల్ రెడ్డి వల్లే సాధ్యమైంది. అధికారంలో ఉన్న,ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ విలువలు కలిగి ఉన్న నేత అయన రాజకీయ జీవితం నేటి తరం నేతలకు ఆదర్శం..స్ఫూర్తి దాయకం. జైపాల్ రెడ్డి గురించి చెప్పే అంత పెద్ద స్థాయి నాది కాదు.. ప్రపంచ దేశాలు గుర్తించే నాయకుడు జైపాల్ రెడ్డి. జైపాల్ రెడ్డి పెద్ద కుమారుడు అరవింద్ నేను ఇంజనీరింగ్ లో క్లాస్ మెట్. ప్రజల కోసం నిజాయితిగా పని చేసిన నాయకుడు జైపాల్ రెడ్డి. ఆయనకు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వని కోరుతున్నానని అన్నారు.పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు జైపాల్ రెడ్డి పేరు పెట్టాము. ఐకే గుజ్రాల్ నేతృత్వంలో ఏర్పడ్డ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో..మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాల్లో కేంద్ర సమాచార ప్రసార శాఖ, పట్టణాభివృద్ధి శాఖ, పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహా మరికొన్ని శాఖలకు మంత్రిగా పనిచేశారు. వైకల్యానికి గురైన ఎన్నడూ నిరాశ చెందలేదు..అది ఆయన రాజకీయ జీవితానికి ఎన్నడూ అవరోధంగా భావించలేదు. సవాళ్ళకే సవాలుగా నిలిచిన వ్యక్తి జైపాల్ రెడ్డి. విద్యార్థి నాయకుని నుండి కేంద్ర మంత్రి గా ఎదిగారు. సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొంటూ ఉన్నతంగా ఎదగాలనే నేటి తరానికి ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితమే నిదర్శనం.

## బావిలో పడిన ఆటో.. ఒకరి మృతి

మహబూబాబాద్ం

రహదారి పక్కన ఉన్న వ్యవసాయ పాతబావిలో ప్రమాదవ శాత్తు ఆటో పడిన ఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరు గాయపడిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామంలో చోటు చేసుకుంది. మునిగలవీడుకు చెందిన శ్రీరాం నర్సయ్య(65), ఆయన భార్య భారతమ్మ, కుమారుడు మార్కండేయు.. మండలంలోని శ్రీరామగిరి శివారు వెంకటాపు రంలో బంధువుల అంత్యక్రియలకు హాజరై, ఆదివారం అర్ధరాత్రి వారి సొంత ఆటోలో తిరిగి వస్తున్నారు. మునిగలవీడు గ్రామంలోకి వెళ్లే రహదారికి సమీపంలో ఉన్న పాత బావిలోకి ప్రమాదవ శాత్తు ఆటో దూసుకెళ్లింది. ఈ ఘటనలో తండ్రి శ్రీరాం నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందారు. భారతమ్మ, మార్కండేయలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎం జిఎం కు తరలినీచారు.

## చర్ల మండలం లో మావోయిస్టు బ్యానర్లు

భద్రాచలం జూలై 28,

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో మావోయిస్టు బ్యానర్లు కలకలం రేపాయి. ఆర్ కొత్తగూడెం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై మావోయిస్ట్ బ్యానర్లు-కరపత్రాలు కనిపించాయి. జూలై 28 నుండి ఆగస్టు 03 వరకు నక్సల్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కాగర్ ని ప్రజా ఉద్యమాల ధ్వారా ఓడిద్దాం. అమరుల ఆశయాల సాధనకై ప్రజాయుధాన్ని తీవ్రతరం చేద్దాం అంటూ పిలుపుని మావోయిస్టులను ఇచ్చారు.

## రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ జూలై 28,

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుండే ధర్మగుండంలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. స్వామివారికి అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

## మద్యం మత్తులో కారు డ్రైవింగ్ కరెంట్ పోల్ కు ఢీ..

మెదక్

చిన్నశంకరంపేట పెట్రోల్ పంప్ సమీపంలో మద్యం మత్తులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఫ్రెండ్ బర్త్ డే కోసం నలుగురు యువకులు ఎర్టీగా కారు రెంట్ కి తీసుకుని వెళ్లారు. బర్త్ డే పార్టీలో మద్యం సేవించారు. తిరిగి వస్తుండగా సోమవారం తెల్లవారుజామున మద్యం మత్తులో కరెంట్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో కారు బోల్తా కొట్టింది. ఘటనలో జశ్వంత్ (18) మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్న నలుగురు యువకులు 20 ఏళ్ల లోపు వారే.

## మరోసారి రెచ్చిపోయిన భూమన అనుచరుడు, వైసిపి యువ నేత చైతన్య యాదవ్

తిరుపతి జూలై 28, (

లీలామహల్ సర్కిల్లో ఉన్న బిల్డింగ్ యజమాని అద్దె అడిగితే కిరాయిదారుడు చైతన్య యాదవ్ దాడికి దిగాడు. చైతన్య వైకాపా నేత భూమన కరుణాకర్ రెడ్డి అనుచరుడు. వైకాపా నేత. బిల్టింగ్ యజమానిని దుర్భాషలాడుతూ కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం అయింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. గతంలో కార్ డెకార్స్ యజమానిపై దాడి చేసిన కేసులో హైకోర్టు ద్వారా చైతన్య యాదవ్ బెయిల్ పొందాడు.

## షటిల్ ఆడుతూ యువకుడు మృతి

హైదరాబాద్ జూలై 28, (

షటిల్ ఆడుతూ గుండెపోటుతో కుప్పకూలి 25 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. నాగోల్ స్టేడియంలో షటిల్ ఆడుతుండగా రాకేష్ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. అక్కడున్నవారు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. మృతుడు ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడు గుండ్ల రాకేష్(25) కాగా.. హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు.

## కొండచిలువ హల్ చల్

హుజూరాబాద్ జూలై 28

కొండకోనల్లో అడవుల్లో ఉండాల్సిన కొండచిలువ జనావాసాల్లోకి వచ్చి హల్ చల్ చేసింది. చూపరులను భయాందోళనకు గురి చేసింది.

# అనిల్ కుమార్ మిస్సింగ్...

నెల్లూరు, జూలై 28,

ధికారంలో ఉన్నప్పుడు ఎన్నైనా మాట్లాడవచ్చు. ఏవేవో మాట్లాడవచ్చు. ఎంతటి మాటలనైనా అనేయవచ్చు. కానీ అధికారం కోల్పోతే ఉంటుంది సామి రంగా. . అచ్చం అనిల్ కుమార్ యాదవ్ లా ఉంటుంది. ఓ చిన్నపాటి కేసులో విచారణకు ఆయనను పిలిచారు పోలీసులు. కానీ దుమ్మా కొట్టి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు అనిల్ కుమార్ యాదవ్. తనపై పోలీసులు పెట్టిన కేసు కొట్టి వేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అనిల్ కుమార్ యాదవ్ లో భయాన్ని చూసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముక్కున వేలేసుకుంటున్నాయి. ఏంటి మన అనిల్ యేనా? అని ఆశ్చర్యపోతున్నాయి. అనిల్ కుమార్ యాదవ్ తీరును చూసి నవ్వుకుంటున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు తొడలు కొడుతూ.. మీసం మేలేస్తూ అనిల్ కుమార్ యాదవ్ చేసిన హంగామా అంతా అంతా కాదు. ఇప్పటికీ ఆయన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి.మొన్న ఆ మధ్యన నెల్లూరు జిల్లాలో ఒక వివాదం నడిచిన సంగతి తెలిసిందే. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పై (మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. అదే సమయంలో ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటి పై దాడి కూడా జరిగింది. అయితే ప్రసన్న కుమార్ రెడ్డిని పరామర్శించే క్రమంలో ప్రశాంతి రెడ్డి పై అనిల్ కుమార్ యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిని ఖండిస్తూ ప్రశాంతి రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను అకారణంగా దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ కేసులో ఏ1 గా ప్రసన్న కుమార్ రెడ్డి, ఏ 2 గా అనిల్ కుమార్ యాదవ్ గా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణకు హాజరుకావాలని అనిల్ కుమార్ యాదవ్ కు నోటీసులు అందించారు. కానీ ఏ 1 గా ఉన్న ప్రసన్న కుమార్ రెడ్డి హాజరయ్యారు, ఏ 2 గా ఉన్న అనిల్ కుమార్ యాదవ్ మాత్రం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అలా వెళ్తూనే హైకోర్టులో తనపై కేసు కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన విస్మయం వ్యక్తం అవుతుంది. చిన్నపాటి కేసుకే అనిల్ భయపడిపోతున్న తీరును వారు తప్పు పడుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్అధికారంలో ఉన్నప్పుడు అనిల్ కుమార్ యాదవ్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయేవారు. మీసం మేలేసేవారు.. తొడగొట్టేవారు. పవన్



కళ్యాణ్ తో పాటు లోకేష్ ను తక్కువ చేసి మాట్లాడేవారు. చంద్రబాబు వయసును చూసి కూడా గౌరవించిన దాఖలాలు లేవు. అయితే ఇప్పుడు అధికారం తారుమారు కావడంతో అసలు తత్వం బోధపడింది. ఎన్నికల ఫలితాల తర్వాత అనిల్ కుమార్ యాదవ్ రాష్ట్రంలోనే ఉండడం లేదు. పక్క రాష్ట్రాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే ఇప్పుడు అనవసరంగా వచ్చి చిన్నచిన్న కేసుల్లో ఇరుక్కుంటున్నారు. అసలు పెద్ద కేసులు ఆయన కోసం ఎదురుచూస్తున్నాయి. మున్ముందు చుక్కలు కనిపించే పరిస్థితులు ఉన్నాయి. కానీ చిన్నపాటి దూషణ కేసును కూడా ఆయన ఎదుర్కొనలేకపోతున్నారు. మున్ముందు పెద్ద కేసులు ఎదురైతే పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న వైసీపీ శ్రేణుల నుంచి వినిపిస్తోంది.అయితే ప్రశాంతి రెడ్డి పై దూషణ కేసుకు సంబంధించి అనిల్ కుమార్ యాదవ్ భయపడడం వెనుక చాలా కారణాలు ఉన్నాయి. ఈ కేసులో ఏ 1 ఉన్న ప్రసన్న కుమార్ రెడ్డి ని పోలీసులు అరెస్టు చేయలేదు. కానీ తన విషయంలో మాత్రం అరెస్టు ఉంటుందని అనిల్ కుమార్ యాదవ్ కు తెలుసు. ఎందుకంటే క్వార్జ్ కుంభకోణం కేసులో ఆయన పిఏ ఇప్పటికే అరెస్టయ్యారు. ఆయన ఇచ్చిన సమాచారంతో అనిల్ కుమార్ కు కూడా ఈ కుంభకోణంతో సంబంధాలు ఉన్నాయని ఆధారాలు సేకరించారు పోలీసులు. అందుకే హైకోర్టు కలుపుతారు అనిల్ కుమార్ యాదవ్. పేరు దూషణ కేసు అయిన.. మైనింగ్ కుంభకోణం కేసులో బయటపడేందుకే నన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికైతే అనిల్ కుమార్ యాదవ్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లడం మాత్రం హాట్ టాపిక్ అవుతోంది.

# సర్దుకోలేకపోతున్నాము

## జనసేన ఎమ్మెల్యేల మనోవేదన

విజయవాడ, జూలై 28, (

జనసేన ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారా? వారిలో ఫ్రస్టేషన్ పతాక స్థాయికి చేరుకుందా? టిడిపి తీరుపై ఆగ్రహంగా ఉన్నారా? కక్కలేక మింగలేక ఇబ్బంది పడుతున్నారా? ఎంతసేపు తమను సర్దుబాటు చేసుకోవాలన్న సూచనను వ్యతిరేకిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పైకి టిడిపితో సమన్వయం కొనసాగుతున్న.. లోలోపల మాత్రం జనసేన ఎమ్మెల్యేలు రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిడిపి నేతల పెత్తనం కొనసాగుతుండడాన్ని వారు సహించలేకపోతున్నారు. అలాగని నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తే సర్దుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే కొందరు నియోజకవర్గ జనసేన ఇన్చార్జులు అసంతృప్త స్వరం వినిపిస్తే వేటు వేస్తున్నారు. అందుకే ఎమ్మెల్యేలు సైతం వెనక్కి తగ్గుతున్నారు.తెలుగుదేశం కూటమిప్రభుత్వంలో జనసేన కీలక భాగస్వామి. 100% విజయంతో.. డిప్యూటీ సీఎం గా పవన్.. మరో ఇద్దరు జనసేన మంత్రులు.. మరో ఇద్దరు ఎంపీలు.. 21 మంది ఎమ్మెల్యేలతో జనసేన పటిష్ట స్థితిలో కనిపిస్తోంది. అయితే రాజకీయంగా మైలేజ్ ఇచ్చిన జనసేన ఎమ్మెల్యేల విషయంలో మాత్రం నియోజకవర్గాల్లో ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ అంతా టిడిపి నేతల పెత్తనం ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. పైగా అక్కడ టిడిపి నేతల మాటే చెల్లుబాటు అవుతోందని ప్రచారం నడుస్తోంది. ఆ పై టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి లకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. వారి మాటనే ప్రభుత్వంలో చెల్లుబాటు అవుతోంది. ఎమ్మెల్యేలు ఉన్నారంటే ఉన్నారు అన్నట్టు ఉంది జనసేన శాసనసభ్యుల పరిస్థితి. ఇది రోజు రోజుకు పతాక స్థాయికి చేరుకుంటుంది. దీనిపై జనసేన ఎమ్మెల్యేల్లోనే చర్చ నడుస్తోంది.వాస్తవానికి రాష్ట్రస్థాయిలో తప్పనిసరి పరిస్థితుల్లో పొత్తుకు అంగీకరించారు టిడిపి నేతలు. జనసేనకు కేటాయించిన 21 అసెంబ్లీ స్థానాలు టిడిపికి కంచుకోట లాంటివి. అక్కడ ఆ పార్టీకి బలమైన నాయకత్వం ఉంది. దశాబ్దాలుగా పాతుకుపోయిన నాయకులు సైతం ఉన్నారు. అటువంటివారు పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేశారు. ఇప్పుడు టిడిపి నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో సీట్లు త్యాగం చేసిన నేతలకు పదవులు దక్కాయి. పార్టీపరంగా ప్రాధాన్యం లభిస్తుంది. సీట్లు త్యాగం చేశారు కాబట్టి రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవులు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యవర్గంలో సైతం చోటిస్తున్నారు. దీంతో వారు దూసుకుపోతున్నారు. సీనియర్లు కావడంతో అధికారులతో కూడా పనులు చేయించుకుంటున్నారు. వారితో చూసుకుంటే జనసేన ఎమ్మెల్యేల మాటలు కొన్నిచోట్ల చెల్లుబాటు కావడం లేదు. దీంతో వారికి అవమానాలు ఎదురవుతున్నాయి. అయితే ఒకటి కాదు రెండు కాదు దాదాపు జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతి నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి.జనసేన రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ బాధను వ్యక్తం చేస్తే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదూకుడును నియంత్రించాలంటే పొత్తు కొనసాగాలని.. అలా కొనసాగాలంటే సర్దుబాటు చేసుకోవాలని జనసేన ఎమ్మెల్యేలకు నాయకత్వం సూచిస్తోంది. దీంతో ఒక రకమైన అసంతృప్తి ఎమ్మెల్యేల్లో ఉంది. పవర్ లేని ఈ పదవులు ఎందుకని.. టిడిపి నేతల మాటలే చెల్లుబాటు అవుతుంటే ఇక తాము ఉండి ఏమి ప్రయోజనమని ఎక్కువమంది బాధపడుతున్నారు. మున్ముందు ఇదే పరిస్థితి కొనసాగితే జనసేన ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా పక్కకు తప్పుకోవడం ఖాయమని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తప్పకుండా ఇది పార్టీకి నష్టం చేకూరుస్తుందని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు.

# ఇక సైనికులకు బాడీ కెమెరాలు

శ్రీనగర్, జూలై 28, (

సరిహద్దుల్లో చొరబాటుదారుల ఆగడాలకు కేంద్రం టెక్నాలజీతో చెక్ పెట్టబోతోంది. జవాన్లకు బాడీ కెమెరాలు అందజేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. భారత్ సరిహద్దుల్లోకి వచ్చిన అక్రమ చొరబాటుదారులను వెనక్కి పంపించే క్రమంలో సాయుధ బలగాలపైనే తిరగబడుతూ దాడులు చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న సరిహద్దు బలగాలు.. ఇటువంటి ఘటనలను ఆధారాలతో సహా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. దాంతో.. బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కార్యకలాపాలను మరింత మెరుగుపరిచేందుకు అధునాతన బాడీ-వోర్న్ కెమెరాలను సమకూర్చుకుంటోంది. ఈ కెమెరాలు జవాన్ల యూనిఫామ్లకు అమర్చబడి, సరిహద్దుల్లో జరిగే ప్రతి అంశాన్ని రికార్డు చేస్తాయి. దానిలో భాగంగానే.. భారత్-బంగ్లాదేశ్, పాక్ అంతర్జాతీయ సరిహద్దుల్లోని బీఎస్ఎఫ్ జవాన్లకు 5వేలకు పైగా శరీరానికి ధరించే కెమెరాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.ముఖ్యంగా.. బంగ్లాదేశ్, పాక్ సరిహద్దుల వెంట విధులు నిర్వర్తిస్తున్న ఖాఈ దళాలకు ఆయా బాడీ కెమెరాలను అందించనుంది. ఇప్పటికే 2,500 కెమెరాలను పంపిణీ చేయగా, మరో 2,500 కెమెరాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు ఎంపిక చేసిన సరిహద్దు ఔట్ పోస్టుల్లోని సిబ్బందికి ఫింగర్ప్రింట్, ఐరిస్ స్కాన్ వంటి బయోమెట్రిక్ పరికరాలను అందించనున్నట్లు తెలుస్తోంది.

బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారుల నుంచి సేకరించిన ఈ సమాచారాన్ని ఫారినర్స్ రిజిస్ట్రేషన్ ఆఫీస్కు అందజేయనుంది.బీఎస్ఎఫ్ ప్రతిపాదించిన ఈ రెండు విధానపర నిర్ణయాలపై సమగ్ర సమీక్ష తర్వాత కేంద్ర హోంశాఖ ఇటీవల ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే.. రెండు దశల్లో వీటిని భారత్-బంగ్లా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎఫ్కు అందజేస్తుంది. రాత్రిపూట చిత్రీకరణ, 12-14 గంటల ఫుటేజీ నిక్షిప్తం చేసుకునే సామర్థ్యం ఈ కెమెరాలకు ఉండనుంది.

## ఇందిరమ్మ ఇంటికి రుణాలు

ఖమ్మం, జూలై 28,

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. పునాది నిర్మాణానికి ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నారు. లబ్ధిదారులు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం పొంది నిర్మాణం ప్రారంభించవచ్చు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1.74 లక్షల మంది పనులు మొదలుపెట్టారు. ఖమ్మం జిల్లాలో 1,900 మందికి పైగా రూ.22.83 కోట్ల రుణాలు మంజూరు కాగా, ఆగస్టు నెలాఖరుకు మరిన్ని జిల్లాల్లో రుణాలు మంజూరు చేయనున్నారు.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. అయితే ముందు లబ్ధిదారులు ఖర్చు పెట్టుకుంటే ఇంటి నిర్మాణం జరిగే వివిధ దశల్లో మె?త్తం 4 విడతలుగా రూ.5 లక్షల సాయం అందిస్తారు. అయితే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో చాలామంది ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. పునాది స్థాయి వరకు నిర్మాణం పూర్తయితేనే మొదటి విడతగా రూ.లక్ష సాయం ప్రభుత్వం నుండి అందుతాయి. ఈ దశను చేరుకోవడానికి కూడా డబ్బులు లేక కొందరు నిరుపేదలు మంజూరు పత్రాలను వెనక్కి ఇచ్చే పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో సర్కార్ తీపి కబురు చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నిరుపేద లబ్ధిదారులకు డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఇల్లు కట్టుకోవడానికి రూ. 1 లక్ష వరకు రుణం మంజూరు చేస్తున్నారు. ఈ రుణ సాయం రాష్ట్రంలోని పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఊతమిస్తోంది. రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ మినహా మొత్తం 3.68 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. ఇందులో ఇప్పటికే 1.74 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. తొలి విడత బిల్లు పొందడానికి కూడా ఆర్థిక స్థోమత లేని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, స్త్రీనిధి ద్వారా ఇంటి నిర్మాణానికి రూ. 1 లక్ష వరకు రుణం పొందవచ్చు. చెల్లించే సామర్థ్యం ఉన్నవారికి రూ. 2 లక్షలు వరకు కూడా రుణాలు మంజూరు చేస్తున్నారు.ఈ రుణాలు పొందిన కొందరు లబ్ధిదారులు, పునాది దశ దాటి మొదటి బిల్లు అందుకున్న తర్వాత రుణభారాన్ని తగ్గించుకుంటున్నారు. చాలామంది 12 నుండి 24 వాయిదాల్లో రుణం చెల్లించడానికి ఆసక్తి చూపుతున్నారు. సంఘాల్లో పాత అప్పులు లేనివారు, డిఫాల్టర్లు కాని వారికి మాత్రమే బ్యాంకులు ఈ రుణాలు అందిస్తాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 12,038 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉండగా, రూ. 1 లక్ష రుణం పొందేందుకు 7,287 మంది అర్హులుగా గుర్తించబడ్డారు. వీరిలో ఇప్పటికే 1,900 మందికి పైగా లబ్ధిదారులకు రూ. 22.83 కోట్లను రుణంగా అందించారు. మిగిలిన వారికి ఆగస్టు నెలాఖరు వరకు రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో 551 మందికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో 351 మందికి డ్వాక్రా రుణాలు అందజేశారు.జిల్లాలో మొత్తం 8,252 మంది లబ్ధిదారులు ఉండగా, రూ. 1 లక్ష రుణానికి 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మహబూబ్నగర్ జిల్లాలో 466 మందికి రుణం ఇవ్వాలని గుర్తించారు. వనపర్తి, నారాయణపేట జిల్లాలలో కూడా పలువురికి రుణాల మంజూరుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ రుణ పథకం నిరుపేద లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది, తద్వారా రాష్ట్రంలో గృహ నిర్మాణ లక్ష్యాలను చేరుకోవడానికి సహాయపడుతుంది.

## బీసీ వసతి గృహంలో మహిళల భద్రతపై అవగాహన

ఏలూరు జూలై 28, (

ఏలూరు నగరంలోని వట్లూరు బీసీ వెల్ఫేర్ వసతి గృహం లోని విద్యార్థులకు మహిళల భద్రతపై 3 టౌన్ సీఐ కోటేశ్వరరావు సోమవారం ఉదయం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.బాలికల విద్యార్థుల మహిళల భద్రత మా లక్ష్యం అని అన్నారు.శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయాల్లో ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే క్షణాల్లో సహాయం అందిస్తారని ఆయన వారికి తెలిపారు. మేము ఉన్నామని విద్యార్థులకు భరోసా కల్పించారు.

## స్టీల్ ప్లాంట్ జీఎం ఇంట్లో భారీగా విదేశీ మద్యం

విశాఖపట్నం జూలై 28, (

స్టీల్ప్లాంటులో జనరల్ మేనేజర్గా పనిచేస్తున్న రవికుమార్ ఇంట్లో భారీగా విదేశీ మద్యంతోపాటు డిఫెన్స్, ఇతర రాష్ట్రాలకు చెందిన 66 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీఎం పాలెంలోని ఎంవీవీ సిటీలో ఫ్లాట్ నంబర్ 8088లో విదేశీ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్ఫోర్స్ ఎస్ఐ ముసలనాయుడు బృందం సోదాలు జరిపింది. ఆయన ఇంట్లో 18 విదేశీ, 16 డిఫెన్స్, ఒడిశా, గోవా మద్యం సీసాలు ఒక్కొక్కటి, తెలంగాణ మద్యం సీసాలు 11, హరియాణ రాష్ట్ర మద్యం బాటిళ్లు ఏడు, మహారాష్ట్రకు చెందినవి రెండు స్వాధీనం చేసుకున్నారు. రవికుమార్ పరారీలో వున్నాడు.

# అనకాపల్లి టూ ఫోర్త్ సిటీ...

హైదరాబాద్, జూలై 28

అనకాపల్లి బీజేపీ పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ కు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది. కౌంటర్లు ప్రతి కౌంటర్లు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ మరోసారి తెలంగాణ సెంటిమెంట్ రాజకీయాలను తీసుకు వచ్చి మరోసారి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనపడుతుంది. మరొకవైపు ఈ వివాదంలో పారిశ్రామికవేత్త, కాంట్రాక్టరు సీఎం రమేష్ పేరు తెలంగాణ రాజకీయాల్లోకి వచ్చింది. వాస్తవానికి సీఎం రమేష్ టీడీపీలో ఆది నుంచి కొనసాగుతూ 2019 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరిపోయారు. ఇప్పటి వరకూ సీఎం రమేష్ నాయుడు ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయలేదు. రాజ్యసభ సభ్యుడిగానే ఎన్నికయ్యారు.. తొలిసారిగా సీఎం రమేష్ బీజేపీ అభ్యర్థిగా కడప నుంచి కాకుండా అనకాపల్లి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం అనకాపల్లి బీజేపీ ఎంపీగా ఉన్న సీఎం రమేష్ కు చెందిన రిత్విక్ కన్స్ట్రక్షన్ అటు ఆంధ్రప్రదేశ్ లోనూ, ఇటు తెలంగాణలోనూ అనేక కాంట్రాక్టులు చేపట్టినట్లు చెబుతున్నారు. ఏపీలో పనులు చేపడితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ తెలంగాణలో పనులు చేపట్టడంతోనే వివాదానికి కారణమయింది. నిజానికి ఏ1 కాంట్రాక్టు సంస్థ రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడైనా పనులు చేపట్టవచ్చు. ఎందుకంటే అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో కూడా తెలుగు వారికి చెందిన కాంట్రాక్టు సంస్థలు పనులు చేపట్టాయి. ఎందుకంటే టెండర్లు దక్కించుకుని ఎక్కడైనా ఏ సంస్థ అయినా పనులు చేపట్టే అవకాశముంటుంది. కానీ తెలంగాణ విషయానికి వచ్చేసరికి కొంత తేడా వస్తుంది. 2014 కు ముందు వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్న ప్రాంతం రెండుగా విడిపోవడంతో సెంటిమెంట్ వర్క్ అవుట్ అవుతుంది. ఏపీ రాజకీయ పార్టీలు, తెలంగాణ పొలిటికల్ పార్టీలుగా విడిపోయాయి. అందుకే ఇప్పుడు సీఎం రమేష్ అంశం తెలంగాణలో వివాదంగా మారింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో సీఎం రమేష్ ప్రమేయం ఉందని కేటీఆర్ ఆరోపించడంతో పాటు ఫోర్త్ సిటీలోనూ పదహారు వందల కోట్ల రూపాయల పనులు తీసుకున్నారని అనడంతో రగడగా మారింది.. తెలంగాణ ప్రాంతంలో బీజేపీ ఎంపీ, మొన్నటి వరకూ టీడీపీలో ఉన్న సీఎం రమేష్ ఆ పనులను దక్కించుకోవడాన్ని కేటీఆర్ తప్పు పడుతున్నారు. ఏపీకి చెందిన టీడీపీ నేతలు, బీజేపీ నేతలతో రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధాలను గురించి తెలంగాణ ప్రజలకు తెలియజెప్పడంలో భాగంగా సీఎం రమేష్ ను బయటకు తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే సీఎం రమేష్ కూడా కేటీఆర్ పై విరుచుకుపడ్డారు. బీజేపీలో విలీనం చేయడానికి కేటీఆర్ ప్రయత్నం చేశారంటూ ఆయన చెప్పి దీనికి కౌంటర్ ఇచ్చారు. ఇలా సెంటిమెంట్ తో గులాబీ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తుండగా, సీఎం రమేష్ మాత్రం నిబంధనల ప్రకారమే తనకు దక్కినట్లు పరోక్షంగా ఒప్పుకోవడం ఇక్కడ విశేషం. మొత్తం మీద మరోసారి సెంటిమెంట్ రాజకీయాలు సీఎం రమేష్ కాంట్రాక్టు రూపంలో బయటకు వచ్చినట్లు కనిపిస్తున్నాయి. మరి అవి ఏ మేరకు పనిచేస్తాయన్నది చూడాల్సి ఉంది.

# టీచర్స్ ప్రమోషన్ లైన్ క్లియర్

వరంగల్, జూలై 28,

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులకు తీపికబురు చెప్పింది. వారికి కొద్దిరోజుల్లో పదోన్నతులు కల్పించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు సంబంధిత ఫైలుపై సీఎం రేవంత్ రెడ్డి సంతకం చేశారు. దీంతో 3,500 మందికి ప్రయోజనం కలగనుంది. విద్యాశాఖ ఒకట్రెండు రోజుల్లో పదోన్నతుల కోసం షెడ్యూల్ జారీ చేయనుంది. జూన్ 30వ తేదీ వరకు ఉన్న ఖాళీలను పరిగణలోకి తీసుకుంటారని తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం వల్ల 3,500 మంది ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు రానున్నాయి. మల్టీజోన్ -1, మల్టీజోన్-2 పరిధిలో సుమారు 900 గెజిటెడ్ హెచ్ఎం, 600 పీఎస్ హెచ్ఎం పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. వీటితోపాటు మరో 2వేల వరకూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులనూ పదోన్నతులతో నింపనున్నారు. 2023 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మల్టీజోన్ పరిధిలోని హెచ్ఎం బదిలీలు, ఆ పోస్టులకు ప్రమోషన్లు, స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలు జరిగాయి. ఆ తరువాత కోర్టు కేసులతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. 2024 జూన్, జులై నెలల్లో మల్టీజోన్-2 పరిధిలోని హెచ్ఎం పోస్టులతోపాటు మిగిలిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఖాళీ అయిన గెజిటెడ్ హెచ్ఎం పోస్టుల భర్తీకి ప్రమోషన్లు ఇవ్వాలని ఇటీవల సర్కారుకు విద్యాశాఖ ప్రతిపాదనలు పంపించింది. దీనికి సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. రెండ్రోజుల్లో ఉపాధ్యాయ ప్రమోషన్ల షెడ్యూల్ ఇవ్వనున్నారు. ముందుగా జీహెచ్ఎం సీనియార్టీ లిస్టులను మల్టీజోన్ల వారీగా ప్రకటిస్తారు. వీరికి వీటిలో ఏమైనా అబ్జెక్షన్స్ ఉంటే స్వీకరించి, ఫైనల్ సీనియార్టీ లిస్టును రిలీజ్ చేస్తారు. ఆ తరువాత వెకెన్సీలు చూపించి వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. అనంతరం స్కూళ్ల అలాట్ మెంట్ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్, పీఎస్హెచ్ఎం, పీడీ తదితర పోస్టులన్నింటికీ ఇదే విధానాన్ని అనుసరిస్తారు.

# సృష్టి కథ..ఇంతింత కాదయా...

హైదరాబాద్, జూలై 28,

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ కేసులో పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అసలు ఈ కేంద్రంలో టెస్ట్ ట్యూబ్ బేబీ (ఐవీఎఫ్) పద్ధతి జరగలేదని.. బయట వేరొకరికి పుట్టిన బిడ్డలను తీసుకొచ్చి, సంతానం లేని దంపతులకు అద్దె గర్భం ద్వారా పుట్టారని నమ్మించి ఇచ్చినట్లు పోలీసులు తేల్చారు. ఈ దారుణ మోసం ద్వారా డాక్టర్ నమ్రత దంపతుల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు వెల్లడైంది. ఇది కేవలం వైద్య మోసం కాదని.. బిడ్డల అక్రమ రవాణాఅని పోలీసులు పేర్కొన్నారుఈ కేసు వివరాలను నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. గోపాలపురంకు చెందిన ఒక జంట ఇచ్చిన ఫిర్యాదుతో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై రైడ్ చేశామని డీసీపీ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన ఒక దంపతులు ఆన్‌లైన్‌లో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ గురించి తెలుసుకుని డాక్టర్ నమ్రతను సంప్రదించారు. సరోగసి (అద్దె గర్భం) పద్ధతిలో పిల్లలు పుట్టించడానికి రూ.30 లక్షలు అవుతుందని నమ్రత వారికి చెప్పింది. దీంతో దంపతులు విజయవాడ వెళ్లి, అక్కడ తమ శాంపిల్స్ ఇచ్చారు. సరోగసి కోసం అద్దె గర్భం మోసే మహిళ దొరికిందని డాక్టర్ వారికి నమ్మబలికింది. కొన్ని నెలల తర్వాత బాబు పుట్టాడని ఆ జంటకు డాక్టర్ నమ్రత చెప్పింది. సిజేరియన్ ద్వారా డెలివరీ అయిందని అబద్ధం చెప్పి.. అదనంగా మరో రూ.10 లక్షలు వసూలు చేసింది. దీంతో మొత్తం రూ.40 లక్షలు దంపతుల నుంచి లాగేసింది. అయితే.. కొన్ని నెలల తర్వాత ఆ బాబు పోలికలు ఆ దంపతులకు అనుమానాస్పదంగా అనిపించాయి. దీంతో వారు డీఎన్ఏ టెస్ట్ చేయాలని డాక్టర్‌ను కోరారు. ఇందుకు నమ్రత అస్సలు ఒప్పుకోలేదు. దాంతో దంపతులు ఢిల్లీలో డీఎన్ఏ టెస్ట్ చేయించారు. ఆ పరీక్షలో ఆ బిడ్డ తమకు చెందినది కాదని.. మరొకరి డీఎన్ఏగా తేలడంతో దంపతులు డాక్టర్ నమ్రతను నిలదీశారు. అయితే.. నమ్రత తన కొడుకు జయంత్ కృష్ణతో కలిసి బాధితులను బెదిరింపులకు పాల్పడింది. జయంత్ కృష్ణ తాను న్యాయవాదినని చెప్పుకొని బెదిరించాడు. డాక్టర్ నమ్రత చేసింది నిజానికి సరోగసి కాదు. వేరే మహిళకు పుట్టిన బిడ్డను తీసుకొచ్చి, సరోగసి ద్వారా మీకు పుట్టిన బిడ్డ అని దంపతులను నమ్మించింది. ఢిల్లీకి చెందిన ఒక గర్భిణిని ఫ్లైట్‌లో వైజాగ్ తీసుకొచ్చి, అక్కడ డెలివరీ చేసి, ఆమెకు పుట్టిన బిడ్డను ఆ రాజస్థాన్ దంపతులకు ఇచ్చింది. బిడ్డను వద్దనుకున్న ఆ మహిళకు రూ.90 వేలు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు. సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని, ఆ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరిందని డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. హైదరాబాద్ మెడికల్ ఆఫీసర్ వెంకట్ కూడా ఈ రైడ్‌లో పాలుపంచుకుని.. 2020లోనే వారి అనుమతులు ముగిశాయని, ఆసుపత్రి మూసేస్తున్నామని వారు చెప్పారని.. క్లోజింగ్ సర్టిఫికెట్ కూడా ఇచ్చామని చెప్పారు. అయినా అక్రమంగా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను నడుపుతున్నారని ఆయన అన్నారు. సెంటర్‌లో థియేటర్, అనస్థీషియా ల్యాబ్, బెడ్స్, 7 రకాల అనాలసిస్ చేసే ఎక్విప్‌మెంట్ ఉన్నాయని, డస్ట్ బిన్ చెక్ చేస్తే రెగ్యులర్ ప్రాసెస్ చేస్తున్నట్లు ఆధారాలు సేకరించామని పోలీసులు తెలిపారు. డాక్టర్ నమ్రతపై రెండు రాష్ట్రాల్లో 10కి పైగా కేసులు ఉన్నాయని, ఐవీఎఫ్ ఫెయిల్యూర్, సరోగసిలో అక్రమాలు వంటి కేసులు ఉన్నాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసులో ఇంకా చాలా మందికి పాత్ర ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, ఏడుగురిని రిమాండ్‌కు తరలించారు.

వీర్యాలు మార్చి దందా

సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్‌బజార్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఘటనలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతతో పాటు ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు, వైద్యాధికారులు పలు కీలక పత్రాలు, వీర్య కణాల శాంపిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌కు ఇండియన్ స్పెర్మ్ టెక్ సంస్థకు సంబంధాలు ఉన్నట్టు గుర్తించారు. అద్దె గర్భాల కోసం అక్రమంగా వీర్యాన్ని, అండాలను సేకరిస్తున్నట్టు తేలింది. వీర్యం దానం చేసేవారికి ఒక్కొక్కరికి రూ.5- 10 వేల వరకు ఇస్తున్నట్లు తెలిసింది. ఫోర్న్ వీడియోల చూపించి వారితో వీర్యం సేకరిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వారి ఆరోగ్య పరిస్థితితో సంబంధం లేకుండా వీర్యం దానం చేస్తున్నట్లు తెలిసింది. ఇలా సేకరించిన వీర్య కణాలు, అండాలను గుజరాత్, మధ్యప్రదేశ్‌లకు తరలిస్తున్నట్టు గుర్తించారు. అనుమతులు లేకుండానే రెజిమెంటల్ బజార్‌లో ఇండియన్ స్పెర్మ్‌టెక్ సంస్థను నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆ సంస్థ రీజినల్ మేనేజర్ పంకజ్ సోనీని నిందితుడిగా చేర్చారు. పంకజ్, సంపత్, శ్రీను, జితేందర్, శివ, మణికంఠ, బోరోలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ అక్రమ దందాపై పోలీసులు మరింత లోతైన విచారణ జరుపుతున్నారు.

ఎఫ్ ఐ ఆర్ లో విస్తుపోయే నిజాలు

సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై ఈనెల 25న గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజస్థాన్‌కు చెందిన బాధితురాలు సోనియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రాజస్థాన్‌కు చెందిన సోనియా దంపతులు ఆగస్టు 2024న డాక్టర్ నమ్రతాను కలిశారు. తమకు సంతానం కావాలని, ఐవీఎఫ్ ప్రొసీజర్ ద్వారా సంతానం కలిగేలా చేయాలని కోరారు. దీంతో డాక్టర్ నమ్రతా ఐవీఎఫ్ ప్రొసీజర్ కోసం వారి నుంచి రూ.30లక్షలు డిమాండ్ చేసింది. దీంతో 15 లక్షల రూపాయలు చెక్కు రూపంలో, మిగిలిన 15 లక్షల రూపాయలు బ్యాంక్ అకౌంట్ ద్వారా దంపతులు ట్రాన్స్ఫర్ చేశారు. ప్రొసీజర్ లో భాగంగా విశాఖపట్టణంలో మరో బ్రాంచ్‌కు శాంపిల్ కలెక్షన్ కోసం ఆ దంపతులను పంపించారు. కేవలం మెడికల్ టెస్టుల కోసం రూ.66వేలు తీసుకున్నట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుసార్లు విశాఖ సెంటర్‌కు పంపించినట్లు బాధితులు పేర్కొన్నారు. విశాఖలోని సృష్టి టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్ ద్వారా గతంలో అనేక దారుణాలకు నిర్వాహకులు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పేద మహిళలను టార్గెట్ చేసి అద్దె గర్భంతో ఆస్పత్రి నిర్వాహకురాలు లక్షలు సంపాదించినట్లు తెలుస్తోంది. గతంలో ఈ ఆస్పత్రిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. విజయవాడలోనూ బెంజ్ సర్కిల్ సమీపంలో యూనివర్శల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ ఉంది. 2015 నుంచి వీరి దందా కొనసాగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది. ఈ ఆస్పత్రిపై రెండు సార్లు పోలీసు కేసులు నమోదయ్యాయి. పలు సందర్భాల్లో లైసెన్సునుసైతం రద్దు చేశారు. ఆ తరువాత, వేరేవారి పేరుపై ఈ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. డాక్టర్ కరుణ పేరుపై ఈ సెంటర్ నడుస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆమెకోసం గాలిస్తున్నారు. సంతానం లేమి దంపతులకు సరోగసీ ద్వారా తక్కు ధరకే సంతాన ప్రాప్తి కల్పిస్తామని కృష్ణా, గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో డాక్టర్ నమ్రతా గతంలో స్వయంగా ప్రచారం చేసినట్లు చెబుతున్నారు.

# భారతీయులు వెళితే అధోగతే....

హైదరాబాద్, జూలై 28,

అగ్రరాజ్యం.. ప్రపంచానికి పెద్దన్నగా చెలామణి అవుతున్న అమెరికా.. అధ్యక్ష పగ్గాలు జనవరిలో డొనాల్డ్ ట్రంప్ చేపట్టారు. అప్పటి వరకు సాఫీగా సాగుతున్న అమెరికా ట్రంప్ రాకతో ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. తలతిక్క నిర్ణయాలు.. తలా తోక లేని ఉత్తర్వులు, ఆదేశాలతో ఇటు అమెరికన్లను, అటు అమెరికాలోని విదేశీయులు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను భయపెడుతున్నారు. తాజాగా భారత ఐటీ నిపుణులే లక్ష్యంగా అమెరికాలోని ఐటీ కంపెనీలకు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. భారతీయులను నియమించుకోవద్దని ఆదేశించారు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో భారతీయులు అగ్రరాజ్యాన్ని వీడితే అడుక్కు తినాల్సి వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా దశాబ్దాలుగా అగ్రరాజ్యంగా కొనసాగుతుండడానికి భారతీయులు కూడా కారణం. ఇండియన్ ఐటీ ప్రొఫెషనల్స్.. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో కీలకంగా ఉన్నారు. అనేక సంస్థల ఆర్థికాభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. అమెరికాకు ఆర్థికంగా, సామాజికంగా మంచి గుర్తింపు తెస్తున్నారు. ఇండియన్స్ లేకుంటే.. అమెరికా లేదు అని ఆ దేశ మాజీ అధ్యక్షుడు మూడు దశాబ్దాల క్రితం అన్న మాటలు ఇక్కడ ప్రస్తావించుకోవాలి. మన ఐటీ నిపుణుల కారణంగానే 30 శాతం అమెరికా ఐటీ కంపెనీలు మనుగడ సాధిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. భారతీయులపై ట్రంప్ వ్యతిరేకత గురించి ఆలోచిస్తే ఆయన కోణంలో అది సరైనదే. 'అమెరికా ఫస్ట్' పాలసీ ఆయన వ్యక్తిగతమైనది.. దీనిని అమెరికా అంతటా బలవంతంగా రుద్దడం సరికాదని నిపుణులు పేర్కొంటున్నారు. ట్రంప్ వ్యతిరేకత.. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకుని భారతీయులు అగ్రరాజ్యాన్ని వీడితే, అమెరికాలోని టెక్నాలజీ, ఇతర కీలకమైన రంగాలలో ప్రభావం ఉంటుంది. భారతీయులు హెచ్?1బీ వీసాల ద్వారా అమెరికాలో ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ఈ ఉద్యోగాలు అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైనవి. ఈ ఉద్యోగాలు తగ్గితే, అమెరికన్ కంపెనీలు నైపుణ్యం గల ఉద్యోగుల కొరత ఏర్పడుతుంది. ఇది ఖర్చులు, సమయం పెరుగుతుంది. అలాగే, భారతీయులు అగ్రరాజ్యాన్ని వీడితే, భారత్‌లోని టెక్నాలజీ రంగం మరింత బలోపేతం అవుతుంది, ఇది భారత ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది. అమెరికా నుంచి కంపెనీలు తరలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే అక్కడ ఉన్నవారికి ఉద్యోగాలు కాకపోగా.. అమెరికా ఆర్థిక పరిస్థితి ఏడాది తిరగకుండానే దారుణంగా పడిపోతుంది. దీంతో నంబర్ వన్ స్థానం చైనా సొంతం అవుతుంది. అదే జరిగితే అమెరికా అడుక్కు తినాల్సిన పరిస్థితి వస్తుంది.

# కెమెరా లేకుండానే వ్యక్తులను గుర్తించే హూ-ఫై!

## సరికొత్త నిఘా టెక్నాలజీ అభివృద్ధి

న్యూఢిల్లీ జూలై 28

ఎలాంటి కెమెరాలు అవసరం లేకుండా, విజువల్ ఇన్‌పుట్‌తో పనిలేకుండా వ్యక్తులను గుర్తించే హైటెక్ నిఘా టెక్నాలజీని ఇటలీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఏఐతో పనిచేసే ఈ సాంకేతికతతో వ్యక్తులను, వారి కదలికలను గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. ఈ టెక్నాలజీని హూ-ఫై(చిష్ట్రనీ-ఈతి )గా వ్యవహరిస్తున్నారు. సాధారణ వైఫై సిగ్నల్‌ని బయోమెట్రిక్ స్కానర్‌గా ఇది మారుస్తుందని వెల్లడించారు. ఫింగర్‌ప్రింట్ స్కానర్, ఫేషియల్ రికగ్నిషన్ వంటి సంప్రదాయ బయోమెట్రిక్ సిస్టమ్స్ మాదిరిగా దీనికి ఫిజికల్ కాంటాక్ట్, విజువల్ ఫీడ్ అవసరం లేదు. కేవలం వైఫై సిగ్నల్స్ ద్వారా ఇది పనిచేస్తుంది.

ఎలా పనిచేస్తుంది? వైఫై సిగ్నల్స్‌ని వ్యక్తి అడ్డుకునే తీరును బట్టి ఈ హూ-ఫై టెక్నాలజీతో ఆ వ్యక్తిని గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. వైఫై సిగ్నల్స్ సమీపంలోకి వ్యక్తి వచ్చినప్పుడు, సిగ్నల్ సహజంగా ప్రయాణించే మార్గంలో ఆటంకాలు ఏర్పడతాయి. ఫలితంగా ఒక యూనిక్ ప్యాటర్న్ ఏర్పడుతుంది. చేతి వేలిముద్రలు, ముఖ కవళికలు, రెటీనా నిర్మాణం వంటి బయోమెట్రిక్ సిగ్నేచర్స్ మాదిరిగానే ఇది అత్యంత కచ్చితంగా ఉంటుంది.

# రెచ్చిపోతున్న కల్తీ మద్యం మాఫియా

నల్గొండ జూలై 28,

తెలంగాణ టూ ఆంధ్రా వయా తెలంగాణ సరిహద్దు గ్రామాలు.. ఇలా కల్తీ మద్యం మాఫియా రెచ్చిపోతోంది. తాజాగా సూర్యపేటలో ఏకంగా పంటపొలాలు తవ్వితే రెండు వేరు వేరు చోట్ల భారీగా కల్తీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న వేళ కల్తీ సరకును ఇలా భూమిలో దాచి మరీ సిద్ధం చేశారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. తెలంగాణకు సరిహద్దు జిల్లా సూర్యపేట కావడంతో ఈ ప్రాంతాన్ని అడ్డగా చేసుకున్న కల్తీ మద్యం కేటుగాళ్లు భారీ స్థాయిలో సరకు నిల్వ చేయడంతోపాటు ఆంధ్రాలోని వివిధ జిల్లాలకు ఇక్కడి నుంచి కల్తీ సరకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కల్తీ మద్యం మాఫియాను సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో కీలకంగా మారిన ప్రవీణ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా రంగంలోకి దిగిన ఎక్సైజ్ పోలీసులు సూర్యపేటలోని మేళ్ల చెరువుకు సమీపంలోని వ్యవసాయ భూముల్లో జేసిబిలతో తవ్వకాలు చేపట్టారు. జేసీబీలతో భూమిని తవ్వుతున్నకొద్దీ కేసుల కల్తీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వేలాదిగా వివిధ బ్రాండ్ లకు చెందిన మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్న మరో వ్యక్తి ఇచ్చిన సమాచారంతో దొండపాడు, రామాపురంలో తవ్వకాలు చేపట్టిన ఎక్సైజ్ శాఖ అధికారులకు కళ్లుచెదిరేలా మద్యం సీసాల డంప్ లు దర్శనమిస్తున్నాయి. భూమిని త్వవుతున్న కొద్దీ కాటన్ల లో నిల్వ ఉంచిన కల్తీ మద్యం కంటపడుతోంది. 2014 ఎన్నికల సమయంలోనే ఇక్కడ భారీగా కల్తీ మద్యం భూమిలో దాచి ఉంచి, ఇక్కడి నుంచే తెలంగాణ, ఆంధ్రాలోని వివిధ జిల్లాలకు సరఫరా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ముఖ్యంగా ఏపీలోని బెల్టు షాపులే టార్గెట్‌గా గతేడాది నుంచి కల్తీ మద్యం దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నట్లుగా గుర్తించారు. ఇదిలా ఉంటే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలకు సరఫరా చేసేందుకు భారీగా కల్తీ మద్యం నిల్వ ఉంచడంతోపాటు, మద్యం తయారీకి ఉపయోగించే 14వేల లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకున్నారంటే ఎంతలా కల్తీ మద్యం తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా సరఫరా జరుగుతోందో అర్ధం చేసుకోవచ్చు. ఇంతలా మందుబాబుల ప్రాణాలు తీసే ఈ కల్తీ మద్యం హైదరాబాద్ కేంద్రంగా తయారవుతున్నట్లుగా గుర్తించారు. ఉప్పల్ లోని శ్రీకృష్ణా ఫార్మసీ నుంచి కల్తీ మద్యం తయారీకి అవసరమైన స్పిరిట్ సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఈ ఫార్మసీ నుంచి నవ్వా ఎజెన్సీ స్పిరిట్ కొనడంతోపాటు గుట్టుచప్పుడు కాకుండా రైస్ మిల్లులను అడ్డగా చేసుకుని కల్తీ మద్యం తయారు చేస్తున్నట్లుగా గుర్తించారు. సుమారుగా 180 ప్రముఖ బ్రాండ్లకు చెందిన మద్యాన్ని కల్తీ చేయడంతోపాటు, దాదాపు అదే బ్రాండ్‌ను పోలి ఉండేలా మద్యం తయారు చేసి బెల్టు షాపులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ప్రమాదకరమైన రెక్టిఫైడ్ స్పిరిట్ ను మద్యం తయారిలో వాడటంతోపాటు, ఎంత మోతాదులో స్పిరిట్ కలపాలి అనేదాని కోసం ప్రత్యేకంగా మిషన్ ఏర్పాటు చేసుకుని స్పిరిట్ 25 శాతం ఉండేలా కల్తీ సరకు తయారు చేస్తున్నారు. బాటిల్ కు రెండు వైపులా లేబుల్ వేయడం , మూతలు ఫిక్స్ చేయడం ఇలా దాదాపు ఒరిజినల్ ను తలపించేలా మద్యం తయారు చేస్తున్నారు. కల్తీ మద్యం మాఫియాకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే పరారీలో ఉన్న మరో నలుగురి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.



# ట్యాపింగ్ ఫైల్స్... రోజుకో మలుపు

హైదరాబాద్, జూలై 28,

తెలంగాణ ట్యాపింగ్ ఫైల్ పాలిటిక్స్‌లో హైవోల్టేజ్ హీట్‌ను క్రియేట్ చేస్తున్నాయి. రోజుకో లీకు..వారం రోజులకో ఇద్దరిని విచారిస్తూ..కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోందంటూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై గాలి గత్తర నడుస్తూనే ఉంది. ఈ ప్రచారానికి చెక్ పెట్టేందుకు బీఆర్ఎస్ కూడా రివర్స్ రూట్‌లో వస్తోంది. తాము ఫోన్ ట్యాప్ చేయలేదని చెప్పడం కంటే..సీఎం రేవంత్ కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని..అందుకు ఉదాహరణలు ఇవ్వే అంటూ దుమ్మెత్తిపోస్తోంది.రేవంత్‌రెడ్డి కూడా మంత్రులు, అపోజిషన్ లీడర్లతో పాటు వేలాది ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావులు ఆరోపిస్తూ వస్తున్నారు. కేటీఆర్ అయితే మరో అడుగు ముందుకేసి..తన సీటుకు ఎవరు ఎసరు పెడతారో అనే భయంతో సహచర మంత్రుల ఫోన్లను కూడా రేవంత్ ట్యాప్ చేయిస్తున్నారని బాంబు పేల్చారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ ఫోన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాపింగ్ చేయిస్తున్నారని కేటీఆర్ ఓపెన్‌గానే చెప్పేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై లై డిటెక్టర్ టెస్ట్‌కుకు సిద్ధమా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ కూడా విసిరారు. బీఆర్ఎస్ నేత, రిటైర్డ్ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అయితే ఇంకో అడుగు ముందుకేసి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ కూడా సీఎం ట్యాప్ చేయిస్తున్నారని పెద్ద మాటే అనేశారు.ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి తన భార్య ఫోన్‌ను కూడా ట్యాప్ చేస్తున్నారని..16మంది హీరోయిన్ల ఫోన్లు కూడా ట్యాప్ చేస్తున్నారంటూ లెక్కలతో సహా సంచలన ఆరోపణలు చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ట్యాపింగ్ వార్ పీక్ లెవల్‌కు చేరుకుంది. కౌశిక్‌రెడ్డి కామెంట్స్‌పై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేయడం ఆయనపై కేసులు నమోదవడంతో ట్యాపింగ్ ఫైటింగ్ ఉత్కంఠ రేపుతోంది. కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేస్తారన్న సమాచారంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆయన ఇంటి దగ్గర భారీగా గుమిగూడటంతో మరోసారి న్యూస్ హెడ్‌లైన్‌గా మారింది ట్యాపింగ్ ఎపిసోడ్.అయితే తమ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరగలేదని..ఒకవేళ ట్యాపింగ్ జరిగినా తనకు సంబంధం లేదని కేటీఆర్ ఎంత చెప్తున్నా అనుకున్నంతగా పబ్లిక్‌లోకి వెళ్లడం లేదట. సిట్ దర్యాప్తు అంటూ ఇస్తున్న లీకులతో అడ్డగోలు ప్రచారం జరుగుతోందని బీఆర్ఎస్ అధినాయకత్వం గ్రహించిందట. అందుకే కారు రివర్స్ గేర్ వేయాల్సిందేనని ఫిక్స్ అయ్యారట. దాంతో ట్యాపింగ్ ఇష్యూను..ట్యాపింగ్ ఆరోపణలతోనే తిప్పికొట్టే ప్రయత్నం చేస్తోంది బీఆర్ఎస్. అందుకు తగ్గట్లుగా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నామని సీఎం ఆఫ్ ది రికార్డులో చెప్పినట్లు వచ్చిన వార్తలను అస్త్రంగా మల్చుకుంటోంది కారు పార్టీ.మంత్రులు మాట్లాడుకున్న ఫోన్ సంభాషణను సీఎం విన్నారని.. ప్రైవేటు హ్యాకర్లతో ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని సీరియస్ అలిగేషన్ చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి. ట్యాపింగ్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిపై మంత్రులు కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారని..మంత్రులు ఢిల్లీలోనే ఉండిపోవడంతో..శుక్రవారం జరగాల్సిన మంత్రివర్గ సమావేశం వాయిదా పడిందని బీఆర్ఎస్ కాస్త గట్టిగానే వాయిస్ రేజ్ చేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ అంశం తేలే దాకా మంత్రివర్గ సమావేశానికి హాజరు కాబోమని మంత్రులు తేల్చి చెప్పారని కూడా అంటున్నారు గులాబీ పార్టీ నేతలు. అంతే కాదు సోమవారం మంత్రివర్గ సమావేశం జరిగేది కూడా డౌటేనని అంటోంది గులాబీ పార్టీ.సీఎం రేవంత్ రెడ్డి తన సహచర మంత్రుల ఫోన్లతో పాటు హీరోయిన్ల ఫోన్లు కూడా ట్యాప్ చేసి ఎవరేం మాట్లాడుకుంటున్నారో వింటున్నారంటున్న బీఆర్ఎస్ ఆరోపణల్లో వాస్తవం ఎంతుందో గానీ..తెలంగాణ రాజకీయాల్లో మాత్రం సంచలనం రేపుతోంది. బీఆర్ఎస్ లీడర్లు చేసిన ట్యాపింగ్ ఆరోపణలతో క్యాబినెట్‌లో కలకలం నడుస్తూనే ఉంది. ఇక అధికార కాంగ్రెస్ నేతల్లో కూడా ట్యాపింగ్ గుబులు టెన్షన్ పెడుతోందట.గులాబీ నేతలు చెప్తున్నట్లు నిజంగానే ట్యాపింగ్ చేస్తున్నారా? తాము ఎవరెవరితో మాట్లాడుతున్నామో, ఎవరెవరిని కలుస్తున్నామో సీఎం రేవంత్ రెడ్డి అంతా తెలుసుకుంటున్నారా అని మంత్రులతో సహా పార్టీ లీడర్లలో కూడా అనుమానం వ్యక్తమవుతోందట. అయితే కేసీఆర్ హయాంలో జరిగిన ట్యాపింగ్ బాగోతంపై నిజాలు బయటకు రావొద్దనే..బీఆర్ఎస్ నేతలు అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపారని కూడా కాంగ్రెస్ కూడా కౌంటర్ ఇస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య జరుగుతోన్న ఈ ఫోన్ ట్యాపింగ్ ఆటలో పైచేయి సాధించేదెవరో చూడాలి

## గోశాలలో మృత్యుఘోష

యర్రబాలెం:మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం శ్రీ కృష్ణానంద ఆశ్రమం ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా నిర్వహిస్తోన్న గోశాల మృత్యుఘోష కు నిలయంగా మారింది. ఇటీవల గోశాలలోని పలు ఆవులు మృత్యువాత పడ్డాయి. తాజాగా ఓ ఆవుదూడ మృతి చెంది రెండు రోజులు గడిచినా సిబ్బంది చూసీచూడనట్లు గా వ్యవహరించారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు.గోశాలలో సరైన వసతి సౌకర్యాలు లేక గోవుల ప్రాణాలకు రక్షణ కరువైపోతోంది. నిలువ నీడ లేక ఆవులు ఎండకు ఎండి పోయి వానకు తడిచిపోతున్నాయి. ప్రధానంగా గోశాల ప్రాంగణంలో ఇటీవల కురిసిన వర్షాలకు చిత్తడి చిత్తడిగా తయారైంది. గోమూత్రం,పేడతో గోశాల అపరిశుభ్రతకు కేరాఫ్ గా మారింది. గోవులు పడుతున్న ఇబ్బందులను గమనించిన కొందరు దాతలు గోశాలలో షెడ్లు నిర్మించేందుకు ముందుకు వస్తున్నా.... తమ పెత్తనానికి ఎక్కడ గండి పడుతోందోననే దురాలోచనతో షెడ్ల నిర్మాణాన్ని అంగీకరించడం లేదు.

# జలపాతం దగ్గర ఏడుగురు మిస్సింగ్

వరంగల్, జూలై 28,

వర్షాకాలం ప్రారంభం కావడంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని జలపాతాలు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. అయితే మారుమూల ప్రాంతాల్లో ఉన్న కొన్ని జలపాతాలు ఆకర్షిస్తాయి. కానీ ఇక్కడికి వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అందుకే ఇలాంటి వాటిని గుర్తించి పోలీసులు కొన్ని జలపాతాల వద్దకు వెళ్లేందుకు నిషేధించారు. అయితే కొంతమంది యువత మాత్రం ఇక్కడికి వెళ్లి.. సరదాగా గడపాలని అనుకున్నారు. కానీ అనుకోని పరిస్థితుల్లో అడవిలో చిక్కుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందంటే?ములుగు జిల్లలో బొగత జలపాతం గురించి అందరికీ తెలసిన విషయమే. వర్షాకాలంలో ఇక్కడ అద్భుతమైన దృశ్యం కనిపిస్తుంది. అయితే ఈ జిల్లాలో కేవలం బొగత మాత్రమే కాకుండా మరెన్నో జలపాతాలు ఉన్నాయి. కానీ ఇక్కడికి వెళ్లేందుకు అనువైన రవాణా మార్గం లేదు. అంతేకాకుండా అక్కడ ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. దీంతో వాటిని నిషేధించారు. అలా నిషేధం ఉన్న జలపాతాల్లో గుడి చెరువు జలపాతం ఒకటి.ములుగు జిల్లాలోని వాజేడు మండలంలోని బొల్లారం అడవిలో ఉన్న ఈ జలపాతాన్ని చూసేందుకు వరంగల్ నిట్ లో చదువుతున్న కొందరు విద్యార్థులు ఇక్కడికి వెళ్లారు. వీరిలో నలుగురు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నాయి. . అయితే గుడి చెరువు జలపాతం వద్దకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో చీకటి పడింది. దీంతో దారి తప్పారు. ఈ క్రమంలో భయాందోళన చెందిన వారు 100 కు డయల్ చేశారు. దీంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. మొబైల్ సిగ్నల్ ఆధారంగా వీరిని మొత్తానికి పట్టుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు సిబ్బంది కష్టపడి వీరిని పట్టుకొని బొల్లారం గ్రామానికి తీసుకొచ్చారుఈ సందర్భంగా పోలీసులు వారిని మందలించారు. స్నేహితులతో సరదాగా జలపాతాలకు వెళ్లడం సబబే. కానీ నిషేధిత జలపాతాల వద్దకు వెళ్లడంపై కొందరు ఆగ్రహిస్తున్నారు.



అంతేకాకుండా సాయంత్రం సమయంలో ఇలా అటవీ ప్రాంతానికి రావడంపై కొందరు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో ఇలా రావడంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం బయటకు రావడంతో చాలా మంది తల్లిదండ్రులు అప్రమత్తం అయ్యారు. తమకు దూరంగా చదువుతున్న తమ పిల్లల గురించి ఆరా తీశారు. అలాగే నిట్ లో చదువుతున్న వారికి తల్లిదండ్రులు ఫోన్ చేసి క్షేమ సమాచారాలు తెలుసుకుంటున్నారు.అయితే జలపాతాల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున? విద్యార్థులు, యువత ఇక్కడ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతేకాకుండా నిషేధిత జలపాతాల వద్దకు వెళితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇలాంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఇంట్లో వారికి లేదా సంబంధిత కళాశాల యాజమాన్యానికి తెలియజేయాలన్నారు

# జాగృతి కవిత దారెటు...

హైదరాబాద్, జూలై 28,

రాజకీయాలలో స్వయం ప్రకాశకాలుగా వెలిగే వారికే విలువ ఎక్కువగా ఉంటుంది. అలాంటి వారికే అధికారం దక్కుతుంది. కొన్ని సందర్భాలలో వారు అనుకున్న లక్ష్యాలు నెరవేరకపోయినప్పటికీ.. అంతిమ కాలంలో వారు కోరుకున్న వారిని




నెరవేరుతుంటాయి. అయితే తెలంగాణ రాజకీయాలలో స్వయం ప్రకాశితంగా ప్రారంభంలో వెలగలేకపోయినప్పటికీ.. ఆ తదుపరి కెసిఆర్ తన రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ప్రత్యర్థులను అడుగుదాక తొక్కారు. ఆ తర్వాత ఆయన స్వయం ప్రకాశంగా వెలగడం మొదలుపెట్టారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత కెసిఆర్ నీడలోనే ఎదిగినప్పటికీ.. ఆ తదుపరి వారి వారి రాజకీయ క్షేత్రాలలో విజయవంతమయ్యారు.కేటీఆర్, హరీష్ రావుకు పార్టీలో ఎదురనేది లేకపోయినప్పటికీ.. కల్వకుంట్ల కవితకు 2019 పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్ స్థానంలో అనూహ్యంగా స్పీడ్ బ్రేక్ పడింది. అది ఆమె రాజకీయ భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేసింది. కెసిఆర్ ఆమెకు శాసనమండలి స్థానం ఇచ్చినప్పటికీ.. కవిత ప్రస్థానం ఒకరకంగా పార్టీలో ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది. దీనికి తోడు ఢిల్లీలో చోటు చేసుకున్న లిక్కర్ కుంభకోణం ఆమె రాజకీయ జీవితాన్ని మరింత ప్రభావితం చేశాయి. ఆ కేసు నుంచి బెయిల్ ద్వారా ఆమె బయటికి వచ్చినప్పటికీ.. ఇప్పటికీ ఆ ఇబ్బందులు ఆమెను వేధిస్తూనే ఉన్నాయి. ఇక తాజాగా పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తన స్వరాన్ని వినిపించడం ఒకరకంగా తన తండ్రికి కోపం తెప్పించినట్టయింది. పార్టీలో నిరసన స్వరాన్ని గులాబీ అధినేత ఏమాత్రం సహించలేరు. అవసరమైతే తనతో పాటు వచ్చిన వాళ్లను.. తనతో పాటు నడిచిన వాళ్లను ఆయన దూరం చేసుకుంటారు. మొహమాటం లేకుండా బయటికి గెంటేస్తారు. ఆలే నరేంద్ర నుంచి మొదలుపెడితే ఈటెల రాజేందర్ వరకు ఈ ఉదంతాలు కళ్ళ ముందు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే దీనికి కల్వకుంట్ల కవిత మినహాయింపు కాదని అనుకుంటున్నప్పటికీ.. ఇంతవరకు ఆమె పార్టీ నుంచి బయటికి వచ్చిన దాఖలాలు లేవు. కాకపోతే గులాబీ అధినేత ఆమెకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని.. మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తన సోదరుడితో రాజకీయంగా విభేదాలు ఉన్నాయని కల్వకుంట్ల కవిత స్వయంగా చెప్పారు. దీంతో ఆమె రాజకీయ క్షేత్రం సొంతంగానే ఉండబోతుందని సంకేతాలు కూడా ఇచ్చారు. దానికి తగ్గట్టుగానే తన సంస్థ జాగృతి ఆధ్వర్యంలో లీడర్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.హైదరాబాద్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్ లో కల్వకుంట కవిత ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. సాధారణంగా కల్వకుంట్ల కవితకు గులాబీ కరపత్రిక విపరీతమైన కవరేజ్ ఇస్తుంది. కానీ ఈసారి ఎందుకనో ఆమెను దూరం పెట్టింది. చివరికి ఆమె ఫోటో లేకుండా.. ఆమె పేరు ప్రస్తావన లేకుండా వార్తలను ప్రచురించే స్థాయికి నమస్తే తెలంగాణ ఎదిగింది. సరే దీని వెనుక ఎవరున్నారు అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉన్నత విద్యావంతురాలు, వాగ్ధాటి అధికంగా ఉన్న కల్వకుంట్ల కవిత తనకంటూ ఒక రాజకీయ క్షేత్రాన్ని నిర్మించుకుంటున్నారు. దీనివల్ల ఆమె విజయవంతం అవుతారా? విఫలమవుతారా? అనే ప్రశ్నలు పక్కన పెడితే ఆమె మాత్రం ప్రయోగం చేస్తున్నారు. సాధారణంగా రాజకీయాలలో మేల్ డామినేషన్ అధికం. ఇది కల్వకుంట్ల కవితకు కూడా అనుభవంలోకి వచ్చింది. తన రాజకీయ వారసుడిగా గులాబీ దళపతి కేటీఆర్ వైపే మొగ్గు చూపిస్తున్నారు. అయితే ఈ పరిణామం కవితకు కాస్త బాధను కలిగించినట్టైంది. అందువల్లే ఆమె ఈ ప్రయాణాన్ని ఎంచుకుంది. ప్రస్తుతానికి జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీడర్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. ముగింపు రోజు కల్వకుంట కవిత ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగిస్తారని జాగృతి కార్యకర్తలు చెబుతున్నారు.

# దశాబ్దకాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు

హైదరాబాద్, జూలై 28

దశాబ్ద కాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు లభించడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు.ఆదివారం తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు నారగౌని పురుషోత్తం నేతృత్వంలో రవీంద్రభారతిలో తెలంగాణ సన్మాన్ 2025 పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారాన్ని బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ సభకు అధ్యక్షత వహించారు. భాషాభివృద్ధి సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చిట్యాల ఐలమ్మ స్మారక పురస్కారాన్ని అందజేశారు. వీరితో పాటు సీనియర్ ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం, ప్రముఖ గాయకులు దరువు అంజన్నకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాపరెడ్డికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభిస్తోందని అన్నారు. పది సంవత్సరాలుగా ఉద్దేశపూర్వకంగా అనగదొక్కిన కవులు, కళాకారులకు అసలైన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. దొరల గడీలకు భజన చేసే కళాకారులకు తప్ప అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభించలేదని అన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కేవలం తనకు వంత పాడలేదన్న ఉద్దేశంతో కెసిఆర్ దూరం పెట్టిన వారందరిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారి అభిప్రాయాలు ఎలా ఉన్నా సరే ఉద్యమంలో వారు చేసిన పనిని గుర్తించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ స్థాపించి నాటి అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు నిస్తూ ప్రోత్సహించే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరిట అవార్డు ఇవ్వడంతో తన బాధ్యతను పెంచిందని, ఈరోజు నుంచి మరింత జాగ్రత్తతో తన విధులు నిర్వర్తిస్తానని ఆయన అన్నారు. బీసీ కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ పురస్కార గ్రహీత రంగు బాలలక్ష్మి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పుట్టిన గడ్డ నుంచి తాను రావడం, ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడడం..., సాధించిన రాష్ట్రంలో వివక్షతను ఎదుర్కొంటూ దశాబ్ద కాలం తర్వాత ఇటువంటి సన్మానాన్ని అందుకోవడం సంతోషకరమని అన్నారు. పైడి జయరాజు పురస్కార అవార్డు గ్రహీత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ దాదాసాహెబ్ అవార్డు పొందిన పైడి జయరాజును తెలుగు చలనచిత్ర రంగం పరిశ్రమ అనేక దశాబ్దాలుగా విస్మరించిందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన సేవలు గుర్తించలేదని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అలా మరుగున పడిపోయిన వారికి గుర్తింపు లభిస్తోందని అన్నారు.గద్దర్ అవార్డు గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ కోసం నిరంతరం కొట్లాడిన పోట్లాడిన గద్దర్ అన్న స్మారక అవార్డు తనకు లభించడం తనకెంతో చిరస్మరణీయమని తెలిపారు.

# సీఎం రమేష్ టార్గెట్ ఎందుకు..

హైదరాబాద్, జూలై 28,

సీఎం రమేశ్.. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి ఎంపీ.. 2024లో బీజేపీ తరఫున పోటీ చేసి భారీ మెజారిటీతో గెలిచారు. అంతకు ముందు టీడీపీలో ఉన్నారు. ఇక సీఎం రమేశ్ మొదటి నుంచి ఏ1 కాంట్రాక్టర్. అనేక కంపెనీలు ఉన్నాయి. తాజాగా అనకాపల్లి ఎంపీకి.. సిరిసిల్ల ఎమ్మెల్యే.. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి తనయుడు.. మాజీ ముఖ్యమైన మంత్రి కేటీఆర్‌కు మధ్య వివాదం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఒక రోడ్ కాంట్రాక్ట్‌ను రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ దక్కించుకున్న విషయాన్ని ఆధారంగా చేసుకుని కేటీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వం, సీఎం రమేష్ మధ్య లింక్ పెట్టి విమర్శలు చేస్తున్నారు.రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్త హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో ఒక రోడ్ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ సంస్థ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు చెందినది. ఈ కాంట్రాక్టు కూడా కాంపిటీటివ్ టెండర్ ప్రక్రియ ద్వారానే రిత్విక్ ప్రాజెక్ట్స్ దక్కించుకుంది. కానీ, తెలంగాణ మాజీ ముఖ్యమైన మంత్రి దీనిని జీర్ణించుకోలేకపోతున్నారు. తెలంగాణ సెంటిమెంటును మళ్లీ రగల్చాలి.. కాబట్టి.. రేవంత్, సీఎం రమేశ్‌కు లింకు పెట్టి విమర్శలు చేస్తున్నారు. దీని ఆధారంగా రచ్చ మొదలు పెట్టారు. ఒక బీజేపీ ఎంపీకి కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఇచ్చిందని పేర్కొంటున్నారు. తద్వారా కాంగ్రెస్, బీజేపీ దోస్తీ అనే మెస్సేజ్‌ను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టడానికి సీఎం రమేశ్ సహకరించారని అనుకుంటున్నారు. ఫలితంగా ఫ్యూచర్ సిటీ కాంట్రాక్టు సీఎం రమేశ్ కంపెనీకి గిఫ్ట్‌గా ఇచ్చారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు.కేటీఆర్ ఆరోపణలకు కనీస లాజిక్ లేకుండా పోయినట్లుగా కనిపిస్తోంది. సీఎం రమేష్ వ్యక్తిగత హోదా లేదా వ్యాపారాలు ఈ వ్యవహారంలో ఎలా సహకరించాయో చెప్పలేకపోవడం ఇందుకు ఒక ఉదాహరణ. గతంలో సీఎం రమేశ్ తన సామాజికవర్గం సహకరిస్తుందని కొన్ని అంశాల్లో కేటీఆర్ సాయం అడిగారని, కానీ ఆయన అహంకారం వల్ల సహకారం అందలేదని ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ప్రభుత్వంపై విమర్శలు చేయాలి కాబట్టి.. మనకు కలిసి వస్తుందని ఏది పడితే అది మాట్లాడితే విమర్శలు తప్పవు. కానీ, తెలివైన కేటీఆర్.. ఇటీవల సహనం కోల్పోయి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ప్రతీ విషయంలో బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు.మొత్తంగా సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న కోపాన్ని.. కేటీఆర్ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌పై చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి విమర్శలు, ఆరోపణలు కేటీఆర్‌కు మంచి చేయకపోగా.. ఆయన ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేయడం ఖాయం.

### మధ్యలో ఎంటరైన బండి

బీజేపీ ఎంపీ సీఎం రమేష్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నడవడం కష్టం. సీఎం రమేష్ చెప్పింది వాస్తవమేనని అన్నారు.కేసీఆర్ తన కొడుక్కి మొదట టికెట్ ఇవ్వలేదు. సిరిసిల్లలో కేటీఆర్‌కు టికెట్ ఇప్పించింది సీఎం రమేష్. ఆయన వల్లే కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడు. కేటీఆర్‌కు ఆయన ఆర్థిక సహాయంకూడా చేశారని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసుకునేది లేదు. బీఆర్ఎస్ అంటే.. బిడ్డా, అల్లుడు, కొడుకు.. అయ్య పార్టీ. ఆ పార్టీ నడిపే స్థితిలో లేరు. పూర్తిగా అవినీతిలో కూరుకుపోయి.. పార్టీని నడపడం వారికి చేతకావడం లేదని బండి సంజయ్ అన్నారు.సీఎం రమేష్ సవాల్ కు కేటీఆర్ సిద్ధమా.. లేదా అనేది చెప్పాలి. ఆయనతో కేటీఆర్ చర్చకు వస్తారా.. నేను మధ్యవర్తిగా ఉంటా. కరీంనగర్ లోనే వేదిక ఏర్పాటు చేస్తా. సీఎం రమేష్ ను తీసుకొస్తా. నువ్వు వస్తావా కేటీఆర్..? తేదీ నువ్వే చెప్పు.. మేము రెడీ. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేస్తామన్నది వాస్తవం కాదా..? అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు.సీఎం రమేష్ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డికి సంబంధం లేదు. కేటీఆర్ బాష సరిగా లేదు. సంస్కారంలేని సంస్కారహీనుడు అతను. ముఖ్యమంత్రిని హౌలే, వాడు, వీడు అనడం కరెక్ట్ కాదు. పోలీసులను పోలీసోడు అనడం కరెక్ట్ కాదు. కేటీఆర్ నీ బాష మార్చుకో. నేను హోం మినిస్టర్‌ను ఇలా చెప్పొద్దు.. కానీ, చెప్పాల్సి వస్తుంది.. నీ బాష తీరు మార్చుకోకపోతే దాడులు చేస్తాం అంటూ బండి సంజయ్ హెచ్చరించారు. వంద యూట్యూబ్ ఛానెళ్లు పెట్టుకొని హద్దులు మీరుతావా.. చూస్తూ ఊరుకోం అని బండి సంజయ్ అన్నారు.

======================

# మందకృష్ణ మాదిగ నిర్వహించే వికలాంగుల చేయూత పెన్షన్ దారుల మహాగర్జన ను విజయవంతం చేయాలి..

## భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్..



సూర్యాపేట జిల్లా బ్యూరో(భారత శక్తి) జులై 28:హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు అధ్యక్షతన నిర్వహించిన,హుజూర్ నగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరోలా ప్రవర్తిస్తూ, తెలంగాణ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే,అధికారంలోకి వచ్చిన నెల నుంచే చేయూత పింఛన్లను అన్నింటిని పెంచుతామని వికలాంగులకు అయితే ఆర్టీసీ లోను ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టాన్ని సమతవంతంగా అమలు చేస్తామని, రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేసి ప్రత్యేక శాఖగా కొనసాగిస్తామని, చెప్పిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పాలన పూర్తయిన నేటికీ వృద్ధులకు, వితంతులకు, గీత కార్మికులకు,బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు పెంచుతానన్న పింఛన్లు పెంచకుండా పింఛన్దారుల పట్ల ప్రదర్శిస్తున్న వివక్షను వెంటనే విడనాడి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా చేయూత పెన్షన్లను అన్నింటినీ పెంచాలని, ముఖ్యంగా వికలాంగులకు రూ 6000, తీవ్రవైకల్యం కలిగిన వికలాంగులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిరిగానే 15000 రూపాయల పింఛన్లు ఇవ్వాలని దాదాపు వికలాంగులకు సంబంధించి ప్రధానమైన 25 డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలనే అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13 న హైదరాబాద్ కేంద్రంగా జరిగే వికలాంగుల చేయూత పెన్షన్దారుల మహా గర్జన సదస్సును విజయవంతం చేసే క్రమంలో భాగంగా,హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఆగస్టు 1న, సూర్యాపేట జిల్లా చేయూత పెన్షన్ దారుల సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు,ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ అవార్డు గ్రహీతమందకృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నందున,జిల్లాలో ఉన్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, గీతా కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు మరియు ఇతర సామాజిక పింఛన్దారులు భారీ సంఖ్యలో హుజూర్ నగర్ తరలిరావాలని తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ గద్దం ఖాసిం, వికలాంగుల హక్కుల పోరాట సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చింత సతీష్, హుజూర్ నగర్ నియోజకవర్గ నాయకులు ఇందిరాల పిచ్చయ్య, లక్ష్మణరావు,సంఘం మహిళా నాయకురాలు రూపా రాణి పుల్లయ్య, సంఘం సీనియర్ నాయకులు కాలం శ్రీనివాసులు,భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానించిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్



ములుగు జిల్లా ప్రతినిధి, జులై 28 (భారత శక్తి ) : ఇటీవల నూతనంగా ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన రేగ కళ్యాణి ని సోమవారం ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అధ్యక్షతన అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మార్కెట్ చైర్మన్ రేగ కళ్యాణికి పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం కళ్యాణి తో బాదం ప్రవీణ్ మార్కెట్ కి సంబందించిన అంశాలపై చర్చించారు.

తదనంతరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పేద సారంగం కు మార్కెట్ సెక్రటరీ సోనియా ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు పేట పిఎసిఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదర రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఉపాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, జిల్లాలోని రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వైయస్సార్ కడప జిల్లా, జులై 28(భారత శక్తి):ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..

కడప అక్కాయ పల్లికి చెందిన కొండ శెట్టి చంద్రశేఖర్ తాను పక్షవాతంతో బాధపడుతున్నారని ప్రభుత్వం మంజూరు చేసే వికలాంగుల కోటాలో పెన్షన్ మంజూరు చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు అర్జీని సమర్పించారు.వేముల మండలం రాచకుంటపల్లి గ్రామానికి చెందిన ఉదయగిరి మస్తాన్ మా ఊరు నందు 2.92 సెంట్లు భూమి ఉందని అందులో 1.52 భూమి తమది కాదని రెవిన్యూ సిబ్బంది తెలిపారని మా భూమికి సంబంధించిన పట్టా, ఆన్లైన్ డాక్యుమెంట్స్ తమ వద్ద ఉన్నాయని దీనిపై విచారణ జరిపించి మా భూమిని మాకు ఇప్పించాలని కోరుతూ అర్జీని సమర్పించారు.పోరుమామిళ్ల మండలం అక్కల్ రెడ్డి పల్లి గ్రామానికి చెందిన విజయమ్మ తమ పిల్లలకు తల్లికి వందనం పథకం కింద సగం నగదు మాత్రమే జమైందని పూర్తిగా నగదు జమ అయ్యేలా చూడాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకటపతి,సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి జెడ్పి సీఈవో రాములమ్మ డ్వామా పిడి ఆది శేషారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బారాలను విరమించుకోకపోతే, వైసిపికి పట్టిన గతే టీడీపీ కి పడుతుంది.టిడిపి కూటమి ప్రజా పునాది క్షేత్రస్థాయిలో బద్దలవుతోంది.

**రాజకీయాల్లో సామాజిక చైతన్యం పెంపొందించాలి.**

**స్మార్ట్ మీటర్ల పేరుతో ఆర్థిక దోపిడీకి మోడీ 3 లక్షల కోట్లు ఆదానికి లబ్ధి చేకూరుస్తున్నారు.దేశ రాజకీయాలను బలంగా ప్రభావితం చేస్తున్న 3వ ప్రజాబలం ఉన్న సిపిఎం.అణగారిన వర్గాల హక్కుల పట్ల దృఢమైన నిబద్ధత లేని టిడిపి పాలన.**

**సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్.**



కడప (భారత శక్తి) జూలై 28: సోమవారం ఉదయం 10 గంటలకు, బద్వేలు స్థానిక పెన్షన్స్ అసోసియేషన్ మీటింగ్ హాల్ నందు, విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రజా ఐక్య వేదిక అధ్యక్షులు కే.నాగేంద్రబాబు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... నరేంద్ర మోడీ ఆదాని కిట్ ప్రోకో అవినీతి ఒప్పందాల కారణంగా దేశవ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల పేరుతో యూనిట్ కరెంటు 2 రూపాయల 10 పైసలు నుండి 7 రూపాయలకు పెంచి ఆదానికి మూడు లక్షల కోట్ల రూపాయలు లాభం చేకూర్చుతున్నారని తెలిపారు. ప్రజలపై భారాలను వేసి ఆర్థిక నిలువు దోపిడీ చేయబోతున్నారని ఆరోపించారు. ఈ భారాలను దేశంలోని పేద ప్రజలైన 30 కోట్ల మందికి పైగా ఉన్నవారు కట్టలేరన్నారు. 1998లో టిడిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రైవేటీకరణ ప్రారంభించిందని, తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం, వైయస్సార్ ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణ కొనసాగించిందని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వం 5 సంవత్సరాలలో 32 వేల కోట్లు ప్రజలపై విద్యుత్తు భారాలు వేస్తే, నేడు టిడిపి ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏడాదికి 72 వేల కోట్లు విద్యుత్ భారాలు రాష్ట్ర ప్రజలపై వేస్తున్నారని, 2 కోట్ల స్మార్ట్ మీటర్లు రాష్ట్రంలో బిగించబోతున్నారని వారు తెలిపారు. విద్యుత్ భా రాలను విరమించుకోకపోతే వైసీపీకి పట్టిన గతే టిడిపికి, ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఏడాది పాలనలోనే టిడిపి కూటమి ప్రజా పునాది క్షేత్రస్థాయిలో బద్దలవుతోందని తెలిపారు. రాజకీయాల్లో సామాజిక చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ రాజకీయాలను బలంగా ప్రభావితం చేస్తున 3వ ప్రజా బలం ఉన్న పార్టీ సిపిఎం అని గుర్తు చేశారు. అణగారిన వర్గాల హక్కుల పట్ల దృఢమైన నిబద్ధతలేని టిడిపి పాలన ప్రజా వ్యతిరేకతను ఎదురుకోక తప్పదు అన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు, బీసీ సంఘం మాజీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బద్వేలు గురుమూర్తి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసుల రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పిచ్చయ్య, రామ సుబ్బారెడ్డి, గంగయ్య, సిమాన్స్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణ, బెస్త సంఘం నాయకులు బోల నారాయణ, మాల మహానాడు నాయకులు మీసాల రవి, ఇన్సాఫ్ నాయకులు ఇస్మాయిల్, మెడికల్ అసోసియేషన్ నాయకులు శివ, జర్నలిస్టు యూనియన్ నాయకులు వెంకటేశు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.వెంకటేశు, కౌవర వృత్తిదారుల సంఘం సంఘం నాయకుడు సుబ్బరాయుడు, వడ్డెర ఉత్తిదారుల సంఘం నాయకులు గంప సుబ్బరాయుడు, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాన్ బాషా, బద్వేల్ పట్టణ నాయకులు అన్వర్ భాష, వికలాంగుల సంఘం నాయకులు వెంకటపతి మూరా ప్రసాద్ వెంకటేశ్వర్లు, విద్యుత్తు కార్మిక సంఘం నాయకులు నరసింహులు, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, చెన్నయ్య,రాయప్ప, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు మోక్షమ్మ, మస్తాన్ బి, దుర్గమ్మ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

# టీజేఏ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి హాజరైన సూర్యాపేట జిల్లా కమిటీ

## సూర్యాపేట జిల్లాలో టీజేఏను మండలాల వారీగా విస్తరించాలి






సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 28:తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్ నందు నిర్వహించిన టీజేఏ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ రాష్ట్ర సమావేశానికి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఆధ్వర్యంలో టి జే ఏ సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం పాల్గొనడం జరిగింది. టీజేఏ యూనియన్ సూర్యాపేట జిల్లాలో బలంగా పనిచేస్తుందని హుజూర్ నగర్, కోదాడ, సూర్యాపేట,తుంగతుర్తి,నియోజకవర్గాలలో కమిటీలను వేయాలని టీజేఏ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్ టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు ఖమ్మం జిల్లా నూతన కమిటీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు వాసుదేవ రావు ,సూర్యాపేట జిల్లా తరపున కొత్తపల్లిమధు, కొల్లోజు నాగేంద్ర చారి, భీమపంగు వెంకటేశ్వర్లు, గోరంట్ల శ్రీనివాస్, కొమ్ము మహేష్, పెందుర్తి సతీష్, బయ్యారపు రవీంద్ర, షేక్ నాగుల్ మీరా, మక్బూల్ పాషా, తదితరులు పాల్గొన్నారు

# బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేస్తానన్న కవిత మాటలకు కెటిఆర్ సమాధానం చెప్పాలి

## ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్ జూలై 28

బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేస్తానన్న కవిత మాటలకు కెటిఆర్ ఎందుకు సమాధానం చెప్పాలని ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. ఎంఎల్సి కవితను జైలు నుంచి బయటకు తీసుకరావడానికి బిజెపి వాళ్ల కాళ్లను కెటిఆర్ పట్టుకున్నారని రాజేందర్ రెడ్డి ఆరోపణలు చేశారు. సొంత చెల్లి కవిత విభేదించడం కన్నా పెద్ద సాక్ష్యాలు కావాలా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్కు నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఎవరు అభివృద్ధి చేశారో ప్రజల సమక్షంలో తేల్చుకుందామని కెటిఆర్ కు ఓపెన్ ఛాలెంజ్ చేశారు. తాను చెప్పింది తప్పయితే ముక్కు నేలకు రాస్తానని, లేదంటే రాజకీయాల నుంచి కెటిఆర్ తప్పుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ను పదేళ్ల చేసిన అభివృద్ధి కంటే 18 నెలల్లో తాము ఎక్కువగా అభివృద్ధి చేశామని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆది వరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి క్షేత్రంలో ఘనంగా శ్రీగోదాదేవి అమ్మవారి పుట్టినరోజు సంబరాలు..





సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి )జూలై 28:శ్రీ ఆదివారహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి వారి దివ్యక్షేత్రంలో శ్రీగోదాదేవి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా సోమవారం సుప్రభాత సేవ 9 గంటలకు అమ్మవారికి నవ కలశ అభిషేకము,తులసిపూజ,పుష్పాలంకరణ తదుపరి కుంకుమార్చన,ఆరగింపు, మంగళాశాసనము,పల్లకి సేవ తదుపరి తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమములు నిర్వహించడం జరిగినవి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య. ధర్మకర్తలు తిపిరిశెట్టి హరీష్ కుమార్,కోల కృష్ణ ప్రసాద్,గంధం అంజయ్య,వేముల నరసింహారావు, పెనుబేల్లి హనుమంతరావు,మేరిగా కవిత,ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, ఆలయ అర్చకులు ముడుంబై హరీష్ కుమారా చార్యులు, వి శ్రీనివానచార్యులు. కుమ్మరి కుంట్ల వెంకటనారాయణ. కొత్త ప్రవీణ్ కుమార్ గుప్తా,యరగాని గోపాలం,యరగాని గురవయ్య,దొంగరి సత్యనారాయణ. మాడుగుల లింగయ్య, గోవింద్, వెంకటేశ్వరరావు,శ్రవణ్ కుమార్, అచ్చాలు,బ్రహ్మం, అనసూర్యమ్మ. ఉషారాణి, ప్రవళిక, ప్రియాంక, విజయలక్ష్మి, నాగలక్ష్మి, అరుణమ్మ, సావిత్రమ్మ,మరియు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# వినియోగదారుల మన్ననలు పొందాలి

## మాజీ మంత్రి జి, జగదీశ్ రెడ్డి..



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి )జులై 28:వ్యాపారంలో రాణించాలంటే వినియోగదారుల మన్ననలు పొందాలని మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు జి,జగదీశ్ రెడ్డి అన్నారు. సోమవారం తాళ్లగడ్డ ఫైర్ అగ్నిమాపక స్టేషన్ ఎదురుగా బిఆర్ఎస్ పదో వార్డ్ ఇన్చార్జి కనుకు రేణుక ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ లక్ష్మీనరసింహ పెయింటింగ్ దుకాణమును ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నిర్వాహకురాలు కనుకు రేణుక మాట్లాడుతూ తమ వద్ద అన్ని రకాల పెయింటింగ్స్ ఎమ్మార్పీ రేట్లపై 20% డిస్కౌంట్ తో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గృహాలు, వ్యాపార, వివిధ వాణిజ్య సంస్థలకు కావలసినవారు పెయింటింగ్స్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, మాజీ జడ్పీటిసి జీడి భిక్షం, బిఆర్ఎస్ నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, నాయకులు బూర బాల సైదులు గౌడ్, కక్కిరేణి నాగయ్య, ముదిరెడ్డి అనీల్ రెడ్డి, రాంబాబు, అనిల్, సతీష్, రాజు, నాని, కోటేష్ రాజు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి





సూర్యాపేట జిల్లా బ్యూరో(భారతశక్తి) జూలై 28:హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెంకు చెందిన గ్రామ సీనియర్ నాయకులు మేకల పానకాలు అకాల మరణం చెందడం వలన వారి కుటుంబాన్ని హుజూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే,బీజేపీ రాష్ట్ర నాయకులు శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు. తదనంతరం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నేరేడుచెర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన గ్రామ సీనియర్ నాయకులు మంత్రి సైదులు,మల్లిరెడ్డి నారాయణ రెడ్డి లను పరామర్శించడం జరిగినది.నేరేడుచెర్ల పట్టణంలో బీజేపీ మండల నాయకులు హిందూజా యొక్క నూతనంగా ఏర్పాటు చేసిన పశువుల దాణా షాప్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ జిల్లా నాయకులు చింతకుంట్ల సోమిరెడ్డి, ఆకులజగతయ్య, మండల,పట్టణ అధ్యక్షులు నాగిరెడ్డి, వెంకటశివ,రాజేష్, నాగయ్య , నాయకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలకి అవగాహన కల్పించాలి.



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి )జూలై 28:సీజనల్ వ్యాధులపై ప్రజలకి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజలనుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాలలో, వార్డులలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేయాలని అన్నారు.ప్రజావాణి అర్జీలకి అధిక ప్రాధాన్యతనివ్వాలని ప్రతి అర్జీకి సంబంధించి ఖచ్చితమైన సమాధానంతో కూడిన కాపీని అర్జీదారునికి పంపాలని తెలిపారు. అలా చేయకపోతే ప్రజలు ఒకే సమస్యకి మరల ధరఖాస్తు చేయటం జరుగుతుందని తెలిపారు.ప్రజావాణి లో భూ సమస్యలకి సంబంధించి 107 ధరఖాస్తులు, పంచాయతీ రాజ్ శాఖకి 11దరఖాస్తులు,మున్సిపల్ కమిషనర్లకి 9 ధరఖాస్తులు,ఇతర శాఖలకి సంబంధించి 19 దరఖాస్తులు వచ్చాయని ప్రజావాణి లో మొత్తం 146 ధరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించుటకి సంబంధిత అధికారులకి పంపించటం జరిగిందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమం లో డి ఆర్ డి ఎ పిడి వివి అప్పారావు,డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, డి ఈ ఓ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డి సి ఓ పద్మ, డి ఎస్ ఓ మోహన్ బాబు,సంక్షేమ అధికారులు దయానంద రాణి, శ్రీనివాస నాయక్, శంకర్,జగదీశ్వర రెడ్డి, కలెక్టరేట్ ఏ ఓ సుదర్శన్ రెడ్డి, సూపర్డెంట్లు సాయి గౌడ్,సంతోష్ కిరణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తొలి దశ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేట జిల్లా బ్యూరో( భారత శక్తి) జూలై 28:1969 తొలిదశ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి నీ 1969 ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు చక్రహరి రామరాజు ఆధ్వర్యంలో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు చక్రహరి రామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మీ సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరిస్తారని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వీరి వెంట సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, యాస ముత్తారెడ్డి,నరేంద్రుని విద్యాసాగర్ రావు,బంధు రుద్రమ్మ, ధరావత్ కిషన్ నాయక్, జగిని దయానంద్, కొత్తూరు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# ఫ్రెండ్లీ పోలీసా..? పీక్కుదినే పోలీసా..?

**( భక్షక భటులుగా మారుతున్న రక్షక భటులు.. )**

- ఏ కొందరో నిజాయితీగా ఉంటే సరిపోదు..
- వ్యవస్థ మొత్తానికి అపవాదు అంటుకుంటుంది..
- పోలీసంటే ధైర్యం కలగాలి.. భయం కాదు..
- ఒక్క చుక్క నిమ్మరసం కుండెడు పాలను విరగ్గొడుతుంది..
- ఫ్రెండ్లీ పోలీస్ అంటూ ఊదరగొట్టడం తప్ప ఒరిగింది ఏమీలేదు..
- కొందరు పోలీసులు రాజకీయ నాయకుల తొత్తులుగా మారిపోయారు..
- సమాజానికి రక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన వారు..
- మంత్రులు, కొందరు ఎమ్మెల్యేల ఇండ్లల్లో పనివాళ్లుగా పనిచేస్తున్నారు..
- పైగా డిపార్ట్మెంట్ లో పేరుకుపోయిన అంతులేని అవినీతి..
- ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ పరిశోధనలో

## వెల్లడైన భయంకర వాస్తవాలు..

ఈ సమాజానికి రక్షణ కవచంగా ఉండేలా పోలీసు వ్యవస్థను రూపొందించారు.. కఠినమైన శిక్షణతో వారు రాటుదేలిపోతారు.. సొసైటీలో పేరుకుపోయిన నేర ప్రవృత్తిని తుత్తునియలు చేసే విధంగా వారు తయారు చేయబడ్డారు.. ఖాకీ దుస్తులు ధరించి ధైర్యంగా, నిబద్ధతగా పనిచేయాల్సిన పోలీసులు వారి రూటు మార్చుకుని సమాజానికి కంటకంగా మారిపోవడం ఆందోళన కలిగించే విషయం.. కాగా పోలీసు వ్యవస్థ ప్రజలకు అనుకూలంగా పనిచేయాల్సి ఉంటుంది.. కానీ అధికారానికి గులాం చేస్తోంది..



రాజకీయ నాయకుల అడుగులకు మడుగులు వత్తుతోంది.. ఏదైనా సమస్యతో తమ వద్దకు వచ్చే వారికి ధైర్యం చెప్పాల్సింది పోయి, వారిపై దౌర్జన్యకాండకు దిగుతున్నారు పోలీసులు.. వారిని బెదిరిస్తున్నారు.. పోలీస్ స్టేషన్ కు వెళ్లాలంటేనే భయపడే దుర్భర పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి.. ఇది వాంఛనీయం కాదు.. ఫ్రెండ్లీ పోలీస్ అంటే ఎలా ఉండాలి..? అన్నది గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. ఈ కథనం పోలీసులందరికీ వర్తించదు.. గ్రహించగలరు..

హైదరాబాద్, ( భారత శక్తి ) జూలై 28:అత్యున్నత వ్యవస్థ పోలీసు వ్యవస్థ.. పోలీస్ అనే పేరు వినగానే సమాజ కంఠకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలి.. సామాన్య ప్రజానీకం పోలీస్ లను తలచుకుంటూ కంటినిండా నిద్రపోగలగాలి.. ధైర్యంగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి తమ సమస్యలు చెప్పుకోగలగాలి.. ఎవరైనా తప్పు చేయాలంటే ఒకటికి పదిసార్లు ఆలోచించాలి.. అకుంఠిత దీక్షతో ట్రైనింగ్ పొందిన పోలీసు వ్యవస్థ ఇప్పుడు భ్రష్టుపట్టి పోయింది.. దీనికి కారణాలు అనేకానేకం.. రాజకీయ వత్తిడి, అక్రమార్జన, స్థానిక పరిస్థితులు ఇలా ఎన్నెన్నో ఉన్నాయి..

నిజానికి పోలీసు వ్యవస్థను రాజకీయ కీచకులే భ్రష్టుపట్టించారన్నది జగమెరిగిన సత్యం.. తాము చెప్పినట్టు వినకపోతే.. తమ చెప్పుచేతల్లో ఉండకపోతే తమకున్న విశేష అధికారాలతో పోలీసులను ముప్పు తిప్పలు పెడుతున్నారు.. శంకర గిరి మాన్యాలకు బదిలీ చేస్తున్నారు.. ఈ ప్రక్రియ మారాలి.. సమాజం కోసం పనిచేసే పోలీసులు ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థగా నిలబడినప్పుడే.. మంచి సాధ్యం అవుతుంది.. కానీ ఇది జరగాలంటే సాధ్యమయ్యే పనేనా..? అన్న ప్రశ్నకు సమాధానం దొరకదు..

ఫ్రెండ్లీ పోలీస్ ఎక్కడ..?

ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు ఫ్రెండ్లీ పోలీస్ అంటూ ఊదర గొడుతున్నారు.. కానీ వాస్తవంలోకి వస్తే దీనికి భిన్నంగా పరిస్థితులు గోచరిస్తున్నాయి.. ఫ్రెండ్లీ మాట అటుంచితే.. సాధారణంగా తమ విధులను కూడా మరచిపోతున్నారు.. తాము శిక్షణ తీసుకుంటున్న సమయంలోనూ.. అధికార బాధ్యతలు తీసుకుంటున్నప్పుడు కూడా రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు.. సమాజాన్ని, ప్రజలను కాపాడతామని వారికి రక్షణ కవచంగా నిలుస్తామని ఒక బాధ్యత తీసుకుంటారు.. కానీ వాస్తవంలోకి వచ్చే సరికి పరిస్థితులు మారిపోతున్నాయి.. తమ విధుల్లో ఎదురయ్యే పలు రకాల వ్యవహారాలు వారిని ప్రభావితం చేస్తున్నాయి.. పాలించే నాయకులే అవినీతిలో మునిగి తేలుతున్నప్పుడు మాకేమిటి అన్న అభిప్రాయం అందరిలో చోటుచేసుకుంటోంది.. వాస్తవానికి తాము నిర్వర్తించాల్సిన బాధ్యతల కంటే ఇతర వ్యవహారాల మీద ఎక్కువగా దృష్టి పెడుతున్నారు పోలీసులు.. తమకు సంబంధం లేని విషయాల్లో కూడా తలదూరుస్తున్నారు.. బల ప్రయోగానికి దిగుతున్నారు.. దీంతో సామాన్యులు పోలీస్ అంటేనే భయపడుతున్నారు.. డబ్బున్న వారు, పేరున్నవారు, రాజకీయ పలుకుబడి వున్న వాళ్ళు పోలీసు వ్యవస్థను తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు.. అమాయకులను నరకయాతన పెడుతున్నారు..

తీసుకునే జీతం ప్రజల సొమ్ముతో, ఊడిగం చేసేది రాజకీయ నాయకుల ఇళ్లల్లో :

కొంతమంది పోలీసులు ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటూ.. అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల ఇళ్లల్లో పనివాళ్లుగా, వారి అడుగులకు మడుగులు వత్తుతూ.. వారికి తొత్తులుగా మారిపోతున్నారు.. ఈ పరిస్థితులు ఎందుకు నెలకొన్నాయి.. కొందరు పోలీసులు కావాలని ఇలా మారడం లేదు.. పరిస్థితులు వారిని ఆ విధంగా మారుస్తున్నాయి.. ఇది ఎంతమాత్రం వాంఛనీయం కాదు.. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి.. అప్పుడే సమ సమాజం నిర్మితం అవుతుంది..

ఈ మార్పుకోసం ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ పోరాటం సాగిస్తోంది.. మీరు కూడా మాతో చేతులు కలపండి జైహింద్..

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి సత్వర పరిస్కారం

**... జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**



సంగారెడ్డి( భారత శక్తి ప్రతినిధి)జూలై 28: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికివచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు ,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , డి ఆర్ ఓ పద్మజరాణి లకు ఫిర్యాదులను సమర్పించారు. కాగా రెవిన్యూ -15, పౌరసరఫరాలశాఖ 09, పంచాయత్ రాజ్ 09,డి ఆర్ డి ఓ 09, వివిధ శాఖలకు సంబంధించి 12, మొత్తంగా 54 ఫిర్యాదులు అందాయి. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పద్మజరాణి , జడ్పిసిఈఓ జానకిరెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

**విచారణకు హాజరయిన కాంగ్రెస్ నేత జెలా నర్సింహారెడ్డి**

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజురోజుకు మరింత మంది బాధితులు బయట పడుతున్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలతో పాటు వారికి సన్నిహితంగా ఉన్న నేతల ఫోన్లు టాప్ చేసినట్లు సిట్ అధికారుల విచారణలో తేలింది. మాజీ మంత్రి కే. జానారెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు అత్యంత కీలకమైన వ్యక్తులుగా పేరు పొందిన నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి, పీ సీ సీ కార్యవర్గ సభ్యుడు జేలా నర్సింహా రెడ్డి ఫోన్ ట్యాప్ చేసినట్లు గుర్తించిన సిట్ అధికారులు ఆయనను మంగళవారం జూబ్లీహిల్స్ లోని సిట్ కార్యాలయానికి పిలిపించారు. ఎప్పుడెప్పుడు ఆయన ఫోన్లు టాప్ అయ్యాయి, దానివల్ల ఆయన ఎదుర్కొన్న ఇబ్బందుల్ని గురించి వాంగ్మూలం సేకరించారు. ఈ సందర్భంగా జేలా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో ఓడించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం అనేక తప్పుడు పనులు చేసిందని.. ఫోన్ ట్యాపింగ్ ద్వారా తమలాంటి వారిని వెంటాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి..

ములుగు జిల్లా ప్రతినిధి, జులై 28 (భారత శక్తి) :భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి ఎఫ్‌సిడిఏ కమిషనర్ కె. శశంకా సూచించారు.సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి ఎఫ్‌సిడిఏ కమిషనర్ కె. శశంక ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఐ టి డి ఏ, ఏటూరు నాగారం సమావేశ మందిరంలో ఐ టి డి ఏ పి ఓ చిత్ర మిశ్రా, ఎస్పీ శబరిష్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలసి అధికారులతో భారీ వర్షాలు, వరదల పై సంసిద్ధత సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఎఫ్‌సిడిఏ కమిషనర్ కె. శశంకా మాట్లాడుతూ భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద వల్ల ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ముఖ్యంగా జిల్లాలో గోదావరి, జంపన్న వాగు ప్రవాహ ప్రాంతాలు ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ ఆస్కారం ఉన్నందున, ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. గోదావరి, జంపన్న వాగు, రామప్ప, లక్నవరం పరీవాహక ప్రాంతాలతో పాటు కాలువలు, చెరువులు, ఇతర జలాశయాలలో చేపలు పట్టడానికి ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహా, ఆయా శాఖలు సన్నద్ధమై ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. వరద జలాలు ప్రవహించే ప్రాంతాల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించకుండా నిషేధం విధించాలన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాలో జలదిగ్బంధం, చిక్కుకున్న ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు గుర్తించి, అలాంటి ప్రదేశాలకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ వెళ్లకుండా కట్టడి చేయాలని సూచించారు. స్థానిక పరిస్థితుల గురించి జిల్లా యంత్రాంగం ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, భారీ వర్షాల వల్ల వరద పరిస్థితి నెలకొంటే సమర్థవంతంగా ఎదుర్కోవాలని హితవు పలికారు. లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, చెరువుల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.ఎక్కడ కూడా చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా పరిస్థితులను పర్యవేక్షించాలని అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఔషధ నిల్వలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కడ కూడా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు, అతిసారం వంటివి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొనిఅధికారులు అవసరమైన అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు లో లైన్ గ్రామాల వద్ద ప్రమాద హెచ్చరికలు తెలిసేలా లెవెల్కు తగ్గట్టు అలారం మ్రోగేలా ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన గ్రామాలలో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు . ప్రమాదానికి లోనయ్యే ట్యాంకులు 100% ముందుగానే గుర్తించాలని పేర్కొన్నారు . గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసే చేయాలని , శానిటేషన్ మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని అన్నారు.ఐ టి డి ఏ పి ఓ చిత్ర మిశ్రా మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్, ఐ టి డి ఏ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని తెలిపారు.భారీ వర్షాల పరిస్థితి గురించి వాతావరణ శాఖ అందిస్తున్న సూచనలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్థానికులను తరలించేలా పునరావాస కేంద్రాలనుకూడా గుర్తించి తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ లు, చెరువులలో వచ్చి చేరుతున్న వరద జలాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేస్తున్నామని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేలా ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు. జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందన్నారు.అంతకముందు దొడ్ల, కొండాయి బ్రిడ్జిని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి ఎఫ్‌సిడిఏ కమిషనర్ కె. శశంకా పరిశీలించారు.అనంతరం రామన్న గూడెం లో గోదావరి నది వరద ఉధృతిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఏపీఓ వసంత రావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇళ్ల పథకం - భూమిపూజ కార్యక్రమం



ఖమ్మం (భారత శక్తిప్రతినిధి ), జూలై 28:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా, సూర తండాలో లబ్ధిదారురాలు గుగులోత్ పార్వతి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, గ్రామ శాఖ అధ్యక్షులు తోటపల్లి స్వామి తదితర పార్టీ నాయకులు పాల్గొని భూమిపూజ నిర్వహించారు. పైడిపల్లి కిషోర్ కుమార్ లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గాలి దుర్గారావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం తెలంగాణలోని నిరుపేదల సొంత ఇంటి కలను సాకారం చేస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని తెలిపారు. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు, స్థలం లేని నిరుపేదలకు స్థలంతో పాటు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం శరవేగంగా ప్రారంభించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి గుగులోతు వేణు, శివాలయం ఆలయ కమిటీ చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు భూక్యా బద్రునాయక్, మండల యూత్ అధ్యక్షులు కుమార్, బోనకల్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు మరీదు శ్రీనివాసరావు, చిరునోముల గ్రామ శాఖ అధ్యక్షులు నరసయ్య శాస్త్రి, చిరునోముల మాజీ సర్పంచ్ రవి, సేవాదళ్ మండల అధ్యక్షులు సురేష్, వెంకటేశ్వర్లు, బిపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



ఖమ్మం (భారత శక్తి ప్రతినిధి ), జూలై 28:మండల పరిధిలోని పెద్దబీరవల్లి గ్రామానికీ చెందిన చట్టు మాధవి అనారోగ్య సమస్యతో బాధపడుతూ ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స తీసుకున్న తర్వాత సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో మంజూరైన 60వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిట్టల నాగేశ్వరరావు,ఉసికల రమేష్,గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉసికల సురేష్,గ్రామ కాంగ్రెస్ పార్టీ పిట్టల దుర్గారావు,డేగల వేలాద్రి,యూత్ కాంగ్రెస్ నాయకులు జేవి రత్నం స్వయంగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందజేశారు.సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని,మేలు చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ప్రజా ప్రభుత్వాన్ని మర్చిపోరాదని లబ్ధిదారులకు వారు సూచించారు.

# పాఠశాల పరిసరాల పరిశుభ్రత బాధ్యత ఉపాధ్యాయులదే.





ఖమ్మం (భారత శక్తిప్రతినిధి )జూలై 28:చదువు తోనే సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు బాధ్యతతో చర్యలు తీసుకోవాలని,జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.సోమవారం సింగరేణి మండలం కారేపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ స్కూల్ పరిసరాలు, పిల్లల టాయిలెట్స్, గ్రౌండ్, స్టోర్ రూమ్స్, సైన్స్ ల్యాబ్ పరిశీలించి, పాఠశాల నందు తరగతి గదులు తిరుగుతూ, విద్యా భోదన ప్రకియను పరిశీలించారు.పాఠశాలలో ఆరవ తరగతి, 8వ తరగతి క్లాస్ రూం లోకి వెళ్లి ఉపాధ్యాయులు ఇంగ్లీష్ బోధిస్తున్న తీరును పరిశీలించారు. ముందుగా పాఠశాల తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. రెండు జతల స్కూల్ యూనిఫామ్ లు, పాఠ్య పుస్తకాలు, నోట్స్ బుక్స్ అన్ని అందించారా, విద్య బోధన ఎలా ఉంది, రోజు మంచి మధ్యాహ్న భోజనం పెడుతున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇంగ్గీషు పాఠం చదివించారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విషయావగాహన పరీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు ఇప్పటి నుంచే కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు వారి ఆరోగ్యం, ఎదుగుదల పట్ల కూడా శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందించామని తెలిపారు. విద్యార్థులు తప్పకుండా రోజు యూనిఫామ్ ధరించాలని అన్నారు.పాఠశాలలో చెత్తచెదారం లేకుండా, మన ఇంటిలాగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని అన్నారు. స్కూల్ లో విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా చూడాలని, విద్యార్థుల విద్య పట్ల నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అనంతరం కలెక్టర్, పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనం వంటను, డైనింగ్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీసారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా సింగరేణి మండల తహసీల్దారు రమేశ్, యంపిడివో రాజేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంప్రసాద్, టీచర్లు తదితరులు ఉన్నారు.

# మాదకద్రవ్యాల సమాచారం ఇస్తే పదివేలు బహుమతి : జిల్లా ఎస్పీ శబరిష్






ఏటూరునాగారం/ములుగు జిల్లా( భారతశక్తి ప్రతినిధి)జులై 28: ములుగు జిల్లా ఏటూరు నాగారం డివిజన్ పరిధిలో మాదకద్రవ్యాల సమాచారం అందించిన వారికి పదివేల రూపాయలను బహుమతిగా అందిస్తామని జిల్లా ఎస్పీ శబరిష్ తెలిపారు.సోమవారం ఏటూరు నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో ములుగు జిల్లా ఎస్పీ శబరీష్.పి, ఆదేశానుసారం ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ, సిఐ శ్రీనివాస్ ల సూచనలతో ఏటూరునాగారం ఎస్ హెచ్ ఓ రాజ్ కుమార్ ప్రజల భద్రత, భరోసా కొరకు "అభయ మిత్ర" అనే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం క్రింద మాదకద్రవ్యాల కు వ్యతిరేకంగా యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ శబరీష్.పి. హాజరై మాట్లాడారు. నిషేధిత మాదక ద్రవ్యాల వ్యతిరేక చట్టంపై అవగాహన కల్పిస్తూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి అలవాటు పడి తమ జీవితాన్ని నాశనం చేసుకోకూడదని సూచించారు. గ్రామాలలో అక్రమంగా ఎవరైనా గంజాయి వంటి మత్తు మాదక ద్రవ్యాలను సరఫరా చేసినా, ఉపయోగించిన, విక్రయించినా అటువంటి వారి గురించిన సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. సమాచారం అందించిన వారికి పోలీస్ శాఖ తరపున పది వేల రూపాయలు బహుమతిగా ఇవ్వబడుతుందని అదేవిధంగా సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు. యువతకి ఫోక్సో చట్టంపై యువతి యువకుల కు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ శబరీష్ పేర్కొన్నారు ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారి పై చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని తెలియచేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు బాధ్యతగా హెల్మెట్ ధరించాలని, ప్రజలు తమ గ్రామాల పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాలపై వెంటనే స్పందించి పోలీస్ లకు సమాచారం అందించాలని సూచించారు.అదేవిధంగా ప్రజలు సామాజిక మాధ్యమాలలో కనిపించే లోన్ అప్లికేషన్ ద్వారా లోన్లు తీసుకోవద్దని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా కాల్ చేసి లోన్ ఇస్తామని చెప్తే నమ్మి మోసపోవద్దని, మీ వ్యక్తిగత వివరాలను ఎవరికి చెప్పకుండా తగిన భద్రత పరంగా మీరు ఖాతా కలిగి యున్న బ్యాంకులను సంప్రదించాలని తెలిపారు. ఈ మధ్య కొంత మంది యువకులు క్రికెట్ బెట్టింగ్ బారిన పడి ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని, యువత బెట్టింగ్, జూదం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్ లలో పాల్గొనడం ద్వారా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు చిన్నభిన్నం అవుతాయని, ఎవరు కూడా అటు వంటి వాటి బారిన పడకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఎవరైనా జూదం, బెట్టింగ్ లు నిర్వహించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ప్రజలు సైబర్ క్రైమ్ నేరాల పై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. సైబర్ నేరగాళు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలను మోసం చేసేందుకు ఆస్కారం ఉందని, ప్రజలు సైబర్ క్రైమ్ నేరస్తుల బారిన పడకుండా సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

యువతి యువకులు ముఖ్యంగా తెలియని నెంబర్ ల నుండి వీడియో కాల్స్ వస్తె స్పందించవద్దని సూచనలు చేశారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తద్వారా తాము కోల్పోయిన డబ్బును తిరిగి పొందడానికి ఆస్కారం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ, ఏటూరు నాగారం సిఐ శ్రీనివాస్, ఎస్ హెచ్ ఓ రాజ్ కుమార్, పోలీస్ సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాలలో యాంటీ డ్రగ్ కమిటీలలో పనిచేస్తున్న సభ్యులు, యువత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం లో.. ప్రక్షాళనకు పది కమిటీలు నిర్వహణ లోపాల నివారణే కమిటీల ధ్యేయం

యాదగిరిగుట్ట, జూలై 28

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం పాలన కొత్త పుంతలు తొక్కుతోంది. పాలనలో పారదర్శకత లోపాల నివారణ కోసం ప్రక్షాళనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు ప్రక్షాళన చర్యలు చేపట్టారు. భక్తులకు మెరుగైనతీ సౌకర్యాలు దర్శనాలు కల్పించేందుకు పది కమిటీలను నియమించారు. పాలనాపరంగా నిర్వహణలో అన్ని విభాగాలలో పారదర్శకత పాటించేందుకు లోపాలను నివారించేందుకు అంతర్గతంగా ఆడిటు చేసుకునేందుకు అదేవిధంగా భక్తులు స్థానికుల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూసేందుకు కమిటీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు దేవస్థానంలోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తమ దృష్టికి వచ్చిన లోపాలను సూచనలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి దృష్టికి తీసుకువచ్చే విధంగా ఈ కమిటీలు పరిచారని నిర్ణయించారు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఈ పది కమిటీలకు చైర్మన్గా వ్యవహరిస్తారు దేవస్థానం అధికారులు సిబ్బందిని సభ్యులుగా నియమిస్తూ కమిటీలను ఏర్పాటు చేశారు

పది కమిటీలు ఇవే....

1) దేవాలయం, ప్రసాదాలు, అన్నదానం పర్యవేక్షణ కమిటీ .2) క్రౌడ్ మేనేజ్మెంట్ కమిటీ. 3) సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఓవర్ సైట్ కమిటీ. 4) పారిశుద్ధ్యం, పరిశుభ్రత పర్యవేక్షణ కమిటీ. 5) విద్యుత్ ,సీసీ కెమెరాలు, వైర్లెస్ వ్యవస్థ, బ్యాటరీ వాహనాలు, ఏసీలు, లిఫ్టుల పర్యవేక్షణ కమిటీ. 6) వసతి సౌకర్యాల పర్యవేక్షణ కమిటీ .7) విద్యాసంస్థల పర్యవేక్షణ కమిటీ. 8) రెవెన్యూ యాజమాన్య కమిటీ .9) లీజులు, కిరాయి యాజమాన్య కమిటీ.10) అకౌంట్స్ మేనేజ్మెంట్ కమిటీ.

# జూరాల ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల

హైదరాబాద్ జూలై 28

జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది.దీనితో జూరాల ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు జూరాల జలాశయానికి ఇన్ ఫ్లో1,00,257 వేల క్యూసెక్కులుండగా ఔట్ ఫ్లో 92,556 క్యూసెక్కులుగా ఉంది.. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.816 మీటర్లు ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 317.170 మీటర్లుగా ఉంది. జూరాల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 7.795 టిఎంసిలుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టిఎంసిలుగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి ఐదు కేంద్రాలలో కొనసాగుతోంది.

# తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తివేసి వరదనీటిని క్రిందికి విడుదల


హైదరాబాద్ జూలై 28

తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరుగుతుంది.దీనితో తుంగభద్ర ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తివేసి వరదనీటిని క్రిందికి వదులుతున్నారు. తుంగభద్ర జలాశయానికి ఇన్ ఫ్లో 96, 836 క్యూసెక్కులు ఉండగా ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తి 1,00, 720 క్యూసెక్కులు నీటిని దిగువకు అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలుగా ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 75 టిఎంసిలుగా ఉంది. గేట్ల సమస్య కారణంగా ఈ ఏడాది 80 టిఎంసిలే అధికారులు నిల్వ చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు.

# సిగాచి బాధితులకు నష్టపరిహారం చెల్లించలేదు హరీష్ రావు

సంగారెడ్డి

మాజీ మంత్రి హరీష్ రావు సోమవారం నాడు సిగాచి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం తమని పట్టించుకోవడం లేదని, ఇప్పటి వరకు పరిహారం దిక్కులేదు అని బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు.



తరువాత ఆయన ఇతర బీఆర్ఎస్ నేతలు, బాధితులతో సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కు చేరుకుని అడిషనల్ కలెక్టర్ తో మాట్లాడారు. నష్టపరిహారం కోటి ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదని వివరించారు. డెడ్ బాడీల కోసం కుటుంబాలు కన్నీరు మున్నీరు అవుతున్నాయని చెప్పారు. సిగాచి కంపెనీ బాధితులకు ఇచ్చిన మాట ప్రకారం కోటి పరిహారం ఇవ్వకుంటే టెంట్ వేసి కూర్చొంటాం. వారికి పరిహారం అందేదాక, న్యాయం జరిగేదాక టెంట్ తీయం. బాధితుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# పర్యావరణ ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత

కమాన్ పూర్ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి అన్నారు. సోమవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రామగిరి ఖిల్లా పై విత్తనపు బంతులు వేయడం జరిగిందిపర్యావరణాన్ని,సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుంది అందులో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో రామగిరి ఖిల్లా గుట్ట ప్రాంతంలో దాదాపు 500 విత్తనము బంతులను విసిరివేయడం జరిగింది. విత్తనము బంతుల్లో అల్ల నేరడి, సీతాఫలం,వేప,నిమ్మ వంటి పండ్లు మరియు కూరగాయల విత్తనాలతో కూడిన మట్టితో బంతులు తయారు చేయడం జరిగింది.అనంతరం లయన్స్ క్లబ్ డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,మేకల మారుతి మాట్లాడుతూ శ్రావణ మాసంలో రామగిరి ఖిల్లా వీక్షణకు వచ్చేవారు కూడా విత్తనపు బంతులు వేయాలని కోరుతున్నాము అలా చేయడం వల్ల మూగ జీవాలకు ఆహారం దొరుకుతుంది. విశ్వంలో జీవరాశుల మనుగడకు మూలాధారం అయిన భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాలను ప్రకృతే ఈ విశ్వానికి అందించిందని వారిని విధ్వంసం చేయడం వల్ల మానవాళి పలు విపత్తులకు గురవుతుంది. మానవుడు ఉన్నన్ని రోజులు ప్రకృతి వనరులను ఉపయోగించుకోవాలి తర్వాత తరానికి అందించాలి ప్రకృతి వనరులు తరతరాల వారసత్వ సంపద కాబట్టి వాటిని భావి తరాల కోసం రక్షించాలి. భారతదేశములో ప్రకృతిని దేవతగా ఆరాధించే సంస్కృతి వుందన్న చారిత్రిక సత్యాన్ని మరువకూడదు. విచక్షణ రహితంగా అటవీ సంపదను విధ్వంసం చేయటం వల్ల ప్రకృతి విపత్తులు అకాల వర్షాలు వరదలు వచ్చి అపారమైన ఆస్తినష్టం, ప్రాణ నష్టం సంభవిస్తుంది ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కొరకు మనందరం ఐక్యమై ఉద్యమించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. పర్యావరణ ప్రకృతి పరిరక్షణకు '3ఆర్' పద్ధతిలో తగ్గించడం (రెడ్యూ స్ ) తిరిగి వాడటం (రీయూజ్) పునరుద్ధరణ (రీసైక్లింగ్)వంటి పద్దతులు మనిషి జీవితములో బాగం కావాలి అలాగే అడవుల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలి. ప్రకృతి పర్యావరణ హితకరమైన చర్యలు చేపట్టాలి.ప్రకృతి రక్షణే మానవాళి రక్షణ అన్నది ఒక నినాదం కాకుండా ప్రజల జీవన విధానం కావాలి. భావితరానికి స్వచ్ఛమైన ప్రకృతిని బహుమతిగా ఇద్దాం. ప్రకృతి రక్షణ మనందరి కోసం భావితరాల కోసం మనిషి మనుగడ కోసం. స్వచ్ఛభారత్ నిర్మాణానికి పునరంకితమౌదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మొల్మురి శ్రీనివాస్,సభ్యులు తీగల శ్రీధర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

====================================

# చివరి టెస్టులో గెలవండి.. దేశం కోసం సాధించండి: రిషభ్ పంత్ సందేశం

మాంచెస్టర్ వేదికగా జరిగిన టెస్టులో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ గాయంతోనే క్రీజ్‌లోకి వచ్చి హాఫ్ సెంచరీ సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ అవసరమైతే పంత్ బ్యాటింగ్‌కు వస్తాడని బీసీసీఐ ముందే చెప్పింది. కానీ, ఆ అవసరం రాకుండానే భారత బ్యాటర్లు అద్భుతంగా పోరాడారు. గాయం కారణంగా రిషభ్ పంత్ ఐదో టెస్టుకు దూరమైన క్రమంలో భారతజట్టుకు తన సందేశం ఇచ్చాడు. చివరి టెస్టులో గెలిచి దేశం కోసం అందిద్దామని పిలుపునిచ్చాడు.



“నా జట్టుకు ఒకేఒక్క మెసేజ్ ఇస్తున్నా. గయ్స్ మనం గెలుద్దాం. దేశం కోసం చేద్దాం. వ్యక్తిగత లక్ష్యం గురించి ఆలోచించకుండా జట్టును గెలిపించేందుకు లేదా ముందుకు తీసుకెళ్లేందుకు ఏం చేయాలనేది వ్యక్తిగతంగా చేయాలనుకుంటా. సహచరులంతా ఇలాంటి సమయంలో అండగా నిలవడం బాగుంది. దేశం కోసం ఆడేటప్పుడు జట్టు ఒత్తిడిలో ఉన్నా సరే ప్రతిఒక్కరూ మద్దతు ఇస్తారు. అలాంటి భావోద్వేగాలను వివరించడం చాలా కష్టం. నా దేశం తరఫున ఆడడాన్ని ఎప్పుడూ గర్వంగానే భావిస్తుంటా” అని పంత్ వెల్లడించాడు.

ఈ టెస్టుకు పంతే ఫౌండేషన్: గంభీర్

“నేనెప్పుడూ వ్యక్తిగత ప్రదర్శనల గురించి మాట్లాడను. నాకు అది ఇష్టం ఉండదు. కానీ, మాంచెస్టర్ టెస్టులో మాత్రం రిషభ్ పంత్ హాఫ్ సెంచరీతో చేసిన ఫౌండేషనే కీలకం. ఈసందర్భంగా పంత్‌కు అభినందనలు. కేవలం డ్రెస్సింగ్ రూమ్‌లోనే స్ఫూర్తి నింపలేదు. భావితరాలకూ ఇన్‌స్పిరేషన్. దేశం నీపట్ల ఎప్పుడూ గర్వంగానే ఉంటుంది” అని భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించాడు.

సూపర్ కమ్‌బ్యాక్: సచిన్

“ఓల్డ్ ట్రాఫోర్డ్ టెస్ట్ అత్యంత కీలకమని భారత్‌కు తెలుసు. ఒక దశలో వెనకబడినప్పటికీ పుంజుకున్న తీరు అద్భుతం. కంగ్రాట్స్ టీమ్‌ఇండియా. కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ఆడినవి సూపర్ ఇన్నింగ్స్‌లు. పోరాడేతత్వం ప్రదర్శించిన జట్టుకు అభినందనలు. చివరి టెస్టులోనూ విజయం సాధించాలని కోరుకుంటూ ఆల్‌ది బెస్ట్” అని సచిన్ పోస్టు చేశాడు.



# నేనైతే ఆ 15 ఓవర్లూ ఆడేయమని చెప్పేవాడిని: రవిచంద్రన్ అశ్విన్

జడేజా, సుందర్ సెంచరీలకూ చేరువలో ఉన్న సమయంలో డ్రా కోసం ప్రతిపాదన చేసిన బెన్ స్టోక్స్‌పై రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. ఆ జట్టు వ్యవహరించిన తీరు మరీ దారుణంగా ఉందని వ్యాఖ్యానించాడు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ మాత్రం తమ చేతుల్లో లేదని.. కెప్టెన్ వైపు చూపించడం ఇంగ్లాండ్ శిబిరంలో మరింత అసహనం తెప్పించింది. మ్యాచ్ అనంతరమూ దానిని ప్రదర్శించడం వీడియోల్లో వైరల్‌గా మారింది. దీనిపై అశ్విన్ స్పందిస్తూ.. బంతిని బ్రూక్‌కు ఇవ్వడమనేది బెన్ స్టోక్స్ తప్పిదమని ఆక్షేపించాడు.

“మీరు ఎప్పుడైనా ద్వంద్వ ప్రమాణాలు అనే పదం విన్నారా? ఇదిగో ఇంగ్లాండ్ వ్యవహరించిన తీరునే అంటారు. కరచాలనం చేసి ఫ్రస్ట్రేషన్‌ను వ్యక్తం చేయడం చూశాం. నువ్వు (స్టోక్స్) కూడా సెంచరీ చేయకుండా ఏడుస్తూ వెళ్లిపోతే సరిపోయేది. తొలి సెషన్ నుంచి అతడు (జడేజా) మీ బౌలర్లను ఆడేసుకున్నాడు. ఎవరికైతే బంతిని ఇచ్చావో.. వారి బౌలింగ్‌లో పరుగులు రాబట్టాడు. చివరికి డ్రాగా ముగిసింది. చాలా కష్టపడి ఇద్దరు ఆల్‌రౌండర్లు భారత్‌ను కాపాడారు. ఇలాంటి సమయంలో సెంచరీ చేయొద్దు వెళ్లిపోండి అంటే పద్ధతేనా? బ్రూక్ బౌలింగ్‌లో సెంచరీ చేస్తావా? అని అడుగుతావా. బ్రదర్ స్టోక్స్ అక్కడ బ్రూక్ బౌలింగ్‌లో సెంచరీ కాదు. నువ్వు హార్మిసన్ లేదా ఫ్లింటాఫ్‌ను తీసుకొచ్చినా జడ్డూ మాత్రం నో చెప్పడు. కానీ, నువ్వు హ్యారీ బ్రూక్‌కు బంతినిచ్చావు. అది నీ తప్పు. మాది కాదు కదా..” అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

చివరి బంతి వరకూ ఆడాల్సింది..

“త్వరగా ముగిద్దామని ఇంగ్లాండ్ చెప్పిన కారణాలు వారికి బాగుంటాయేమో. కానీ, ఆ ఫ్రస్ట్రేషన్‌ను ప్రదర్శించాల్సిన అవసరం లేదు. సాధారణంగా ఫలితం తేలదని భావిస్తే ఇరు సారథులు నిర్ణయం తీసుకుంటారు. ఇక్కడ బౌలర్లు అలసిపోయి ఉంటారు అని ఒక కారణం కాగా.. ఫలితం ఎలానూ రాదని ఖరారు కావడం రెండో కారణం. కానీ, ఇక్కడ మాత్రం నేను సంతోషంగా లేను కాబట్టి మీరు కూడా ఉండకూడదని అనుకుంటే ఎలా? అందుకే, నేను కనుక భారత జట్టును నడిపించే సారథిని అయి ఉంటే చివరి గంటలోనూ మిగిలిన 15 ఓవర్లూ ఆడేయమని మావాళ్లకు చెప్పేవాడిని. బ్రూక్ లేదా మరెవరైనా సరే బౌలింగ్ వేయచ్చు. సెంచరీలు చేయడానికి సుందర్, జడేజా పూర్తి అర్హులు” అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

# ఇంగ్లాండ్ ఆశలపై నీళ్లు.. : ఫైనల్ టెస్ట్‌కు బుమ్రా ఫిట్



భారత్ బౌలింగ్ దళాన్ని కొన్నాళ్లుగా ఆందోళనకు గురిచేస్తున్న సమస్య తీరిపోయింది. ఇంగ్లాండ్‌తో ఓవల్ మైదానంలో జరగనున్న తుదిటెస్ట్‌కు ఏస్ బౌలర్ బుమ్రా ( ఫిట్‌గా ఉన్నాడని కోచ్ గౌతమ్ గంభీర్ ప్రకటించాడు. అంతేకాదు.. స్టార్ బౌలింగ్ దళం మొత్తం తుదిపోరుకు సై అంటోందని వెల్లడించాడు.

ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో తొలి సిరీస్‌ను డ్రా చేయాలంటే మాత్రం ఈ మ్యాచ్ చాలా కీలకం. ఓవల్ మ్యాచ్ ఫలితం తేలడంలో జెస్సీ (పాత్ర కీలకమని భారత్ బలంగా విశ్వసిస్తోంది. ఇప్పటికే ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒక్క దానికి మాత్రమే అతడు విశ్రాంతి తీసుకొన్నాడు.

ఇక మూడో టెస్ట్ తర్వాత గాయపడిన ఆకాశ్‌దీప్ () మ్యాచ్‌లకు దూరంగా అర్ష్‌దీప్ కూడా అందుబాటులో ఉంటారని గౌతీ పేర్కొన్నాడు. సీమర్లలో అందరూ ఫిట్‌గా ఉన్నట్లు వెల్లడించాడు. గాయాలబాధ లేదన్నాడు. ఇక కాంబినేషన్లపై ఇప్పుడే ఎటువంటి చర్చలు జరపడం లేదని చెప్పారు. బుమ్రా ఆడతాడా, లేదా అనే దానిపై కూడా నిర్ణయం తీసుకోలేదు. తుది జట్టులో ఎవరైతే ఉంటారో.. వారు దేశం కోసం తమ పూర్తి శక్తిసామర్థ్యాలతో ఆడాలని వెల్లడించాడు.

ఇక విలేకర్లు కెప్టెన్ గిల్ ను బుమ్రా తుది టెస్ట్ ఆడే విషయంపై ప్రశ్నించగా.. చివరి మ్యాచ్‌కు ఆ విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. “బుమ్రా తుది మ్యాచ్‌కు అందుబాటులో ఉంటే.. అది మాకు గొప్ప విషయం. ఒకవేళ అతడు ఆడకపోయినా.. మా వద్ద మెరుగైన బౌలింగ్ అటాక్ దళం ఉంది” అని వ్యాఖ్యానించాడు.

అప్పుడు బుమ్రాను అన్నారు.. ఇప్పుడు ఇంగ్లాండ్‌కు బెన్‌స్టోక్సే దిక్కా?

స్టోక్స్‌పై గంభీర్ కామెంట్స్..

నాలుగో టెస్ట్ ఐదో రోజు కరచాలన వివాదంపై టీమ్ ఇండియా కోచ్ గంభీర్ స్పందించాడు. టీమ్ ఇండియా నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించాడు. ఎవరైనా 90 లేదా 85 పరుగుల వద్ద ఆడుతుంటే.. వారు శతకాలకు పూర్తిగా అర్హులు. ఈ మైలు రాళ్ల వద్ద వాళ్ల ఆటగాళ్లు ఉంటే ఇంగ్లాండ్ ఆటను ఆపి.. డ్రా చేసుకొని మైదానాన్ని వీడేదా..? లేదు. మా ఆటగాళ్లు అద్భుతంగా ఆడి ఆ మైలురాళ్లను సాధించారు. ఎవరి దయతోనూ కాదు” అని పేర్కొన్నాడు.

మ్యాచ్ మధ్యలో ఆటగాడు తీవ్రంగా గాయపడిన వేళ రీప్లేస్‌మెంట్లు ఉండకూడదు. అదో హాస్యాస్పద విషయం అంటూ బెన్‌స్టోక్స్ మ్యాచ్ అనంతరం చేసిన కామెంట్స్‌ను గౌతీ వ్యతిరేకించాడు. “ ఒకవేళ మ్యాచ్ అంపైర్లు, రెఫరీ పరిశీలించి భారీ గాయంగా భావిస్తే.. సబ్‌స్టిట్యూట్ తీసుకొనేలా నిబంధన ఉండటం చాలా కీలకం. దీనిలో తప్పు ఏమీ లేదు. ముఖ్యంగా ఇలాంటి ఉత్కంఠ సిరీసుల్లో ఇది చాలా కీలకం. 10తో 11 మందిపై ఆడటాన్ని ఊహించుకోండి. ఇలాంటిది మాకు ఎంత ఇబ్బందికరమో అర్థమవుతుంది” అని పేర్కొన్నాడు. నాలుగో టెస్ట్ మధ్యలో కీపర్ పంత్ తీవ్రంగా గాయపడి మైదానానికి దూరమైన విషయం తెలిసిందే.

ఇక మ్యాచ్ చివరిరోజు ఇంకా 15 ఓవర్లు ఉండగానే ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ కరచాలనం ఇస్తూ.. మ్యాచ్‌ను డ్రాగా ముగించాలని భావించాడు అప్పటికి రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ క్రీజులో ఉన్నారు. వీరు శతకాలకు చాలా చేరువలో ఉన్నారు. దీంతో తిరస్కరించి.. మ్యాచ్ కొనసాగించి శతకాలు పూర్తి చేశారు. దీనిపై స్టోక్స్ అసంతృప్తి వ్యక్తంచేశాడు.

# స్టుపిడ్ పనులు చేయొద్దని బ్రూక్‌కు ముందే చెప్పా..: బెన్ స్టోక్స్

ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలోనే ఉంది. భారత్‌తో జరిగిన నాలుగో టెస్టు డ్రాగా ముగియడంతో ఆ జట్టు ఆటగాళ్ల ఫ్రస్ట్రేషన్ తారస్థాయికి చేరుకుంది. ముందే డ్రాకు అంగీకరించి.. కొన్ని ఓవర్లు ఆడటంపై మైదానంలోనే ఇంగ్లిష్ ప్లేయర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు భారత బ్యాటర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ సెంచరీకి చేరువగా ఉన్నప్పుడు ప్రతిపాదన చేయడం గమనార్హం. దీనికి టీమ్‌ఇండియా అంగీకరించలేదనే అక్కసుతో హ్యారీ బ్రూక్‌తో బౌలింగ్ చేయించింది. అతడు ఫుల్‌టాన్‌లు వేయడం, కొట్టుకోండంటూ నెమ్మదిగా బౌలింగ్ చేయడంతో భారత క్రికెట్ అభిమానుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. దీనిపై బెన్ స్టోక్స్ మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రెజెంటేషన్ కార్యక్రమంలో సమాధానం ఇచ్చాడు. అయినా, విమర్శలు తగ్గలేదు. మళ్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనూ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించాడు.





“జడేజా, సుందర్ ఆటను మరోసారి ప్రశంసిస్తున్నా. చాలా బాగా ఆడారు. మ్యాచ్‌ను వారికి అనుకూలంగా మార్చుకోవడంలో వీరిద్దరి భాగస్వామ్యం కీలకం. జట్టును గట్టెక్కించి 80, 90 పరుగులతో నాటౌట్‌గా ఉండటం కంటే సెంచరీతో డగౌట్‌కు చేరుకోవడం ఎక్కువగా సంతృప్తి ఇచ్చి ఉండదని భావిస్తున్నా. అయితే, వారు చాలా బాగా ఆడారనడంలో సందేహం లేదు. పది లేదా అంతకంటే ఎక్కువ ఏదైనా సరే ఫలితం మాత్రం మారదు. కానీ, చాలా క్లిష్ట పరిస్థితుల్లో నుంచి తమ జట్టును కాపాడుకున్నారు. చివరి మ్యాచ్ కంటే ముందు సిరీస్ ఓటమి నుంచి బయటపడ్డారు.

“జట్టు గెలుస్తుందని భావించేవరకూ ప్రధాన బౌలర్లతో బౌలింగ్ చేయించాం. ఇక డ్రా తప్పదని అనుకున్నప్పుడు వారిపై భారం వేయడం సరికాదనిపించింది. వర్క్‌లోడ్ కారణంగా చాలా ఇబ్బందిపడ్డారు. మరో గంట మాత్రమే ఉన్నప్పుడు డ్రా కోసం షేక్‌హ్యాండ్స్ ఇచ్చుకోవచ్చు. భారత్ అందుకు ఆసక్తి చూపించలేదు. దీంతో మా మెయిన్ బౌలర్ల భారాన్ని హ్యారీ బ్రూక్ తీసుకోవాల్సి వచ్చింది. అతడు బౌలింగ్ వేసే సమయంలో మాత్రం ‘నువ్వు ఎలాంటి స్టుపిడ్ పనులు చేయొద్దు. కొత్తగా ప్రయత్నించవద్దు’ అని చెప్పా. మిగతా బౌలర్లు బౌలింగ్ చేయకపోయినా ఇప్పటికే వేం చాలాసేపు ఫీల్డింగ్ చేస్తూ అలసిపోయాం’’ అని బెన్ స్టోక్స్ వ్యాఖ్యానించాడు.

# అంకితకు రజతం

రైన్- రుర్, ఎస్సెన్ (జర్మనీ): ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో భారత స్టీపుల్‌ఛేజర్ అంకిత దయాని మెరిసింది. ఆదివారం ఆమె రజత పతకం సాధించింది. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో తన వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్ 9 నిమిషాల 31.99 సెకన్లతో అంకిత ద్వితీయ స్థానం సాధించింది. మహిళల 20 కిలోమీటర్ల టీమ్ రేస్ వాక్‌లో మునిత ప్రజాపతి, మాన్సి నేగి, సెజల్ సింగ్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. పురుషుల 4ఐ100 మీ రిలేలో భారత్‌కు కాంస్యం లభించింది. లాలు ప్రసాద్ భోయ్, అనిమేష్ కుజుర్, మణికంఠ హెూబ్లింధర్, మృత్యం జయరామ్‌లతో కూడిన భారత బృందం 38.89 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానం సాధించింది. మహిళల 4ఐ400 మీ పరుగులో భారత జట్టు సీజన్ అత్యుత్తమ టైమింగ్ (3 నిమిషాల 35.08 సెకన్లు) నమోదు చేసినా.. పతకం సాధించలేకపోయింది. ఈ పోటీల్లో భారత్ 2 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలు సాధించింది.





## వారిలో 25శాతం మందే ఆన్‌లైన్‌లో షాపింగ్.. కానీ

బయటకువెళ్లి వేచి చూసే పని లేకపోవడం, ఊరించే ఆఫర్లు.. ఇవన్నీ కలిసి ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది . అయితే అమెరికా, చైనాతో పోల్చుకుంటే ఈ విషయంలో భారత్ నాలుగు అడుగులు వెనకే ఉంది. భారత్‌లో 850 మిలియన్ల (85 కోట్లు) మంది ఇంటర్నెట్ వినియోగదారులున్నప్పటికీ వారిలో 20-25 శాతం మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోళు చేస్తున్నారని గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ మెకెన్సీ వెల్లడించింది. రానున్న రోజుల్లో భారత ఈ కామర్స్ రంగం గణనీయమైన వృద్ధి సాధించడానికి అవకాశం ఉందని పేర్కొంది.

అమెరికా, చైనాల్లో ఇంటర్నెట్ వినియోగదారుల్లో 85 శాతం మంది ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నారని పేర్కొంది. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌లో ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారి సంఖ్య భారీగా పెరిగిందని వెల్లడించింది భారతీయులు ఈతరహా షాపింగ్ వైపు మొగ్గుచూపడమే గాకుండా కొత్త ఆలోచనలతో ఈ కామర్స్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నారు. నిమిషాల వ్యవధిలో వస్తువులను ఇంటికి తెచ్చిచ్చే క్విక్ కామర్స్ వేదికలు అందుకు నిదర్శనమని తెలిపింది. కాగా.. 2023 నాటికి దేశ రిటైల్ అమ్మకాల్లో ఈ కామర్స్ వాటా 7 నుంచి 9 శాతంగా ఉండగా.. అది 2030 నాటికి రెట్టింపు అవుతుందని అంచనాలు ఉన్నాయి.




## నంబర్ మర్చిపోయారా? ఇలా తెలుసుకోండి..

ఈపీఎఫ్‌ఖాతాదారులకు యూఏఎన్ నంబర్ చాలా కీలకం. ఉద్యోగ భవిష్యనిధి సంస్థ తమ సభ్యులకు కేటాయించే 12 అంకెల సంఖ్య. దీని ద్వారా సభ్యులు ఆన్‌లైన్‌లో ఈపీఎఫ్ ఖాతాకు సులభంగా లాగిన్ అవ్వొచ్చు. పీఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు, కేవైసీ, బ్యాంకు ఖాతా వివరాలను అప్‌డేట్, ఖాతాల విలీనం వంటివి చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో క్లెయిమ్ చేయాలన్నా ఈ యూఏఎన్ తప్పనిసరి. అలాంటి ఈ సంఖ్య మీ వద్ద లేకపోతే కొన్ని సింపుల్ టిప్స్ ద్వారా తిరిగి పొందొచ్చు.

ఈపీఎఫ్ఓ అధికారిక వెబ్‌సైట్ పోర్టల్‌కు వెళ్లండి. ఆ పేజీలో ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన వివిధ సేవలు అందుబాటులో ఉంటాయి.

హోమ్ పేజీలో 'సర్వీసెస్' సెక్షన్‌కు వెళ్లాలి. దాంట్లో 'ఫర్ ఎంప్లాయీస్' అని ఉంటుంది. దానిపై క్లిక్ చేయాలి. అక్కడ పీఎఫ్ బ్యాలెన్స్ తనిఖీలు, యూఏఎన్‌కు సంబంధించిన అనేక రకాలు సేవలు ఉంటాయి.

'ఫర్ ఎంప్లాయీస్' సెక్షన్ కింద ఉన్న 'మెంబర్ యూఏఎన్/ ఆన్‌లైన్ సర్వీసెస్' పై క్లిక్ చేయండి. అక్కడ యూఏఎన్‌ను తిరిగి పొందడం, కేవైసీ అప్‌డేట్, పాస్‌బుక్ యాక్సెస్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి.

'మెంబర్ యూఏఎన్/ ఆన్‌లైన్ సర్వీసెస్' క్లిక్ చేసి ఈపీఎఫ్ఓ రికార్డుల ప్రకారం మీ పూర్తి పేరు, పుట్టిన తేదీ, పాన్, ఆధార్ వంటి మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేయండి. మీ మొబైల్ నంబర్ ఎంటర్ చేసి, క్యాప్చా టైప్ చేశాక 'రిక్వెస్ట్ ఓటీపీ' పై క్లిక్ చేయండి.

ఇప్పుడు మొబైల్ నంబర్‌కు వన్ టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దాన్ని ధ్రువీకరించడానికి మీకొచ్చిన ఓటీపీని ఎంటర్ చేయండి. తర్వాత 'షో మై యూఏఎన్' పై క్లిక్ చేయండి. మీ యూనివర్సల్ అకౌంట్ నంబర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

## కృత్రిమ మేధను తేలిగ్గా తీసుకుంటున్నారు: ఏఐ పితామహుడు

టెక్ దిగ్గజాలు కృత్రిమమేధ ( ముప్పును తక్కువ అంచనా వేస్తున్నాయని ఏఐ పితామహుడు జెఫ్రీ హింటన్ వ్యాఖ్యలు




చేశారు. ఏఐతో తలెత్తే ప్రమాదాలను టెక్నాలజీ కంపెనీలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు.

"కీలక శాస్త్రవేత్తలు ఏఐ ముప్పును తక్కువ చేసి చెప్తున్నారని నా అభిప్రాయం. డెమిస్ హస్సాబిస్ (డీప్‌మైండ్ సంస్థ సీఈఓ) వంటివారు ఈ ముప్పును (అర్థం చేసుకొని, దానిని ఎదుర్కొనేందుకు పనిచేయాలనుకుంటున్నారు. తొలినాళ్లలో ఈ ప్రమాదాన్ని గుర్తించనందుకు చింతిస్తున్నాను" అని అన్నారు. దశాబ్దం పాటు సేవలు అందించి 2023లో హింటన్ గూగుల్‌ను వీడారు. ఏఐని విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావడానికి గూగుల్ చేస్తోన్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆయన వెళ్లిపోయారని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. అయితే అందులో వాస్తవం లేదని తాజాగా ఆయన వెల్లడించారు.

అప్పటికి తన వయసు 75 ఏళ్లని, ఆశించినమేర పనిచేయలేకపోవడం వల్లే ఆ సంస్థను వీడినట్లు చెప్పారు. అయితే ఇప్పుడు తాను ఏఐ ముప్పు గురించి స్వేచ్ఛగా మాట్లాడగలనని వ్యాఖ్యానించారు. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లో చేసిన కృషికిగానూ హింటన్‌కు 2024లో ఫిజిక్స్ విభాగంలో నోబెల్ వరించింది. ఆ రంగంలో దశాబ్దకాలం పాటు ఆయన చేసిన కృషి ఫలితమే ఇప్పుడు ఏఐ విప్లవానికి దోహదం చేసింది. కృత్రిమ మేధ ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. దానిపై గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వ్యక్తులకు వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని సూచించారు.

## టీసీఎస్‌లో 12,000 ఉద్యోగాల కోత

దిల్లీ: దేశంలో అగ్రగామి ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 12,261 మంది ఉద్యోగులను అంతర్జాతీయంగా తొలగించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. అంతర్జాతీయ అనిశ్చితులు, కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ మార్పుల కారణంగానే ఈ తొలగింపులు చేయాల్సి వస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు కోసం సిద్ధమయ్యే ప్రయాణంలో సంస్థ ఉంది. ఇందుకోసం సిబ్బందికి నూతన సాంకేతికతల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రత్యామ్నాయం కల్పించలేని పరిస్థితుల్లోనే కొంత మందిని తొలగించాలని నిర్ణయించాం. 6,13,069 మంది ఉద్యోగుల్లో వీరు 2 శాతానికి సమానం. మధ్య, సీనియర్ స్థాయి మేనేజర్లపై ఈ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది' అని ఒక అధికార ప్రకటనలో టీసీఎస్ పేర్కొంది.




ఈ నిర్ణయానికి కారణాలివీ

భారత ఐటీ సేవల రంగం 283 బి.డాలర్ల (దాదాపు రూ.25 లక్షల కోట్ల) ఆదాయ స్థాయికి చేరింది. మన దేశంలోని అతిపెద్ద ఐటీ సేవల కంపెనీల్లో టీసీఎస్ అగ్రస్థానంలో ఉంది. ఈ విభాగంలో కంపెనీకి ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, ఏఐ టెక్నాలజీల కారణంగా ఎదురవుతున్న అవాంతరాలతో ఐటీ సంస్థలకు వ్యాపార గిరాకీపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కృత్రిమ మేధ కారణంగా ఐటీ సేవల రంగంలో కంపెనీల వైఖరి మారుతోంది. ప్రాజెక్టుల ధర విషయంలో క్లయింట్లు 20-30% తగ్గింపును డిమాండ్ చేస్తుండటం ఇందుకు నేపథ్యంగా చూడొచ్చు. ఈ పరిస్థితుల్లో లాభాల మార్జిన్లు కాపాడుకోవడం కోసం, టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య తగ్గించుకోవాలని నిర్ణయించింది. జూన్ త్రైమాసికం చివరకు టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉంది. తాజాగా దాదాపు 12,200 మందిని తొలగించాలని నిర్ణయించారు. ఉద్యోగులను స్థిరంగా ఉంచే టీసీఎస్ కూడా ఈ కఠిన నిర్ణయం తీసుకోవడంతో.. పరిశ్రమలో ఇదే తరహా ధోరణి పెరగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కఠిన నిర్ణయాల్లో ఒకటి: కృతివాసన్

బలమైన టీసీఎస్‌ను నిర్మించే ప్రక్రియలో భాగంగా, తాము తీసుకున్న కఠిన నిర్ణయాల్లో ఉద్యోగుల తొలగింపు నిర్ణయం ఒకటని టీసీఎస్ సీఈఓ కృతివాసన్ వెల్లడించారు. 'ఏఐ వంటి కొత్త సాంకేతికత ఫలితంగా పెనుమార్పులను గుర్తించాం. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలంటే చురుగ్గా వ్యవహరించాలి. ఇందుకోసం ఏఐను వినియోగిస్తూ.. ఉద్యోగుల నైపుణ్యాలను మదింప చేస్తున్నాం. ఉద్యోగుల తొలగింపు కారణంగా ప్రాజెక్టులపై ఎటువంటి ప్రభావం ఉండదు. ఇది చాలా కఠిన సమయం' అని పేర్కొన్నారు. తొలగించే ఉద్యోగులకు ప్రయోజనాలు, ఔట్‌ప్లేస్‌మెంట్ సేవలు, పొడిగించిన బీమా కవరేజీ ఇస్తామని కంపెనీ తెలిపింది.

'ఏడాదిలో కనీసం 225 రోజుల పాటు ప్రాజెక్టులో ఉండాలని, బెంచ్‌పై ఉండే రోజుల సంఖ్య గరిష్ఠంగా 35 రోజులు మాత్రమే' అంటూ బెంచ్ విధానాన్ని టీసీఎస్ సవరించింది. దీనిని సవాల్ చేస్తూ పలువురు టీసీఎస్ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించిన కొన్ని రోజుల్లోనే.. ఉద్యోగుల తొలగింపు ప్రకటన వెలువడటం గమనార్హం.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అగ్రగామి ఆరు ఐటీ కంపెనీల నియామకాలు ఏడాది క్రితంతో పోలిస్తే 72% తగ్గాయి. గత మూడు నెలల్లో ఈ కంపెనీలన్నీ కలిపి 3,847 మందిని నియమించుకున్నాయి. ఏడాది క్రితం ఈ సంఖ్య 13,935గా ఉంది.

## రూ.7,300 కోట్ల సమీకరణకు 14 ఐపీఓలు

దిల్లీ: ఈ వారం ఐపీఓ మార్కెట్ కళకళలాడనుంది. 14 పబ్లిక్ ఇష్యూలు దలాల్ స్ట్రీట్‌ను పలకరించనున్నాయి. ఇందులో 5 ఐపీఓలు ప్రధాన (మెయిన్‌బోర్డ్) విభాగం నుంచి కాగా, మిగిలినవి ఎస్‌ఎంఈ విభాగం నుంచి ఉన్నాయి. మెయిన్ బోర్డ్ కంపెనీలే రూ.7,008 కోట్లు




సమీకరించనుండగా, మొత్తం 14 ఐపీఓల మొత్తం రూ.7,300 కోట్లకు చేరనుంది. ఇంకో 12 కంపెనీల షేర్లు స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో నమోదు కానున్నాయి.

ఎస్‌ఎంఈ విభాగంలో..

ఈ విభాగంలో 9 పబ్లిక్ ఇష్యూలు రాబోతున్నాయి. ఉమియా మొబైల్ రూ.24.88 కోట్లు, రెపోనో రూ.26.68 కోట్లు సమీకరించబోతున్నాయి. ఈ నెల 28న ఈ ఇష్యూలు ప్రారంభమవుతాయి. 29న ప్రారంభమయ్యే కేటెక్స్ ఫ్యాబ్రిక్స్ ఇష్యూ రూ.69.81 కోట్లు సేకరించనుంది. ఈ నెల 30న టేక్యాన్ నెట్‌వర్క్స్ (రూ.20.5 కోట్లు), మెహుల్ కలర్స్ (రూ.21.66 కోట్లు), బీడీ ఇండస్ట్రీస్ (రూ.45.36 కోట్లు) ఐపీఓలు ప్రారంభం కానున్నాయి. రెనోల్ పాలీకెమ్ (రూ.25.77 కోట్లు), క్యాష్ యువర్ డ్రైవ్ మార్కెటింగ్ (రూ.60.79 కోట్లు) ఇష్యూలు ఈ నెల 31న, ఫ్లైస్‌బీస్ ఏవియేషన్ ఐపీఓ ఆగస్టు 1న శ్రీకారం చుడతాయి.

బ్రిగేడ్ హోటల్ వెంచర్స్, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ ఇష్యూలు ఈ నెల 28, 29 తేదీల్లో ముగియనున్నాయి. ఎస్‌ఎంఈ విభాగంలో ఈ నెల 25న ప్రారంభమైన పటేల్ కెమ్ స్పెషాల్టీస్, శ్రీ రెఫ్రిజెరేషన్స్, సెల్లోరాప్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూలు 29న ముగియనున్నాయి.

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కాబోతున్న షేర్లు

ప్రధాన విభాగం నుంచి ఇండిక్యూబ్ స్పేసెస్, జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ షేర్లు ఈ నెల 30నబీ బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఈనెల 31న, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ షేరు ఆగస్టు 1న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదవుతాయి.

ఎస్‌ఎంఈ విభాగం నుంచి సావీ ఇన్‌ఫ్రా అండ్ లాజిస్టిక్స్, స్వస్తిక కాస్టాల్ షేర్లు ఈ నెల 28న, మోనార్క్ సర్వేయర్స్ అండ్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ 29న, టీఎస్‌సీ ఇండియా 30న నమోదు కానున్నాయి. పటేల్ కెమ్ స్పెషాల్టీస్, శ్రీ రెఫ్రిజెరేషన్స్, సెల్లోరాప్ ఇండస్ట్రీస్ షేర్లు ఆగస్టు 1న నమోదు కాబోతున్నాయి.

## బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబయి: దేశీయ మార్కెట్లు సోమవారం నష్టాలను మూటగట్టుకున్నాయి. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, కీలక రంగాల షేర్లలో అమ్మకాలను మార్కెట్లను




కుదిపేశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, రియల్టీ రంగ సూచీలు ( నష్టపోవడం సూచీలను కిందకు పడేసింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 570 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,700 మార్క్‌ను కోల్పోయింది.

ఈ ఉదయం 81,299.97 వద్ద స్వల్ప నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ (%ావఅంవఇ%) తొలుత కాస్త కోలుకున్నట్లు కన్పించింది. కానీ, మధ్యాహ్నం తర్వాత మరింత పతనమైన సూచీ.. ఇంట్రాడేలో 80,776.44 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 572.07 పాయింట్లు కిందకు వెళ్లి 80,891.02 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ (%చీఐట్ఎ%) కూడా 156.10 పాయింట్లు నష్టపోయి 24,680.90 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు తగ్గి 86.66గా ముగిసింది.

ఫార్మా మినహా అన్ని రంగాల సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. రియల్టీ సూచీ ఏకంగా 4 శాతం పతనమైంది. మీడియా సూచీ దాదాపు 3శాతం, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, లోహ, టెలికాం రంగ సూచీలు 1-1.5 శాతం మేర పడిపోయాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, హీరో మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్, హిందుస్థాన్ యునిలివర్ షేర్లు రాణించగా.. కొటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, ఇండస్ ఇండ్‌బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి.

భారత శక్తి

మంగళవారం, 29 జూలై 2025


# సభలో సిందూరం



- ఆపరేషన్ సిందూర్‌పై వాడీవేడీ చర్చ
- పార్లమెంట్‌లో సోమవారం కొనసాగిన రభస
- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చ చేపట్టాలని రాజ్యసభలో పట్టుబట్టిన విపక్షసభ్యులు
- పార్లమెంట్ మకర ద్వారం ముందు విపక్షాల ఆందోళనలు
- న్యూఢిల్లీ: పహల్గాం ఉదంతం, ఆపరేషన్ సిందూర్‌పై తక్షణం చర్చ
- జరపాలన్న విపక్షాల డిమాండ్లకు తలొగ్గి సోమవారం వివరణలతో చర్చను మొదలెట్టిన అధికార పక్షం, ప్రభుత్వ వివరణను తీవ్రంగా తప్పుబడుతూ విపక్షసభ్యులు చేసిన నినాదాలతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ప్రభుత్వం తరఫున రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లు లోక్‌సభలో సుదీర్ఘంగా మాట్లాడారు.

**మొదటి పేజీ తరువాయి**

న్యూఢిల్లీ: పహల్గాం ఉదంతం, ఆపరేషన్ సిందూర్‌పై తక్షణం చర్చ జరపాలన్న విపక్షాల డిమాండ్లకు తలొగ్గి సోమవారం వివరణలతో చర్చను మొదలెట్టిన అధికార పక్షం, ప్రభుత్వ వివరణను తీవ్రంగా తప్పుబడుతూ విపక్షసభ్యులు చేసిన నినాదాలతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ప్రభుత్వం తరఫున రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లు లోక్‌సభలో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వాదనను బలంగా వినిపించారు. ఇదేసమయంలో జైశంకర్ ప్రసంగాన్ని విపక్ష సభ్యులు అడ్డుకోవడం, అడ్డుకున్నందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యంచేసుకుని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడంతో సభలో ఆగ్రహావేశాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఓవైపు ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతుండగానే బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణపైనా చర్చ జరపాలని విపక్ష సభ్యులు రాజ్యసభలో పట్టుబట్టారు. దీంతో సభ పలుమార్లు వాయిదాపడి చివరకు అర్థాంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడింది. పాక్ కాళ్లబేరానికి వచ్చిందితొలుత లోక్‌సభలో ఆపరేషన్‌సిందూర్‌పై చర్చపై రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. " ఆపరేషన్ సిందూర్ అనేది మమ్మాటికీ చరిత్రాత్మకమైన సైనిక చర్య. ఉగ్రవాదంపై అత్యంత ప్రభావవంతమైన భారత విధానాన్ని ఈ ఆపరేషన్ ప్రపంచానికి చాటింది. యుద్ధరంగంలో తమ ధైర్యసాహసాలను ప్రదర్శించిన ధైర్యవంతులైన సైనికులందరికీ నా సెల్యూట్. పాక్ పౌరులకు, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పక్కా ప్రణాళికతో ఈ ఆపరేషన్‌కు పథకరచన చేశారు. కేవలం ఉగ్రవాదులకే భారీ నష్టం చేకూర్చాం. కేవలం 22 నిమిషాల్లో 9 కీలక ఉగ్రస్థావరాలపై మెరుపుదాడి చేసి మన సత్తా చాటాం. ఊహించని మెరుపుదాడితో చేష్టలుడిగిన పాక్ డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) స్వయంగా ఫోన్ చేసి తమకు ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశ్యంలేదని స్పష్టంచేశారు. ఆలోపు పాక్ జరిపిన డ్రోన్, క్షిపణి దాడులను మన ఎస్%-%400 గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా నిర్వీర్యంచేశాయి. మన దాడులకు ప్రతీగా పాక్ జరిపిన దాడుల్లో భారత్‌లో ఏ ఒక్క కీలక స్థావరం, ఆయుధాగారం దెబ్బ తినలేదు. ఉగ్రవాదుల స్థావరాలు, వాళ్లకు మద్దతిచ్చేవాళ్లను అంతంచేసేందుకే ఆ ఆపరేషన్. లక్ష్యం నెరవేరిన కారణంగానే ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశాం. ఇందులో ఎవరి బలవంతం, ప్రోద్బలం, ప్రమేయం లేవు. బయటిశక్తుల (అమెరికా, ట్రంప్) కారణంగానే పాక్‌పై మనం దాడులను ఆపేశామనడంలో వాస్తవం లేదు. భారత వాయుసేన అసాధారణ దాడులు, సరిహద్దు వెంట ఆర్మీ దీటైన జవాబుకు తోడు నావికాదళం దాడులకు దిగొచ్చన్న భయాలతో పాక్ కాళ్లబేరానికొచ్చింది" అని రాజ్‌నాథ్ స్పష్టంచేశారు. "మమ్మల్ని విపక్షాలు అడగదల్చుకుంటే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా? అని ఒక్కటే ప్రశ్న వేయాలి. అందుకే మేం అవును అని సూటి సమాధానం చెప్తాం. పాక్ దాడుల్లో మన సైనికులెవరూ వీరమరణం పొందలేదు. ఏ పరీక్షలోనైనా ఫలితమే ముఖ్యం. పరీక్ష రాసేటప్పుడు పెన్సిల్ విరగడము, కలం కనిపించకుండా పోవడమూ సాధారణం. పరీక్షలో ఉత్తీర్ణత సాధించడమే ముఖ్యం. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను సైనికదళాలు 100 శాతం కచ్చితత్వంతో సాధించాయి. పాక్‌తోగానీ మరే ఇతర దేశంతోగానీ ఎప్పుడూ విజయవంతమైన ప్రభుత్వాల సారథ్యంలో స్నేహాన్నే భారత్ కోరుకుంటోంది. గతంలో భారత్ 'లాహోర్ బస్సు యాత్ర' బాషలో మాట్లాడితే ధూర్త పాక్‌కు బోధపడలేదు. వాళ్లకు అర్థమయ్యేలా ఈసారి మేం 'బాలాకోట్ దాడి' భాషలో మాట్లాడాం. భారత్ ఏ దేశంతోనైనా కరచాలనం కోసం స్నేహహస్తమే అందిస్తుంది. చేతిని మెలిపెట్టాలని చూస్తేమాత్రం ఆ చేతినే విరిచేస్తుంది.




## జైపాల్‌రెడ్డికి నివాళి

**మొదటి పేజీ తరువాయి**

కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోవ-ంవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని స్మృతి స్థల్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. వీరితోపాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు జైపాల్‌రెడ్డికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

## కృష్ణా జలాల వివాదంపై సుప్రీంకోర్టు ప్రశ్న

**మొదటి పేజీ తరువాయి**

వాది 'మధ్యస్థం' అని నవ్వుతూ సమాధానమిచ్చారు. అప్పుడు జస్టిస్ మన్మోహన్ స్పందిస్తూ మీరిప్పుడు ఉత్తర్వులు జారీ చేశారా? లేదంటే చేయడం లేదా? అని ప్రశ్నించగా... తామెలాంటి ఉత్తర్వులూ జారీ చేయలేదన్నారు. ఏపీ తరఫు న్యాయవాది ఉమాపతి జోక్యం చేసుకుంటూ వారు 2021లోనే నోటిఫికేషన్ జారీ చేశారని, దాన్ని అమలు చేయాలని కోరుతూ తాము రిట్‌పిటిషన్ వేశామన్నారు.




# ఢిల్లీలోనే తేల్చుకుంటాం

- బీసీ రిజర్వేషన్లపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఆందోళనలకు కార్యాచరణ
- హస్తినకు వెళ్లనున్న సీఎం, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు

**మొదటి పేజీ తరువాయి**

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఢిల్లీలోనే తేల్చుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకోసం సీఎం, మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలందరూ ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఢిల్లీకి తరలివెళ్లాలని తీర్మానించింది. రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోసం విజ్ఞప్తి చేయాలని, సానుకూల స్పందన రాకుంటే కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కార్యాచరణ సిద్ధం చేసింది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం వివరాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. శాసనసభలో బిల్లులకు మద్దతు తెలిపిన భాజపా నాయకులు ఇప్పుడు మోకాలడ్డుతున్నారని, కడుపులో కత్తులు పెట్టుకుని మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ సీఎం, లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలు అడుగుతున్నారని, మూడు రోజుల కార్యక్రమానికి రాష్ట్రం నుంచి మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ కలిసి ఢిల్లీ వెళ్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేస్తున్న పోరాటానికి బీసీ మేధావులు, సంఘాలు, రిజర్వేషన్లు కోరుకుంటున్నవారంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50 శాతం పరిమితి దాటిపోయిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ సామ, దాన, భేద, దండోపాయాల పద్ధతిలో ముందుకువెళ్తుందని, కేంద్రం సానుకూలంగా స్పందించకుంటే నిరసన తెలియజేస్తామని వారు పేర్కొన్నారు.

బీసీల లబ్ధికి కట్టుబడి ఉన్నాం.. "రాష్ట్రంలో బీసీలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి ఆర్డినెన్సు వరకు వారికి న్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. ఈ ఏడాది మార్చి 17న ప్రభుత్వం రెండు బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టింది. ఇందులో ఒకటి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించింది కాగా... మరొకటి విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేది. వీటిని అన్ని రాజకీయ పార్టీల సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదింపజేశారు. బిల్లులను మార్చి 22న గవర్నర్‌కు పంపించగా... వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం ఆయన మార్చి 30న పంపించారు. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి సకాలంలో నిర్ణయాలు తీసుకోవాలన్న సుప్రీంకోర్టు, మద్రాస్ హైకోర్టు తీర్పులను పరిశీలిస్తున్నాం. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. తెలంగాణ ఏర్పాటైన తరువాత అప్పటి సీఎం కేసీఆర్.. 2018 పంచాయతీ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతంలోపు ఉండాలన్న నిబంధన చేర్చారు. దాన్ని సవరిస్తూ 50 శాతం పరిమితిని ఎత్తివేస్తూ జులై 10న మా ప్రభుత్వం ఆర్డినెన్సు ముసాయిదా జారీ చేసింది. దాన్ని గవర్నర్‌కు జులై 14న పంపించాం. ఎన్నికలు నిర్వహించాలని కోర్టు చెప్పింది...స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు హైకోర్టు గడువు విధించింది. మరోవైపు కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు రావడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకుని బిల్లులను ఆమోదింపజేయాలని కోరుతున్నాం.

# త్వరలో ఒకటే స్టాంపు పేపర్!

- రూ.20, రూ.50 ఎన్‌జేఎస్ పేపర్ల రద్దు యోచన
- అన్నింటికీ రూ.100 స్టాంపు పేపరే వాడకం
- కొన్ని వర్గాలకు, కొన్ని పనుల్లో 'స్టాంపు'మినహాయింపు
- బూట్ పద్ధతిలో చేపట్టే పనులపై 0.5 శాతం స్టాంపు డ్యూటీ
- సరికొత్త విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

**మొదటి పేజీ తరువాయి**

బహుళ ప్రయోజనకరంగా ఉపయోగించే నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల (ఎన్‌జేఎస్) విధానంతోపాటు అనేక అంశాల్లో మార్పులు చేస్తూ కొత్త స్టాంపుల విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు మొదలుపెట్టింది. కొత్త విధానంలో స్టాంపు డ్యూటీ విధింపు, మినహాయింపుల్లో కూడా మార్పులు రానున్నాయి. కొత్త పాలసీ ప్రభుత్వ పరిశీలనలో ఉందని, చర్చల అనంతరం దీనికి తుదిరూపు ఇస్తారని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

లాభం లేదు.. భారమే అధికం

రాష్ట్రంలో ప్రస్తుతం రూ.20, రూ.50, రూ.100 స్టాంపు పేపర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం లైసెన్సులు జారీ చేసిన స్టాంపు వెండార్లతోపాటు రిజిస్ట్రేషన్ల శాఖ వీటిని ప్రజలకు అందుబాటులో ఉంచుతోంది. రూ.50 వేల విలువ వరకు జరిగే లావాదేవీలకు రూ.20.. రూ.లక్ష లోపు లావాదేవీలకు రూ.50.. రూ.లక్ష కంటే ఎక్కువ విలువ ఉండే లావాదేవీలకు రూ.200 చొప్పున (రూ.100 స్టాంపు పేపర్లు రెండు) స్టాంపు పేపర్లను ఉపయోగిస్తున్నారు. పలు రకాల అఫిడవిట్లు, డిక్లరేషన్లు, ఒప్పంద పత్రాలు, సేల్‌డీడ్‌లు, కంపెనీల మధ్య ఒప్పందాలు తదితర అనేక లావాదేవీల్లో వీటిని ఉపయోగిస్తుంటారు.

ప్రస్తుతం భౌతికమైన స్టాంపు పేపర్లతోపాటు ఆన్‌లైన్ ఫార్మాట్ (ఫ్రాంకింగ్)లో ఈ స్టాంపు పేపర్లు అందుబాటులో ఉంటున్నాయి. వీటిని నాసిక్‌లోని ముద్రణాలయం నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, వీటి నిర్వహణ, సీలింగ్, పేపర్, రవాణా లాంటి ఖర్చులు కలిపితే రూ.20, రూ.50 స్టాంపులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వానికి వాటి విలువ కంటే ఎక్కువ ఖర్చువుతోందని, స్టాంపు వెండార్లకు ఇచ్చే 5 శాతం కమీషన్ కలిపితే వీటి అమ్మకాల వల్ల ప్రభుత్వంపై అధిక భారం పడుతోందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రూ.20, రూ.50 స్టాంపు పేపర్లను రద్దు చేయాలని, రూ.100 విలువైన పేపర్లను మాత్రమే అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా స్టాంపు పేపర్ల సరఫరా నుంచి ప్రభుత్వం పూర్తిగా తప్పుకుని ఫ్రాంకింగ్ విధానంలో మాత్రమే ముందుకెళ్లేలా కొత్త పాలసీలో పెట్టాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

## హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు




### నియామక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

**మొదటి పేజీ తరువాయి**

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. న్యాయవాదుల కోటా నుంచి గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌లను అదనపు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో వీరిని అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మతోపాటు కొత్తగా అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఈ నెల 31న ప్రమాణం చేసే అవకాశం ఉంది.

## తుక్కు పాలసీ తుస్సు!

**మొదటి పేజీ తరువాయి** ,

హైదరాబాద్: కాలం చెల్లిన వాహనాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తుక్కు పాలసీ తుస్సుమంటోంది. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చే వాహనదారులకు రవాణాశాఖ సముచితమైన ప్రోత్సాహకాలను ప్రకటించినా వాహనదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. ఢిల్లీ వంటి నగరాల్లో కాలం చెల్లిన వాహనాలపై నిర్బంధంగా నిషేధం విధిస్తున్నారు.

హైదరాబాద్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు ప్రత్యేక కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినా.. ప్రస్తుతం ఒక నెల వ్యవధిలో కనీసం 25 వాహనాలు కూడా తుక్కు కావడం లేదని అధికారులు చెబుతున్నారు. తుక్కు బండ్లు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ పొగలు చిమ్ముతున్నాయి. ప్రమాదకరమైన సల్ఫర్, కార్బన్‌మోనాక్సైడ్ వంటి కాలుష్య కారకాలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి.

వ్యక్తిగత వాహనాలే టాప్... నగరంలో 15 ఏళ్లు దాటిన వాటిలో వ్యక్తిగత వా హనాలే టాప్‌లో ఉన్నాయి. రవాణా శాఖ లెక్కల ప్రకారం సుమారు 17 లక్షల బైక్‌లు, మరో 3.5 లక్షల కార్లు తిరుగుతున్నాయి. రవాణా వాహనా ల కేటగిరీలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, ఆటోలు తదితర వాహనాలు సైతం కాల పరిమితి ముగిసిన తర్వాత కూడా వినియోగంలో ఉన్నాయి. ఇవి కాకుండా మరో లక్ష వరకు సరుకు రవాణా వాహనాలు ఉన్నట్లు అంచనా.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana .Published at Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy